

RNI NO:TELTEL/ 2023/89546

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక


## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326


రంగారెడ్డి | సంపుటి : 3 | సంచిక : 191 | పేజీలు : 12 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | బుధవారం 19 నవంబర్ 2025 | వెల : 4/-



## ఉగ్రవాదం నుంచి ప్రజలను రక్షించుకునే హక్కు భారత్‌కు ఉంది

- షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ సమ్మిట్‌లో జైశంకర్ సందేశం
- ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా సహించకూడదన్న జైశంకర్
- ఉగ్రవాదాన్ని ఏట్టి పరిస్థితుల్లో సహించకూడదన్న జైశంకర్

2



## ఈవీఎంను ట్యాంపరింగ్ చేయడం అసాధ్యం

- ఈవీఎంలలో ముందే 25 వేల ఓట్లు..
- ఆరోపణలపై స్పందించిన ఎన్నికల సంఘం
- ఈవీఎంలలో ముందే 25 వేల ఓట్లు పడ్డాయని ఆర్జేడీ నేత ఆరోపణ
- సాంకేతికంగా అసాధ్యమని తేల్చి చెప్పిన ఎన్నికల సంఘం

2

## 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తెలంగాణ

- రాష్ట్రాలకు కేంద్రం సహకరిస్తే మరింత దేశాభివృద్ధి
- హైదరాబాద్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలి
- మెట్రో విస్తరణ, రీజనల్ రింగ్, గోదావరి జలాల తరలింపు, మూసీ ప్రక్షాళనతో పాటు వివిధ అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వ సహకారం అందించాలి
- రాబోయే ఏడాదిలో 3 వేల ఎలక్ట్రిక్ బస్సులను హైదరాబాద్ నగరంలో తీసుకురావాలని ప్రణాళికలు వేస్తున్నాం
- ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేయాలి



హైదరాబాద్

దేశానికి పెద్దన్నగా ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకరిస్తే అన్ని రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని హోటల్ ఐటీసీ కోహినూర్‌లో నైరుతి రాష్ట్రాల పట్టణాభివృద్ధి మంత్రుల ప్రాంతీయ సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం త్వరగా అనుమతులు మంజూరు చేయాలని కోరారు. ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశం భారతదేశమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి - మిగతా3లో



## అర్బన్ నక్సల్స్ బ్లాక్ మెయిలర్స్

- అర్బన్ నక్సలైట్లను నమ్మి మోసపోకండి
- మావోయిస్టులకు బండి సంజయ్ పిలుపు
- ఏ పార్టీ అధికారంలో ఉన్నా అర్బన్ నక్సలైట్లు పైరవీలు చేసుకుంటారని ఆరోపణ
- అర్బన్ నక్సలైట్ల మాటలు నమ్మి అమాయక పేదలు తుపాకీ పట్టి అడవుల్లో తిరుగుతున్నారని విమర్శ
- అర్బన్ నక్సలైట్లు దేశద్రోహులంటూ ఫైర్

హైదరాబాద్

మావోయిస్టులు అర్బన్ నక్సలైట్లను నమ్మి మోసపోవద్దని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సూచించారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా అర్బన్ నక్సలైట్లు పైరవీలు చేసుకుంటూ ఆస్తులు పోగేసుకుంటున్నారని ఆయన ఆరోపించారు. - మిగతా3లో

## ఐబొమ్మ రవి కేసులో ఈడీ రంగప్రవేశం

- మనీలాండరింగ్ జరిగినట్టు అనుమానం
- ఐ-బొమ్మ కేసు దర్యాప్తులోకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్
- మనీలాండరింగ్ కోణంలో విచారణకు ఈడీ సిద్ధం
- బెట్టింగ్ యాప్స్, క్రిప్టో వాలెట్ల ద్వారా నిధుల సమీకరణ
- నిందితుడి ఖాతాలోని రూ.3.5 కోట్లను ఇప్పటికే ఫ్రీజ్ చేసిన పోలీసులు

## ఏఐతో అన్ని కంపెనీలపై ప్రభావం పడుతుంది

- ఆల్ఫాబెట్ సీఈవో సుందర్ పిచాయ్ కీలక వ్యాఖ్యలు
- ఒకవేళ ఏఐ విస్ఫోటనం చెందితే, దాని ప్రభావం అన్ని కంపెనీలపై ఉంటుంది
- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై పెట్టుబడులు పెరుగుతున్నాయి



## మళ్ళీ బీఆర్ఎస్సే అధికారంలోకి వస్తుంది

- రైతుల సమస్యలు పరిష్కారం చేస్తాం
- కేసీఆర్ ఎల్లావేలలా అండగా ఉంటారు
- కేసీఆర్ హయాంలో రైతులకు ఎటువంటి కష్టం లేకుండా చూసుకున్నాం
- ఊరూరా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రతీ ధాన్యం గింజ కొన్నాం
- 21న జాతీయ రహదారుల దిగ్బంధం.. భారీగా తరలిరావాలని అన్నదాతలకు కేటీఆర్ పిలుపు

ఆదిలాబాద్:

మళ్లీ బీఆర్ఎస్ పార్టీనే అధికారంలోకి వస్తుందని, రైతుల సమస్యలను పరిష్కరిస్తుందని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రైతులు అధైర్య పడకూడదని, రైతులకు అండగా బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కేసీఆర్ ఎల్లావేలలా అండగా ఉంటారని అన్నదాతలకు ధైర్యం చెప్పారు. కేసీఆర్ హయాంలో రైతులకు ఎటువంటి కష్టం లేకుండా చూసుకున్నామని, ఊరూరా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రతీ ధాన్యం గింజ - మిగతా3లో





## అలా చేస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా

- ఎన్నికల ముందు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మహిళలకు రూ. 10 వేల చొప్పున అకౌంట్లలో వేయకపోతే జేడీయూ పార్టీకి ఖచ్చితంగా 25లోపు సీట్లు వచ్చేవి
- ఎన్నికల్లో ఇచ్చిన రూ.2 లక్షల హామీని కూటమి ప్రభుత్వం నెరవేరిస్తే తాను రాజకీయాలనుంచి శాశ్వతంగా తప్పుకుంటా
- జేడీయూ పార్టీ మహిళలకు రూ. 2లక్షలు ఇస్తానని ఆశజూపి ప్రతి మహిళ బ్యాంకు ఖాతాలలో తొలివిడతగా రూ.10 వేలు జమచేసింది

## తెలంగాణలో నాలుగు జాతీయ రహదారులకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

- 271 కి.మీ. మేర రూ.10,034 కోట్లతో ఈ నాలుగింటిని నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధం
- తెలంగాణలో నాలుగు జాతీయ రహదారుల నిర్మాణం
- ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్మాణానికి కేంద్రం పచ్చ జెండా
- అటవీ, రైల్వే అనుమతులు పూర్తి
- డిసెంబరులో టెండర్ల ప్రక్రియ ముగిసిన అనంతరమే పనులు ప్రారంభించేలా ఎన్‌హెచ్ఏఐ ఏర్పాట్లు



హైదరాబాద్

రాష్ట్రంలో ఈ ఆర్థిక సంవత్సరం ఎన్‌హెచ్ఏఐ చేపట్టదలచిన నాలుగు జాతీయ రహదారులకు కేంద్రం పచ్చజెండా ఊపింది. జగిత్యాల-కరీంనగర్, ఆర్మూర్-జగిత్యాల, జగిత్యాల-మంచిర్యాల జాతీయ రహదారులకు తాజాగా టెండర్లను ఆహ్వానించింది. నాలుగో జాతీయ రహదారైన మహబూబ్‌నగర్-గూడెబల్లూర్ హైవేకి సంబంధించిన టెండర్లను గత నెలలోనే పిలిచింది. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) 271 కి.మీ. మేర రూ.10,034 కోట్లతో ఈ నాలుగింటిని నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. డిసెంబరులో టెండర్ల ప్రక్రియ ముగిసిన అనంతరమే జనవరి, ఫిబ్రవరి నెలలో ఈ పనులు ప్రారంభించేలా ఎన్‌హెచ్ఏఐ ఏర్పాట్లు చేయనుంది. జగిత్యాల-మంచిర్యాల హైవేని ఈపీసీ(ఇంజినీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ కన్‌స్ట్రక్షన్) పద్ధతిలో నిర్మించనున్నారు. మిగిలిన మూడింటిని హ్యామ్ (హైబ్రిడ్ యాన్యుటీ మోడల్)లో ఏర్పాటు చేయనున్నారు. ఈ నాలుగింటికీ పర్యావరణ, అటవీ, రైల్వే అనుమతులు పూర్తి అయ్యాయి. మహబూబ్‌నగర్-గూడెబల్లూర్ వరకు - మిగతా3లో



## శబరిమలలో జనమేజనం..! భక్తులపై ఆంక్షలు

- ఇకపై 20 వేల మందికే స్పాట్ బుకింగ్
- ఆ సంఖ్య దాటితే.. తర్వాతి రోజు స్లాట్ కేటాయింపు
- నీలక్కల్ వద్ద భారీగా ట్రాఫిక్ జామ్
- అయ్యప్ప దర్శనానికి 6 గంటల సమయం
- కుప్పకూలి మృతిచెందిన 58 ఏళ్ల భక్తురాలు

# అలా చేస్తే రాజకీయాలనుంచి తప్పుకుంటా

బిహార్ ఎన్నికల ఫలితాలపై జన సూరజ్ పార్టీ అధినేత విమర్శనాత్మక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ముందు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మహిళలకు రూ. 10 వేల చొప్పున అకౌంట్లలో వేయకపోతే జేడీయూ పార్టీకి ఖచ్చితంగా 25లోపు సీట్లు వచ్చేయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన రూ.2 లక్షల హామీని కూటమి ప్రభుత్వం నెరవేరిస్తే తాను రాజకీయాలనుంచి శాశ్వతంగా తప్పుకుంటానని ?ప్రశాంత్ కిషోర్ సవాల్ విసిరారు. జేడీయూ పార్టీ మహిళలలకు రూ. 2లక్షలు ఇస్తానని ఆశజూపి ప్రతి మహిళ బ్యాంకు ఖాతాలలో తొలివిడతగా రూ.10 వేలు జమచేసిందని ప్రశాంత్ కిషోర్ తెలిపారు. ఇలా ఒక్కో నియోజకవర్గానికి 10 వేల నుండి 60 వేల మంది వరకూ డబ్బులు జమచేసిందన్నారు. ఒక వేళ ఆ విధంగా చేయకుంటే తాను అంచనా వేసిన విధంగా జేడీయూకి 25 సీట్లు దాటేవి కాదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.5 కోట్ల మంది మహిళలకు స్వయం ఉపాది కార్యక్రమాలకు గానూ రూ. 2 లక్షలు ఖాతాల్లో జమ చేస్తానని హామీ ఇచ్చిందని తెలిపారు ఒకవేళ ఎన్డీఏ కూటమి హామీ ఇచ్చిన విధంగా 1.5 కోట్ల మంది మహిళలకు స్వయం ఉపాధి కార్యక్రమాలకు ఆ డబ్బులు చెల్లిస్తే తాను రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని ప్రశాంత్ కిషోర్ సవాల్ విసిరారు. ఇటీవల జరిగిన బిహార్ ఎన్నికల్లో పొలిటికల్ స్ట్రాటజిస్ట్ ప్రశాంత్ కిషోర్ పార్టీ ఘోర పరాజయం పాలైంది. ఆ ఎన్నికల్లో 200కు పైగా స్థానాల్లో పోటీ చేసినప్పటికీ కనీసం ఒక్కచోట కూడా ?జన సూరజ్ పార్టీ విజయం సాధించలేదు దీంతో ప్రశాంత్ కిషోర్ పై సర్వత్రా విమర్శలు



వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల ఫలితాలపై ప్రశాంత్ కిషోర్ స్పందించారు. బిహార్ ఎన్నికల్లో ఓటమికి తానే పూర్తిస్థాయి బాధ్యత వహిస్తున్నానని ఎన్నికల్లో గెలవడానికి సిరీయస్‌గా కష్టపడ్డప్పటికీ ఓట్లు సాధించడంలో విఫలమయ్యామన్నారు. అందుకు గానూ తనను క్షమించాలని కోరారు. దేశవ్యాప్తంగా ఓట్లచోరీ జరుగుతుందని ఈ విషయమై జాతీయ పార్టీలంతా చర్చలు జరపాలని అవసరమైతే సుప్రీంకోర్టును ఆశ్రయించాలని పీకే కోరారు. ఎన్డీఏ కూటమి ఎన్నికల హామీల్లో ఇ?చ్చిన విధంగా 6 నెలల్లో మహిళల రూ. 2లక్షలు జమచేయకపోతే జన సూరజ్ పార్టీ వారి పక్షాన పోరాడుతుందని ప్రశాంత్ కిషోర్ తెలిపారు.

# శబరిమలలో జనమేజనం..! భక్తులపై ఆంక్షలు


**పథనంతిట్ట:** ముందెన్నడూ లేనివిధంగా మండల పూజ ప్రారంభం నుంచే శబరిమలకు అయ్యప్ప భక్తులు పోటెత్తారు. ఆదివారం సాయంత్రం సన్నిధానంలో అయ్యప్ప స్వామి ఆల యం తలుపులు తెరుచుకోగా.. సోమవారం రికార్డు స్థాయిలో 1.25 లక్షల మంది భక్తులు ఆ హరిహరపుత్రుడిని దర్శించు కున్నారు. నిజానికి ఆన్‌లైన్‌లో రోజుకు 70 వేల మందికి స్లాట్ బుకింగ్ అవకాశం కల్పించారు. అదనంగా 20వేల మందికి స్పాట్ బుకింగ్‌కు ఏర్పాట్లు చేశారు. అ యితే.. సోమవారం ఏకంగా 37 వేల మంది భక్తులు స్పాట్ బుకింగ్ చేసుకున్నా రని, అందుకే రద్దీ విపరీతంగా పెరిగిందని ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు(టీడీబీ) అధికారులు చెబుతున్నారు.

**భారీ క్యూలైన్లు**

సోమవారం నుంచి నీలక్కల్, పంపాబేస్, శబరిమల సన్నిధానం కిక్కిరిసిపోయింది. ఎక్కడ చూసినా.. ఇసుకేస్తే రాలనంతగా భక్తులు కనిపిస్తున్నారు. పంపా కంట్రోల్ రూమ్ వద్ద బస్సు దిగిన భక్తులు త్రివేణీ బ్రిడ్జిని దాటడానికి అరగంట పట్టిందని, అక్కడి నుంచి పంపా గణపతి ఆలయానికి చేరుకోవడానికి గంట సమయం పట్టిందని కర్ణాటకలోని చిక్‌బళ్లాపూర్‌కు చెందిన సుందరేశ అనే భక్తుడు 'సాక్షి డిజిటల్'కి వివరించారు. ఇక శరణ్‌గుత్తి ప్రాంతంలోనూ నిమిషానికి నాలుగు అడుగులు వేసేలా రద్దీ ఉందని హైదరాబాద్‌కు చెందిన పవన్ కుమార్ గురుస్వామి వివరించారు. మారక్కూటం నుంచి 18 మెట్ల వరకు గంట సమయం.. పదునెట్టాంబడిని అధిరోహించాక.. అయ్యప్ప స్వామి దర్శనానికి మరో గంట పడుతోందని పేర్కొన్నారు. వృద్ధులు, చిన్నారులను నేరుగా ధ్వజస్తంభం నుంచి అయ్యప్ప దర్శనానికి వదులుతున్నా.. 18 మెట్లను చేరేవరకు వారికి ఇబ్బందులు తప్పడం లేదని సైదాబాద్‌కు చెందిన రవికుమార్ గురుస్వామి తెలిపారు. నీలిమలను అధిరోహించినప్పటి నుంచి భక్తులు అయ్యప్ప దర్శనం చేసుకోవడానికి 6 గంటల సమయం పడుతున్నట్లు వివరించారు.

**నీలక్కల్‌లోనే నిలిపివేత**

భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో పంపాలో స్పాట్ బుకింగ్ కౌంటర్ల సంఖ్యను 7కు పెంచినట్లు అధికారులు తెలిపారు.



అయితే.. పంపా బేస్‌లో రద్దీని బట్టి ఆన్‌లైన్ బుకింగ్ లేని భక్తులను నీలక్కల్‌లో నిలిపివేస్తున్నామన్నారు. నీలక్కల్‌లో భక్తులకు వసతి సదుపాయాలున్నాయని వెల్లడించారు. అటు పంపాబేస్ నుంచి నీలిమలను అధిరోహించాక శరణ్‌గుత్తి, మారక్కూటం క్యూకాంప్లెక్సుల్లో తాగునీరు, స్నాక్స్, టీ, కాఫీ అందజేసే వెసులుబాట్లు కల్పిస్తామన్నారు. ప్రతిచోట సిబ్బందిని నియమించామన్నారు. రద్దీని అదుపుచేయడానికి ఎక్కడికక్కడ పోలీసులను మోహరించినట్లు అదనపు డీజీపీ ఎస్.శ్రీజిత్ వివరించారు. భక్తులు పరిస్థితిని అర్థం చేసుకుని, పోలీసులకు సహకరించాలని కోరారు. "సోమవారం 20 వేల మందికి స్పాట్ బుకింగ్‌కు ఏర్పాట్లు చేశాం. అయితే.. 37 వేల మంది భక్తులు వచ్చారు. అందుకే.. బుధవారం నుంచి 20 వేల స్పాట్ బుకింగ్ నిబంధనను కచ్చితంగా పాటిస్తాం. అదనంగా వచ్చే భక్తులకు తర్వాతి రోజు స్లాట్లను కేటాయిస్తాం" అని ఆయన వెల్లడించారు. ఈ సీజన్‌లో మంగళవారం మధ్యాహ్నం వరకు 1.97 లక్షల మంది భక్తులు అయ్యప్పను దర్శించుకున్నట్లు తెలిపారు.

**నీలక్కల్ వద్ద భారీగా ట్రాఫిక్**

శబరిమలకు వ్యక్తిగత వాహనాల్లో వచ్చే భక్తుల సంఖ్య పెరగడంతో.. ఎరుమేలి-పంపా, రాణి-పంపా మార్గాల్లో భారీగా ట్రాఫిక్ జామ్‌లు నెలకొంటున్నాయి. ముఖ్యంగా ప్లాపల్లి, నీలక్కల్ వద్ద వాహనాలు నత్తనడకను తలపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మరిన్ని ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కాగా.. అప్పాచిమేడు ప్రాంతంలో ఓ భక్తురాలు కుప్పకూలి మృతిచెందారు. ఆమెను కోళిక్కోడ్ జిల్లా కోయిలాండికి చెందిన సతీ(58)గా పోలీసులు గుర్తించారు. భారీ క్యూలైన్ల కారణంగా ఆమె ఊపిరి ఆడక.. ఉక్కిరిబిక్కిరి అయ్యి.. మరణించినట్లు తెలుస్తోంది.

# 'ఇళ్లా.. ఇంద్ర భవనాలా?' కొత్త ఎమ్మెల్యేలకు పండుగే!

**పట్నా:** బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన ఎమ్మెల్యేలు నూతన సర్కారు నుంచి బంపర్ బహుమతి అందుకోనున్నారు. కొత్తగా ఎన్నికైన 243 మంది ఎమ్మెల్యేల కోసం పట్నాలోని దరోగా రాయ్ పాత్‌లో నిర్మించిన 181 అధునాతన డ్యూప్లెక్స్‌ల నిర్మాణం పూర్తయ్యింది. అంతకు ముందు ఉన్న 62 బంగ్లాలకు అదనంగా నిర్మించిన ఈ నివాసాలు మొత్తం 44 ఎకరాల క్యాంపస్‌లో విస్తరించి ఉన్నాయి. ఈ నూతన భవనాలను చూసినవారంతా ఇవి 'ఇళ్లా.. ఇంద్ర భవనాలా?'అని అంటున్నారు. ప్రతి యూనిట్ సుమారు 3,693-3,700 చదరపు అడుగుల విస్తీర్ణంతో 4%దీఎఖ% ఫార్మాట్‌లో ఈ ఇళ్లను నిర్మించారు. వాటిలో విలాసవంతమైన సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ప్రతి డ్యూప్లెక్స్ లేఅవుట్ ఎంతో ప్లానింగ్‌తో కనిపిస్తుంది. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఎమ్మెల్యేలకు అవసరమైన గెస్ట్ రూమ్, పీఏ రూమ్, ఆఫీస్ రూమ్,కిచెన్ ఉన్నాయి. మొదటి అంతస్తులో మాస్టర్ బెడ్‌రూమ్‌తో సహా మూడు గదులు, మొత్తం ఆరు టాయిలెట్‌లు ఉన్నాయి. అన్ని గదులలో ఫర్నీచర్ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే హాస్టల్, క్యాంటీన్, కమ్యూనిటీ సెంటర్ తదితర అదనపు సౌకర్యాలను క్యాంపస్‌లో ఏర్పాటు చేశారు. ఈ కొత్త కాంప్లెక్స్ పర్యావరణ అనుకూలతలతో నిర్మితమయ్యింది. భవన నిర్మాణంలో మౌలిక సదుపాయాలకు



పెద్దపీట వేశారు. వర్షపునీటి సేకరణ వ్యవస్థలను ఏర్పాటు చేయడంతో పాటు, మురుగునీటిని శుద్ధి చేసి, తోటల పెంపకానికి తిరిగి ఉపయోగించే ప్రక్రియను అమలు చేస్తున్నారు. విద్యుత్తును ఆదా చేయడానికి ఎల్‌ఈడీ వీధి దీపాలను వినియోగిస్తున్నారు. క్యాంపస్‌లో పచ్చదనాన్ని పెంపొందించడానికి పచ్చని చెట్లను పెద్ద ఎత్తున నాటారు. ఈ అత్యాధునిక సౌకర్యాలు, పర్యావరణ అనుకూల చర్యలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. ప్రతి డ్యూప్లెక్స్‌పై దానిని కేటాయించిన ఎమ్మెల్యే పేరు, నియోజకవర్గ సంఖ్యను రాశారు. తద్వారా ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గ ప్రజలతో మరింత సమర్థవంతంగా కనెక్ట్ అయ్యేందుకు అవకాశం ఏర్పడుతుంది.

## ఉగ్రదాడులు.. బిర్యానీ, దావత్ వంటి కోడ్ నేమ్స్‌తో సంభాషించుకున్న వైద్యులు



ఢిల్లీ పేలుడు ఘటనపై దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. హర్యానాలోని ఫరీదాబాద్‌లో బయటపడ్డ వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ సభ్యులను అధికారులు విచారిస్తున్నారు. వారి ఫోన్లను కూడా స్వాధీనం చేసుకొని పరిశీలిస్తున్నారు. ఈ దర్యాప్తులో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. వారి చాట్స్‌లో కొన్ని కోడ్ పదాలు బయటపడ్డాయి. టెర్రర్ వైద్యులు ఎవరికీ అనుమానం రాకుండా ఉండటానికి బాంబు, దాడి కుట్రల గురించి చర్చించడానికి బిర్యానీ దావత్ వంటి పదాలను ఉపయోగించినట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. ఉగ్రనెట్‌వర్క్‌లో కీలకంగా వ్యవహరించిన డాక్టర్ షాహిన్ సాహిద్‌ను 'మేడమ్ సర్జన్'గా పిలిచేవారని తేలింది. అంతేకాదు, అలాంటి మరికొన్ని కోడ్ నేమ్‌లు బయటకు వచ్చాయి. ఎన్‌క్రిప్టెడ్ యాప్‌లో కమ్యూనికేషన్ కోసం ఇలాంటి పదాలను వాడినట్లు అధికారులు గుర్తించారు. బిర్యానీని పేలుడు పదార్థాలకు కోడ్ పదంగా, దావత్‌ను దాడికి కోడ్ పదంగా ఉపయోగించినట్లు సంబంధిత అధికారులు గుర్తించారు. ఢిల్లీ పేలుళ్ల వెనుక ఉన్న వైద్యులు ముజమ్మిల్ షకీల్, ఉమర్ ఉన్ నబీ, షాహీన్ సయీద్, అదీల్ రాదర్.. ఇవే కోడ్ పదాలతో దాడి గురించి చర్చించుకున్నట్లు తేలింది. 'బిర్యానీ ఈజ్ రెడీ.. తినేందుకు సిద్ధం కండి' అంటే దాడి కోసం బాంబు సిద్ధంగా ఉందని అర్థంగా అధికారులు గుర్తించారు

## ఉగ్రవాదం నుంచి ప్రజలను రక్షించుకునే హక్కు భారత్‌కు ఉంది



భారత ప్రజలను ఉగ్రవాదం నుంచి రక్షించుకునే హక్కు దేశానికి ఉందని కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. రష్యాలో జరిగిన షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ సమ్మిట్‌లో ఆయన ఉగ్రవాదానికి వ్యతిరేకంగా గట్టిగా మాట్లాడారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా దానిని సహించకూడదని ఆయన అన్నారు. ఉగ్రవాదం విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించే ధోరణి ఉండకూడదని ఆయన తేల్చి చెప్పారు. ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించరాదని స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం అనేది ఉమ్మడి ప్రాధాన్యంగా ఉండాలని సూచించారు. ఉగ్రవాదంపై రాజీలేని పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా జైశంకర్ రష్యాలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్‌సీవో సదస్సులో పాల్గొన్నారు. అంతకుముందు రష్యా విదేశాంగ మంత్రి సెర్గి లవ్రోవ్‌తో ఆయన సమావేశమయ్యారు. ఇరువురు ద్వైపాక్షిక, ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై చర్చలు జరిపినట్లు సమాచారం.

## ఏఐతో అన్ని కంపెనీలపై ప్రభావం పడుతుంది



**లాస్ ఏంజిల్స్:** కృత్రిమ మేధ గురించి గూగుల్ సంస్థకు చెందిన ఆల్ఫాబెట్ సీఈవో సుందర్ పిచాయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఒకవేళ ఏఐ విస్ఫోటనం చెందితే, దాని ప్రభావం అన్ని కంపెనీలపై ఉంటుందన్నారు. ప్రముఖ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై పెట్టుబడులు పెరుగుతున్నాయని, ఇదో అసాధారణ సందర్భమని, ప్రస్తుతం కొనసాగుతున్న ఏఐ బూమ్‌లో హేతుబద్ధత లేదన్నారు. అన్ని కంపెనీలు ఏఐపై అతిగా ఇన్వెస్ట్ చేస్తున్నట్లు వస్తున్న వార్తలతో సిలికాన్ వ్యాలీలో కొంత ఆందోళనకరమైన అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఏఐ విస్ఫోటనాన్ని ఎదుర్కొనే రీతిలో గూగుల్ సంస్థ సిద్ధంగా ఉందా అని అడిగిన ప్రశ్నకు సుందర్ పిచాయ్ బదులిస్తూ.. ఆ తుఫాన్‌ను తమ కంపెనీ తట్టుకుటుందని, కానీ ఏదైనా సాధ్యమే అని ఆయన వార్నింగ్ ఇచ్చారు. నిజం చెప్పాలంటే ఏ కంపెనీ కూడా ప్రభావానికి లోనుకాకుండా ఉండలేదన్నారు. ఆ జాబితాలో తాము కూడా ఉంటామన్నారు. చాట్‌జీపీటీ, ఓపెన్‌ఏఐతో పోటీ ఉన్న నేపథ్యంలో ఆల్ఫాబెట్‌కు పెట్టుబడులు రెట్టింపు అయ్యాయి. ఏఐకి చెందిన సూపర్ చిప్స్‌ను ఆల్ఫా సంస్థ డెవలప్ చేస్తున్నది. ఏఐ చెప్పే విషయాన్ని గుడ్డిగా నమ్మకూడదని పిచాయ్ అన్నారు.

## ఈవీఎంను ట్యాంపరింగ్ చేయడం అసాధ్యం




బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్‌కు ముందే ఈవీఎంలలో 25 వేల ఓట్ల చొప్పున ఓట్లు పడ్డాయన్న ఆర్జేడీ సీనియర్ నేత జగదానంద సింగ్ ఆరోపణలపై ఎన్నికల సంఘం స్పందించింది. ఆయన ఆరోపణలను ఖండిస్తున్నట్లు తెలిపింది. బీహార్ తీర్పు ప్రజల అభీష్టాన్ని ప్రతిబింబించలేదని, ఈవీఎంలలో అవకతవకలు జరిగినందున న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశం లేకపోలేదని ఆర్జేడీ సోమవారం పేర్కొంది. పోలింగ్ ప్రారంభానికి ముందే ప్రతి ఈవీఎంలలో 25 వేల ఓట్లు పడ్డాయని, అయినప్పటికీ తాము 25 సీట్లు సాధించామని జగదానంద సింగ్ అన్నారు. ఈ ఆరోపణలపై స్పందించిన ఎన్నికల సంఘం, ఇది సాంకేతికంగా అసాధ్యమని స్పష్టం చేసింది. ఎన్నికల ప్రక్రియలో అనుసరించిన నిబంధనల ప్రకారం ఇవి తప్పుడు ఆరోపణలని పేర్కొంది. పోలింగ్‌కు ముందు 25 వేల ఓట్లు ఉండటం అనేది అసాధ్యమని తెలిపింది. ఈవీఎంలకు బ్లూటూత్, ఇంటర్నెట్, ఇతర కనెక్షన్లు ఏవీ ఉండవని గుర్తు చేసింది. బయటి నుంచి ఈవీఎంను యాక్సెస్ చేయడం లేదా డిజిటల్ ట్యాంపరింగ్ చేయడం అసాధ్యమని తెలిపింది. పోలింగ్‌కు ముందు ఈవీఎంలలో ప్రతి అభ్యర్థికి సున్నా ఓట్లు కనిపిస్తాయని తెలిపింది. పార్టీల ఏజెంట్ల సమక్షంలోనే మాక్ పోలింగ్ నిర్వహిస్తారని తెలిపింది. ఆ తర్వాత మాక్ పోల్ ఓట్లను కూడా తొలగిస్తారని వెల్లడించింది. ఈవీఎంల పంపిణీ కూడా ర్యాండమ్‌గా ఉంటుందని, కాబట్టి ఏ ఓటింగ్ యంత్రం ఏ పోలింగ్ కేంద్రానికి వెళుతుందో ఎవరూ చెప్పలేరని స్పష్టం చేసింది. పోలింగ్ ప్రక్రియ ప్రతి దశలో పార్టీల ఏజెంట్లు ఉంటారని తెలిపింది. రెండు విడతల్లోనూ ఆర్జేడీ ఒక్కసారి కూడా అభ్యంతరాలు చెప్పలేదని ఎన్నికల సంఘం తెలిపింది. జగదానంద్ సింగ్ కూడా ఆధారాలను సమర్పించలేదని వెల్లడించింది. మాక్ పోల్ సర్టిఫికెట్లు, ఫామ్ 17సీ, ఇతర పత్రాలపై ఆర్జేడీ సొంత ఏజెంట్లు సంతకం చేశారని తెలిపింది. కానీ ఇప్పుడు అందుకు విరుద్ధంగా ఆరోపణలు చేస్తున్నట్లు పేర్కొంది.

# 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తెలంగాణ

-మొదటిపేజీ తరువాయి

వ్యాఖ్యానించారు. వికసిత్ భారత్ 2047 అనుగుణంగా 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా దేశాన్ని తీర్చిదిద్దాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పనిచేస్తున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కేంద్రమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ని కోరారు.

**అనుమతులు వేగంగా జారీ చేయాలి..**

వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన అనుమతులు వేగంగా జారీ చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఇవాళ(హైదరాబాద్)లో అర్బన్ డెవలప్‌మెంట్ మినిస్టర్స్ రీజనల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. మెట్రో విస్తరణ, రీజనల్ రింగ్, గోదావరి జలాల తరలింపు, మూసీ ప్రక్షాళనతో పాటు వివిధ అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం సహకారం అందించాలని సూచించారు. రాబోయే ఏడాదిలో 3 వేల ఎలక్ట్రిక్ బస్సులను హైదరాబాద్ నగరంలో తీసుకురావాలని ప్రణాళికలు వేస్తున్నామని పేర్కొన్నారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. డిసెంబర్ 9వ తేదీన తెలంగాణ రైజింగ్ -2047 విజన్ డాక్యుమెంట్ విడుదల చేయబోతున్నామని తెలిపారు. 2034 నాటికి వన్ ట్రిలియన్ డాలర్స్ ఎకానమీగా, 2047 నాటికి మూడో ట్రిలియన్ డాలర్స్ ఎకానమీగా తెలంగాణను తీర్చిదిద్దే లక్ష్యంతో తాము పనిచేస్తున్నామని చెప్పుకొచ్చారు. దేశ ఎకానమీలో 10 శాతం ఎకానమీని తెలంగాణ నుంచి అందించాలని భావిస్తున్నామని పేర్కొన్నారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.



**భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి కృషి..**

హైదరాబాద్ నగర అభివృద్ధితో పాటు తాము భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయబోతున్నామని తెలిపారు. రాష్ట్రంలో డ్రై పోర్టు ఏర్పాటు చేయాలనే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని వివరించారు. తమ పోటీ ఇతర రాష్ట్రాల నగరాలతో కాదని.. తమ పోటీ సింగపూర్, టోక్యో, న్యూయార్క్ నగరాలతో ఉంటుందని.. ఇందుకు కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరమని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. జీడీపీలో ప్రధానంగా 5 మెట్రోపాలిటన్ నగరాలైన ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ దేశానికి ఎంతో కీలకంగా ఉన్నాయని అన్నారు. హైదరాబాద్ మెట్రో రైలు, ఆర్ఆర్ఆర్, మూసీ అభివృద్ధికి కేంద్రం సహకారం ఉండాలని కోరారు. మోదీ గుజరాత్ మోడల్ రూపొందించినట్లే తాము తెలంగాణ మోడల్ తీసుకువచ్చామని, కాబట్టి తన రాష్ట్రానికి ఇచ్చిన సహకారం తమకూ ఇవ్వాలని అన్నారు. మోదీ సబర్మతి ప్రక్షాళన చేసినట్లుగా తాము మూసీని చేస్తున్నామని అన్నారు.

**అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీతో కీలక ఒప్పందం...**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ఎడ్యుకేషన్ అకాడమీ ఏర్పాటుకు కామన్వెల్త్ ఆఫ్ లెర్నింగ్‌తో అవగాహన ఒప్పందాన్ని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ కుదుర్చుకుంది. ఈ అవగాహన ఒప్పందంతో ప్రముఖ డిజిటల్ విశ్వవిద్యాలయంగా అభివృద్ధి చెందనుంది అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ. బోధన, అభ్యాసం, పరిశోధనలను మెరుగుపరచడానికి ఐడీఈఏ అత్యాధునిక డిజిటల్ హబ్‌గా పనిచేస్తుంది. టెక్నాలజీ ద్వారా నాణ్యమైన విద్యను అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అందించనుంది. తెలంగాణలో విద్యా ప్రమాణాలు పెంచడంతో పాటు వ్యవస్థలో మార్పులు తీసుకురావడానికి తమప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు సీఎం రేవంత్‌రెడ్డి. రాష్ట్రంలోని యూనివర్సిటీలను బలోపేతం చేయడంతో పాటు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీని ఒక నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఓఎల్ అధ్యక్షుడు పీటర్ స్కాట్‌కు వివరించారు ముఖ్యమంత్రి. ఈ సమావేశంలో కామన్వెల్త్ ఆఫ్ లెర్నింగ్ అధ్యక్షుడు అండ్ సీఈవో పీటర్ స్కాట్ ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఘంటా చక్రపాణి, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణలో నాలుగు జాతీయ రహదారులకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

-మొదటిపేజీ తరువాయి

80 కి.మీ. మేర రూ.2,662 కోట్లతో జాతీయ రహదారిని ఏర్పాటు చేస్తారు. దీని కోసం 465.7 హెక్టార్ల భూసేకరణ అవసరం కానుంది.

జగిత్యాల-మంచిర్యాల హైవేని 68 కి.మీ. మేర రూ.2,550 కోట్లతో ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు 317 హెక్టార్ల భూసేకరణ జరగాల్సి ఉంది.

ఆర్మూర్-జగిత్యాల జాతీయ రహదారిని 64 కి.మీ. మేర రూ.2,338 కోట్లతో నిర్మాణం చేయనున్నారు. మొత్తం 288.3 హెక్టార్ల భూసేకరణ చేయనున్నారు.

జగిత్యాల-కరీంనగర్? హైవేని 59 కి.మీ. మేర రూ.2,484 కోట్లతో నిర్మాణం చేయనున్నారు. ఇందుకు మొత్తం 306.7 హెక్టార్ల భూసేకరణ అవసరం కానుంది.

ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగం ఆరు వరుసలుగా : ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం పనుల సవరణ టెండర్లకు ఎన్‌హెచ్ఏఐ సిద్ధం అవుతోంది. ఈ ఆర్థిక సంవత్సరంలోనే ఆ పనులు పూర్తి చేసేలా ప్రణాళికలు రచిస్తోంది. గతేడాది డిసెంబరులో సంగారెడ్డి జిల్లాలోని గిర్మాపూర్ నుంచి యాదాద్రి జిల్లాలోని తంగడ్‌పల్లి వరకు మొత్తం 161 కి.మీ. మేర నాలుగు వరుసల రహదారిని నిర్మించనున్నారు. ఇందుకు రూ.7,104 కోట్లను ఖర్చు చేయనున్నారు. ఇందుకు టెండర్లను పిలిచారు. అయితే ట్రాఫిక్ సర్వేకు అనుగుణంగా ఆరు వరుసలుగా అభివృద్ధి చేసిన తర్వాత మళ్లీ దీనిపై నిర్ణయం తీసుకున్నారు. తాజాగా ఇందుకు సంబంధించిన వాటికి కేంద్రం కూడా పచ్చజెండా ఊపింది. రూ.15,627 కోట్లతో మొత్తం 160 కి.మీ. మేర ఆరు వరుసలుగా ఆర్?ఆర్?ఆర్? ఉత్తర భాగాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయం తీసుకుంది. గతంలో ఈపీసీ పద్ధతిలో టెండర్లు పిలిచారు. కానీ హ్యామ్? విధానంలోనే పనులు చేపట్టేలా ఆహ్వానం పంపనున్నారు.



రాష్ట్రంలో రోడ్లు, భవనాల శాఖ పరిధిలోని రహదారులను హైబ్రిడ్? యాన్యుటీ మోడల్?(హ్యామ్?) పద్ధతిలో అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఇది వరకే సంకల్పించుకుంది. ఈ విధానం మహారాష్ట్రలో విజయవంతం కాగా, ఆర్? అండ్? బీ శాఖకు చెందిన అధికారుల బృందం ఆ రాష్ట్రంలో అధ్యయనం చేసింది. రాష్ట్రంలో రహదారుల విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంటోంది. ఇందుకు వేల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తోంది.

## అర్బన్ నక్సల్స్ బ్లాక్ మెయిలర్స్

-మొదటిపేజీ తరువాయి

రాజన్న సిరిసిల్ల పర్యటనకు వచ్చిన ఆయన వేములవాడ ఏరియా ఆసుపత్రికి రూ. 1.5 కోట్ల విలువైన వైద్య పరికరాలను అందజేసే కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, మావోయిస్టులు అర్బన్ నక్సలైట్ల మాటలు నమ్మి మోసపోవద్దని అన్నారు. వారి మాటలు నమ్మి అమాయక పేదలు తుపాకీ పట్టి అడవుల్లో తిండి తిప్పలు లేక తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మావోయిస్టుల చావుకు అర్బన్ నక్సలైట్లు కారణమని అన్నారు.అర్బన్ నక్సలైట్లు దేశద్రోహులని ఆయన మండిపడ్డారు. నక్సలైట్లు ఇప్పటికైనా తుపాకీని వీడి జనజీవన స్రవంతిలో కలవాలని పిలుపునిచ్చారు. మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవడానికి మరో నాలుగు నెలల గడువు మాత్రమే ఉందని అన్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి మావోయిజాన్ని అంతం చేసి తీరుతామని ఆయన పేర్కొన్నారు.

**అనుకున్న దాని కంటే ముందే..**

మావోయిస్టు ఉద్యమానికి భారీ ఎదురుదెబ్బ తగిలింది. కేంద్ర కమిటీ సభ్యుడు, మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు కమాండర్ మద్వి హిడ్మా ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో మంగళవారం ఉదయం భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య జరిగిన భీకర కాల్పుల్లో ఈ ఘటన చోటుచేసుకుంది. విశేషమేమిటంటే, నవంబర్ 30లోపు హిడ్మాను పట్టుకోవాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా విధించిన గడువుకు 12 రోజుల ముందే భద్రతా బలగాలు ఈ లక్ష్యాన్ని ఛేదించాయి.మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో ఆంధ్రప్రదేశ్-ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దుల్లో భద్రతా బలగాలు కూంబింగ్ ఆపరేషన్ నిర్వహిస్తుండగా మావోయిస్టులు తారసపడ్డారు. దీంతో ఇరువర్గాల మధ్య భీకరమైన ఎదురుకాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో హిడ్మా తీవ్ర గాయాలతో మరణించాడు. ఘటనా స్థలం నుంచి ఆయుధాలు, కీలకమైన మావోయిస్టు డాక్యుమెంట్లను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి.ఈ పరిణామంపై ఏపీ డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా స్పందించారు. "ఏపీ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టుల కదలికలపై అందిన పక్కా సమాచారంతోనే ఈ ఆపరేషన్ చేపట్టాం. నక్సలిజం నిర్మూలనలో ఇది ఒక మైలురాయిగా నిలుస్తుంది" అని ఆయన తెలిపారు.దేశవ్యాప్తంగా 2026 మార్చి నాటికి నక్సలిజాన్ని పూర్తిగా అంతం చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న విషయం తెలిసిందే. ఈ ప్రణాళికలో భాగంగానే హిడ్మా లాంటి అగ్రనేతలే లక్ష్యంగా బలగాలు ముందుకు సాగుతున్నాయి. హిడ్మా మృతితో మావోయిస్టు అండర్‌గ్రౌండ్ నెట్‌వర్క్‌కు కోలుకోలేని దెబ్బ తగిలినట్లయిందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ విజయంతో బలగాలు ఆ ప్రాంతంలో కూంబింగ్‌ను మరింత ముమ్మరం చేశాయి.

## ఐబొమ్మ రవి కేసులో ఈడీ రంగప్రవేశం

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన పైరసీ వెబ్‌సైట్ 'ఐ-బొమ్మ' కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. ఈ కేసులో భారీగా ఆర్థిక అవకతవకలు, మనీలాండరింగ్ జరిగినట్లు అనుమానిస్తున్న ఈడీ, లోతైన దర్యాప్తు చేపట్టేందుకు సమాయత్తమవుతోంది. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు, ఎఫ్ఐఆర్, దర్యాప్తు నివేదికలను తమకు అందించాలని కోరుతూ ఈడీ అధికారులు హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు లేఖ రాశారు. పోలీసుల నుంచి వివరాలు అందిన వెంటనే ఈడీ అధికారులు తమ విచారణను అధికారికంగా ప్రారంభించనున్నారు. ఐ-బొమ్మ వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమ్మడి రవికి బెట్టింగ్ యాప్‌ల ప్రకటనల ద్వారా భారీగా నిధులు అందినట్లు గతంలో పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. అంతేకాకుండా, ఓ క్రిప్టో వాలెట్ నుంచి రవికి చెందిన ఎన్నారై ఖాతాకు ప్రతి నెలా రూ.15 లక్షలు బదిలీ అయినట్లు కూడా గుర్తించారు. ఈ నేపథ్యంలోనే విదేశీ నిధుల ప్రవాహం, హవాలా లావాదేవీలపై ఈడీ దృష్టి సారించింది. ఇప్పటికే పోలీసులు నిందితుడు రవికి చెందిన బ్యాంకు ఖాతాల్లోని సుమారు రూ.3.5 కోట్లను ఫ్రీజ్ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఈడీ ఎంట్రీతో నిందితుడి బ్యాంకు ఖాతాల నిర్వహణ, నిధుల మళ్లింపుపై పూర్తి స్థాయిలో విచారణ జరగనుంది.

# మళ్ళీ బీఆర్ఎస్సే అధికారంలోకి వస్తుంది

-మొదటిపేజీ తరువాయి

కొన్నామని గుర్తుచేశారు.

పండించిన పంట కొనే దిక్కులేక, పట్టించుకొనే నాథుడు లేక సంక్షోభంలో చిక్కుకున్న రైతాంగానికి బాసటగా నిలవాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించింది. మద్దతు ధర అం దక దగాపడ్డ రైతులకు భరోసా ఇచ్చేందుకు పోరుబాట పట్టేందుకు సన్నద్ధమైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుతో రాష్ట్రంలో రైతులు పడుతున్న అష్టకష్టాలను ఎలుగెత్తి చాటాలని నిశ్చయించింది. ఇందులో భాగంగా కేటీఆర్ ఆదిలాబాద్ పత్తి మార్కెట్ యార్డును సందర్శించారు. బోథ్ నియోజకవర్గంలోని నేరడిగొండ జిన్నింగ్ మిల్లు వద్ద సోయాబీన్, మొక్కజొన్న పంట కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు.

**ఎవరూ అధైర్య పడకండి.. రైతులకు కేటీఆర్ భరోసా**

ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గం నేరడిగొండ జిన్నింగ్ మిల్లు వద్ద సోయాబీన్, మొక్కజొన్న పంట కొనుగోలు కేంద్రాలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరిశీలించారు. రైతులు ఎవరూ అధైర్య పడకండి, మీకు అండగా బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ ఎల్లవేళలా అండగా ఉంటామని రైతులకు కేటీఆర్ ధైర్యం చెప్పారు. మళ్ళీ బీఆర్ఎస్సే అధికారంలోకి వస్తుంది.. రైతుల సమస్యలు పరిష్కారం చేస్తామని ఆయన అన్నారు. కేసీఆర్ హయాంలో రైతులకు ఎటువంటి కష్టం లేకుండా చూసుకున్నామని, ఊరూరా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రతీ ధాన్యం గింజ కొన్నామని కేటీఆర్ గుర్తుచేశారు.

**21న జాతీయ రహదారుల దిగ్బంధం.. భారీగా తరలిరావాలని అన్నదాతలకు కేటీఆర్ పిలుపు**

ఈ నెల 21న నిర్వహించనున్న జాతీయ రహదారుల దిగ్బంధం కార్యక్రమానికి ఆదిలాబాద్ అన్నదాతలు భారీగా తరలి రావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. రైతాంగం ముఖ్యంగా పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని ప్రభుత్వంపైన ఒత్తిడి తీసుకువచ్చేందుకు కేటీఆర్ పార్టీ సీనియర్ నేతలతో కలిసి ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించారు. ఆదిలాబాద్ పట్టణంలోని మార్కెట్ యార్డులో పత్తి, సోయా రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు తమకు ఎదురవుతున్న సమస్యలను తెలియజేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోవడంలేదని కేటీఆర్‌కు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి రైతన్నలకు ఇచ్చిన హామీలన్నింటిని పక్కన పెట్టిందని, కనీసం పండిన పంటలను అమ్ముకోవడంలో కూడా సహకారం అందించడం లేదని తెలిపారు. రైతులతో మాట్లాడిన అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేదు అని అంటే ఎందుకు ఈ రోజు అదిలాబాద్ మార్కెట్ యార్డ్‌ని బంద్ పెట్టారు. మార్కెట్ యార్డులో రైతన్నలను కలుస్తామంటే ప్రభుత్వం ఎందుకు అడ్డంకులు కల్పించింది. చరిత్రలో ఎప్పుడు లేనంత దారుణంగా పత్తి కొనుగోలు సోయా రైతుల పరిస్థితి మారింది. కిసాన్ కపాస్ మొబైల్ అప్లికేషన్ అని తీసుకువచ్చి దాని ద్వారానే పంటలు కొంటాం అంటున్నారు. మరి కనీసం ఫోన్లు లేని రైతన్నల పరిస్థితి ఏమిటి? ఆదిలాబాద్ జిల్లాలో మొబైల్ నెట్‌వర్క్ కనెక్టివిటీ అన్నిచోట్ల ఉండదు. మరి ఇలాంటి సందర్భంలో రైతన్నల పరిస్థితి ఏమిటో చెప్పాలి అని కేటీఆర్ అడిగారు. రాష్ట్రంలో భారీగా అకాల వర్షాలు పడినందు వలన పత్తి తేమశాతం ఎక్కువగా ఉన్నది. చలి కూడా గతంలో కంటే ఎక్కువగా ఉన్నది అందుకే పత్తిలో తేమశాతం ఉన్నది. గతంలో మా ప్రభుత్వం ఉన్నప్పుడు కేంద్రం పైన ఒత్తిడి తీసుకొచ్చి 20 నుంచి 22 శాతం తేమ ఉన్న పంటను కూడా కొనిపించాము. కానీ ఇప్పుడు కేవలం 12 శాతం తేమ ఉంటే కూడా కొనుగోలు చేయము అని చేతులు ఎత్తేసింది. రైతులు పంటలు అమ్ముకోలేక ఆత్మహత్యలు చేసుకుంటే కూడా పట్టించుకునే వారు లేరు కనీసం అడిగే వారు కూడా లేరు. కనీసం ఇప్పటిదాకా లక్ష క్వింటాళ్ల పంట కూడా కొనలేదు. ప్రైవేట్ వాళ్లతో ప్రభుత్వం కుమ్మక్కై రైతుల పంటను దోచుకుంటున్నది అని అనిపిస్తున్నది. లేకుంటే రైతన్నలకు ఎన్ని సమస్యలు వచ్చిన స్పందించకుండా ఉండదు అని కేటీఆర్ పేర్కొన్నారు.



కనీస మద్దతు ధర రూ. 8,100 రైతుకు దక్కాల్సింది కానీ ఐదారు వేలు కూడా దక్కడం లేదు. సోయాబీన్ అమ్మకానికి సంబంధించి ఫింగర్ ప్రింట్ కావాలని చెప్పి ఒక నిబంధన పెట్టి అనేక ఇబ్బందులు గురి చేస్తున్నారు. సొంత తల్లిదండ్రుల పేరు మీద ఉన్న పంటలు బిడ్డలు అమ్మాలంటే కూడా కొనుగోలు చేయడం లేదు. పత్తి పంట ఎకరానికి కేవలం 7 క్వింటాళ్లు మాత్రమే కొంటామనే ఒక అర్థరహితమైన నిబంధన పెట్టారు. ఆదిలాబాద్‌లో ఉన్న భూసార పరిస్థితుల వలన పది పదిహేను క్వింటాళ్ల వరకు ఎకరానికి పండుతుంది మరి మిగిలిన పంటను ఎక్కడ అమ్ముకోవాలి. ఈరోజు మేము రైతన్నలను కలవడానికి వెళ్తున్నామని తెలుసుకున్న ప్రభుత్వం నాటకాలు మొదలుపెట్టారు అని కేటీఆర్ మండిపడ్డారు.

కేంద్రంతో వీడియో కాన్ఫరెన్స్ అంటూ నాటకాలు మొదలుపెట్టారు. కానీ నిన్న జరిగిన క్యాబినెట్లో 50 శాతానికి పైగా తెలంగాణ జిల్లాలో పండుతున్న పత్తి పంట పైన కనీసం మాట్లాడలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కరెంటు సరఫరా నుంచి మొదలుకొని యూరియా సప్లై దాకా చివరికి పంట అమ్మకానికి సంబంధించి కూడా తీవ్రమైన సమస్యలు ఉన్నాయి. రాష్ట్రంలో రైతన్నల పంటలు కొనుగోలు చేసే పరిస్థితులు కూడా లేవు. దేశంలోనే అత్యుత్తమ పంటను పండించే రాష్ట్రం తెలంగాణ కానీ ఇక్కడి తెలంగాణ ప్రభుత్వం మాత్రం పట్టి రైతన్నలను పట్టించుకోవడం లేదు అని కేటీఆర్ ధ్వజమెత్తారు.

దేశంలో అద్భుతమైన నాణ్యత కలిగిన పత్తి పంట పండుతుంటే కేంద్రంలోని బిజెపి మాత్రం విదేశాల నుంచి పత్తిని దిగుమతి చేయించుకుంటుంది. పైగా ఇప్పటిదాకా ఉన్న దిగుమతి సుంకాలన్నింటిని ఎత్తివేసింది. కేవలం ఇతర దేశాల్లోని సరఫరాదారులతో చేసుకున్న ఒప్పందాల కోసమే తేమ శాతం, మొబైల్ అప్లికేషన్ ,ఎకరాకు 7 క్వింటాళ్ల వంటి అర్థరహితమైన నిబంధనలు పెట్టి విదేశీ సరఫరాదారులతో చేతులు కలిపేందుకే దేశంలోని రైతన్నల నుంచి బిజెపి దేశంలోని రైతన్నల నుంచి పత్తి పంట కొనుగోలు చేయడం లేదు. కేంద్రం ప్రభుత్వం పైన ఒత్తిడి తీసుకురాకుండా కేవలం ఎన్నికలు, రాజకీయాలపైన మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించడం వలన ఇన్ని సమస్యలు వచ్చాయి. ఇప్పటిదాకా పత్తి కొనుగోలు చేయాలని కనీసం కేంద్రం పైన రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురాలేదు అని కేటీఆర్ నిలదీశారు.

రైతన్నల సమస్యల పరిష్కారానికి పోరాటాలు మాత్రమే మార్గం. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలపైన ఒత్తిడి తీసుకువచ్చేందుకు అన్ని రకాల పోరాటాలను చేసేందుకు మా పార్టీ సంసిద్ధంగా ఉన్నది. పార్టీ రైతన్నలకు అండగా ఉంటుంది. మొన్న ఆత్మహత్య చేసుకున్న హడావు దీపక్ కుటుంబానికి పార్టీ తరపున కొంత ఆర్థిక సహాయం చేస్తాం. వెంటనే ప్రభుత్వం పంటల కొనుగోలు కోసం ఫింగర్‌ప్రింట్ల నిబంధన, కేవలం 12 శాతం తేమ ఉండాలన్న నిబంధన, ఎకరానికి ఏడు క్వింటాల మాత్రమే కొంటామన్న నిబంధన ఇవన్నీటిని వెంటనే ఎత్తివేయాలి. కిసాన్ కపాస్ యాప్ సంబంధం లేకుండా పంట కొనుగోలు చేయాలి అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

అధిక వర్షాల వలన నష్టపోయిన రైతన్నలందరికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిహారం చెల్లించాలి. నష్టపోయిన ప్రతి రైతన్నకు ఎకరానికి 20000 చొప్పున కనీస నష్టపరిహారం చెల్లించాలని పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నాం. స్థానిక బిజెపి, కాంగ్రెస్ నేతలు తమ ప్రభుత్వాలపైన ఒత్తిడి తీసుకువచ్చి రైతన్నలకు న్యాయం చేయాలి. వెంటనే ఇక్కడి కేంద్ర మంత్రులు, తెలంగాణ ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చేలా స్థానిక రైతుల సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకుపోవాలి. లేకుంటే వారి పైన రైతన్నల పోరాటం తప్పదు అని కేటీఆర్ హెచ్చరించారు.

# సంపాదకీయం

## కనుమరుగవుతున్న కట్టడాలు రక్షణపై శ్రద్ధ లేని ప్రభుత్వాలు

ప్రపంచ సాంస్కృతిక వారసత్వ దినోత్సవం ప్రతి ఏట నవంబర్ 19న ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తారు. వారసత్వ పరిరక్షణ అంశాల ఆధారంగా 1984, జనవరి 27న నాటి భారతదేశ ప్రధాని ఇందిరా గాంధీ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ చైర్మన్‌గా భారత జాతీయ సంస్కృతి వారసత్వ సంస్థ (ఇండియన్ నేషనల్ ట్రస్టు ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ -ఇంటాక్) అనే సంస్థ ఏర్పాటు చేయబడింది. దీనికి తోడుగా, భారతదేశ వారసత్వ సంపద విలువ, వాటి పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కలిపించేందుకు 'భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ', 'రాష్ట్ర పురావస్తు శాఖ'లకు బాధ్యతలు అప్పగించ బడ్డాయి. అవి భక్త కరీంనగర్ జిల్లా గత కీర్తికి ప్రాచీన చరిత్రకు నిలువుటద్దంగా నిలిచి ఉంది. రాష్ట్ర పురావస్తు శాఖ విశ్రాంత డైరెక్టర్ డాక్టర్ వి. వి. కృష్ణ శాస్త్రి అపురూప పరిశోధనల ఫలితంగా, జిల్లా పాక్షరిత్ర 50వేల సంవత్సరాలకు పూర్వం ఉన్నదని రుజువైతే, అది సామాన్యమైన విషయమేమీ కాదు. గౌతమి నదీ దక్షిణ తీరమున పరి వ్యాప్తమై ఉన్న, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో, ఉత్తర దక్షిణ భారతీయులకు, సేతువై నిలిచిన ఈ ప్రాంత నాగరికత, కాల ప్రవాహంలో కొట్టుకుని పోయినా, ఉత్సాహవంతులైన చారిత్రక పరిశోధకుల అవిరళ కృషి ఫలితంగా కథలుగా, గాథలుగా, నోళ్లలో, రాళ్లలో, ఆకులలో, రేకుల లో అక్కడక్కడ నిక్షిప్తమైయున్న చరిత్ర కొంతవరకు వెలుగులోనికి రాగలిగింది. చరిత్రలో ఆంధ్రులకు లభించినంత వరకు, శాతవాహనులు మొట్టమొదటి రాజ వంశం అనీ, అదీ మహారాష్ట్రలోని పైఠానో లేక నాసిక ప్రాంతము అనుకుంటే కాదని, అంతకుముందే పురాణాలలో పేర్కొనబడిన ఆంధ్ర భృత్యులని, తొలి ఆంధ్ర ప్రభువుల సేవకులనే విషయం, కోటిలింగాల తవ్వకాలలో బయల్పడడం విశేషం. కరీంనగర్ జిల్లాలోనే శాతవాహనుల మూలపురుషులకు ఆవాస స్థానమని చారిత్రక పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. శ్రీముఖుని కి చెందిన నాణాలను, ధర్మపురి వాస్తవ్యుడైన చారిత్రక పరిశోధకుడు కీర్తిశేషులు సంగనభట్ల నరహరిశర్మ కనుగొన్నాక, శాతవాహన వంశానికి మూల పురుషుడు అనదగిన శ్రీముఖుడు, కోటిలింగాల రాజధానిగా చేసుకొని పరిపాలించాడని రుజువైనాక, చరిత్రలో నూతన అధ్యాయానికి నాంది పలికింది. క్రీస్తుపూర్వం శతాబ్దాల క్రితమే ఆంధ్ర రాజ్యం, శాతవాహనుల ఏలుబడిలో వర్ధిల్లిన, వారి అభిమాన పాత్రమైన బౌద్ధమతం, ఈ ప్రాంత ప్రజల ఆరాధ్య మత మై విరాజిల్లింది. ప్రాచీనమైన ప్రతి గ్రామం పేరులో ప్రతి నిర్మాణ కౌశలంలో, ప్రతి కట్టడం లో వస్తువులు, మట్టి పాత్రలు, మతంతో పెనవేసుకున్న చరిత్ర పలుకుతుంది. శాతవాహన చక్రవర్తుల చత్రచ్ఛాయలలో, బౌద్ధమతం విస్తరించి, శాంతి అహింసలు, విశ్రమించిన ఈ ప్రాంతాల్లో, నాటి ప్రజల ఆరాధ్యాలైన స్థూపాలు, శిల్పాలు, కట్టడాలు, తవ్విన చోటల్లా దర్శనమిస్తూ, వెలకట్టలేని వేల సంవత్సరాల చరిత్రకు, మౌన సాక్షీ భూతాలుగా నిరాదరణ నీడలో మగ్గుతూ, తమ దుస్థితికి చింతిస్తూ, అనాసక్తులైన, అధికారుల, ప్రజాప్రతినిధుల అశ్రద్ధ, నిర్లక్ష్యానికి క్రుంగి కృశిస్తు, ఆయువు తీరకముందే అస్తమిస్తున్నాయి. నిన్నటి వరకు ఆలనా పాలనా కరువై "బుద్ధం శరణం గచ్ఛామి" అంటూ దీనంగా విలపించిన ధర్మపురి నియోజకవర్గంలోని పాషా యిగాం బౌద్ధ స్తూపం, ఒక కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా మూలమట్టం అయింది. క్రీస్తుపూర్వం ఆరవ శతాబ్దంలో గంగా మైదానం ప్రాంతాలలో బౌద్ధమత వ్యాప్తి జరిగినా, అశోకుని కాలం కన్నా ముందే ప్రవేశించిన బౌద్ధమతం, శాతవాహనుల హయాంలో విశేష ఆదరణ పొందింది. కరీంనగర్ జిల్లాలో మూడు ప్రాచీన బౌద్ధ కేంద్రాలు ఉండేవి. వాటిలోని ధర్మపురి సమీప క్రీస్తుపూర్వం 200 సంవత్సరాల సంబంధిత పాశాయిగాం బౌద్ధ స్థూపాన్ని కి విశేష ప్రాధాన్యత ఉండేది. దీనికి 6 వృత్తాకారపు పలకలు ఉండేవి. వీటిపై ఒక పద్మం, ఏనుగు బొమ్మలు, స్థూపానికి ఇరువైపులా, స్తం భాకృతులు కలిగియున్న ఆ స్తూపం రెండవ శతాబ్దానికి చెందినదిగా "దూళికట్ట స్థూపం కన్నా ప్రాచీనమైనదిగా", "జిల్లాలోని మొట్టమొదటి రాతి కట్టడం"గా చరిత్రకారులు రుజువు పరిచారు. క్రీస్తు పూర్వం రెండవ శతాబ్దం నాగ సింపీ యకాయ, జమజోరాగ బ్రహ్మ లేఖలు, స్తూపం వద్ద లభ్యమైనాయి. శాతవాహనుల తొలి రాజధాని అయిన కోటిలింగాలకు మూడు కిలోమీటర్ల దూరంలో, ప్రస్తుత రాయపట్నం - కరీంనగర్ రాష్ట్ర రహదారిని ఆనుకుని, పాశాయిగాం గుట్టపై చెన్నపూస అనే ఆచార్యుడు, బౌద్ధ స్థూపాన్ని నిర్మించినట్లు, సుప్రసిద్ధ బౌద్ధ ఆచార్యుడు దిజ్ఞాగుడు, ఈ ప్రాంతం వాడేనని, చైనా యాత్రికుడు హ్యూన్ త్సాంగ్ ఏడవ శతాబ్దంలో తన గ్రంథంలో పేర్కొన్నాడు. రాష్ట్ర పురావస్తు శాఖ మాజీ డైరెక్టర్ వి.వి. కృష్ణ శాస్త్రి శాతవాహన కళా ఉత్సవాల సందర్భంగా, 2002 జనవరి 21న కరీంనగర్లో ప్రధాన ప్రాసంగికునిగా ప్రకటించడాన్ని బట్టి, పాషాయిగాం బౌద్ధ స్తూప ప్రాధాన్యత స్పష్టమౌతుంది. ఇంతటి ప్రాచీన చారిత్రక ఆధారమైన బౌద్ధ స్తూపం, రాష్ట్ర రహదారి రోడ్డు నిర్మాణంలో, కాంట్రాక్టర్ అయిన ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ నిర్లక్ష్యానికి అనవసరంగా, అకారణంగా బలియై, 1999 డిసెంబర్ 25వ తేదీన నేల కూల్చ బడింది. ఆ తర్వాత ముక్కలైన ఆ స్తూప పలకలను చేర్చి, జిల్లా కేంద్ర పురావస్తుశాఖ మ్యూజియంలో భద్రపరిచి, తిరిగి స్థాపించడం జరిగింది. తత్ఫలితంగా పాశాయిగాంకు చెందిన బౌద్ధ స్తూపం, కనుమరుగై ఈ ప్రాంతం, చరిత్ర పుటల్లో నుంచి తొలగించబడి, ప్రాచీనత్వాన్ని కోల్పోయింది. అలాగే జూలపల్లి మండలంలోని క్రీస్తు పూర్వపు రెండవ శతాబ్దికి చెందిన హుస్సే నియా వాగు - చిన్న వాగుల సంగమ స్థానంలో 47 శిల్పాలంకృత పలకలచే శోభితమై, ఐదు పడగల "ముచిలింద నాగం" బోధివృక్షం మహాభినిష్క్రమణం చెక్కబడిన దూళికట్ట స్థూపం విశేష ప్రాధాన్యతను కలిగి ఉంది. "కాలచక్ర నిర్వహణ"కై దూళికట్ట నుండి అపురూప ఫలకాలను, అమరావతికి కొద్దికాలం క్రితం తరలించారు. కోటిలింగాల ధూళికట్ట మరియు మీర్జంపేట మానేరు తీరాన చారిత్రక శిల్పాలను, స్తూపాలను, కోటలను, పరి రక్షించేందుకు నాటి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 38 లక్షలకు పైగా నిధులు అర్ధాంతరంగా మళ్లించ బడినాయి. ప్రాచీన కట్టడాలు, బౌద్ధ స్థూపాలు, ఆరామాలు, శిల్పీకరించిన అపురూప కళాకృతులు, ఈనాటి వారికి ప్రధానంగా చరిత్ర అంటే గౌరవం లేని సరైన అవగాహన లేని, పాలక అధికార వర్గాలకు తెలియక పోవచ్చు కాని, వాటి ప్రాశస్త్యానికి, వేల సంవత్సరాల వెలకట్టలేని, చారిత్రక నేపథ్యం ఉందన్న యతార్థాన్ని విస్మరించ రాదు. ఒకవైపు ప్రాచీనమైన బౌద్ధ వ్యాప్తికి సంబంధించిన, ఈ ప్రాంత చరిత్ర మరుగున పడుతుండగా... మరోవైపు ప్రాచీనత్వానికి ఆనవాళ్లు అయిన, అపురూప చారిత్రక సాక్ష్యాలను కనుమరుగు చేస్తుంటే, వారి ఆత్మ ఘోష వినిపిస్తుంటే, భారతీయ పురాతత్వ విభాగం ప్రపంచ పౌరుల ముందు తలదించుకోవాల్సిన దుస్థితి. గొప్పలు చెప్పుకోవడం కాదు గొప్పలు నిలబెట్టుకోవడమే గొప్ప తనం.

# పరిపాలనా దక్షురాలు ఇందిర



ఇందిరాగాంధీ ఈ పేరు వినగానే ... తెగింపు , ధైర్యం, ఆత్మ విశ్వాసం, సాధికారిక, పట్టుదల అన్నీ గుర్తుకు వస్తాయి. ఒక మహిళ అయి ఉండి ప్రఖ్యాతి గాంచిన మహానేతలతో పోటీ పడి భారత దేశాన్ని ఏకచక్రాధి పత్యంగా పాలించ గలిగిన రాజనీతిజ్ఞులు. ఎన్ని సంక్షోబాలు ఎదురైనా, బెణుకు అనేది లేకుండా , ధైర్యసాహసాలతో ప్రధాని హొదాలో ఎన్నో కఠినమైన నిర్ణయాలు తీసుకోని పరిపాలనలో చెరగని ముద్ర వేసుకున్న సాటిలేని మేటి. ఇందిరా ప్రియదర్శిని గాంధీ (నవంబర్ 19, 1917 %-% అక్టోబర్ 31, 1984) భారత దేశపు మొట్ట మొదటి, ఏకైక మహిళా ప్రధాన మంత్రి. ఆమె భారత తొలి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ ఏకైక కుమార్తె. జవహర్ లాల్ నెహ్రు మొదటి సారి ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు ప్రధానమంత్రి సెక్రటరీగా జీతం లేకుండా పనిచేసింది. 1964 సంవత్స రములో తండ్రి మరణం తరువాత రాజ్యసభకు ఎన్నిక అయింది. లాల్ బహదుర్ శాస్త్రి మంత్రి మండలిలో ప్రసారశాఖ మంత్రిగా పని చేసింది.ఆమె 1966 నుండి 1977 వరకు వరుసగా 3 పర్యాయాలు, 1980లో 4వ పర్యాయం ప్రధాన మంత్రిగా పనిచేసింది. 1917, నవంబర్ 19 తేదీన జవహర్ లాల్ నెహ్రూ, కమలా నెహ్రూల ఏకైక సంతానంగా జన్మించింది ఇందిరాగాంధీ. తాను ఆడుకునే ప్రతీ ఆటలో బ్రిటిష్ వారిని ఎదిరించి పోరాడే ఒక దేశభక్తురాలి గానే తనను ఊహించు కుంటూ ఆడుకొనేది. 18 సంవత్సరాల వయస్సులోనే ఆమె వానర సేనను నడిపి ఉద్యమాలలో అనుభవం సంపాదించింది. ఇందిర పూణే విశ్వవిద్యాలయం నుండి మెట్రిక్ పరీక్షలో ఉత్తీర్ణు రాలయింది. విశ్వభారతి విశ్వ విద్యాలయంలో చదివింది. ఇంగ్లండు నందలి ఆక్స్ ఫర్డ్ విశ్వవిద్యాలయం లోని సోమర్ విల్ కళాశాలలో చదివేటప్పుడు, స్వాతంత్ర్యం సంపాదించడంకోసం లండనులో స్థాపించ బడిన ఇండియాలీగ్ లో, 1930 లో చేరింది. 1936లో తల్లి కమలా నెహ్రూను కోల్పోయింది. 1938 లో భారత జాతీయ కాంగ్రెస్ లో చేరింది. జర్నలిస్ట్ ఫిరోజ్ తో పరిచయము క్రమంగా పరిణ యానికి దారి తీసింది. నెహ్రు కాశ్మీరీ బ్రాహ్మణులు కావటం, ఫిరోజ్ పూర్వీకులు పర్షియా నుండి భారత దేశానికి వలస వచ్చి స్థిరపడిన పార్సీలు కావటంతో పెళ్లి చేయటానికి ఆ సమయంలో నెహ్రు ఒప్పుకోలేదు, ఆ తర్వాత నెహ్రును మహాత్మా గాంధీ ఒప్పించడంతో, 1942-03-26న ఇందిరా (25), ఫిరోజ్ (29)ల పెళ్లి చేసారు.1942లో క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో జైలుకు వెళ్ళి 1943 మే 13 న విడుదలైంది. జైలులో ఉండగానే ఆమె ఒక మగ పిల్ల వాడికి తల్లి కాగా, ఆ బాలునికి రాజీవ్ అని పేరు పెట్టారు. రాజీవ్ గాంధీకి రెండు సంవత్సరాల వయసు ఉన్నప్పుడు, వారు లక్నో వెళ్లగా, అక్కడ నేషనల్ హెరాల్డు పత్రికా సంపాదకునిగా ఫిరోజ్ గాంధీ పనిచేసిన సమయంలో సంజయ్ గాంధీ జన్మించాడు. భర్తతో కలిసి అలహాబాదులో ఉంటున్న సమయంలో విభేదాలు రావడంతో అలహాబాదును వదలి ఢిల్లీ చేరి ఆమె తండ్రితో జీవించింది. 1951లో జరిగిన మొదటి సార్వత్రిక ఎన్నికలలో జవహర్ లాల్ నెహ్రూకు పోటీగా ఫిరోజ్ గాంధీ రాయ్‌బరేలీ నియోజక వర్గంలో పోటీ చేసినప్పుడూ ఇందిర తండ్రి తరఫున ప్రచారం చేసి , ఆ ఎన్నికల్లో తండ్రిని గెలిపించింది. ఖంగుమని మోగే కంఠస్వరం, సామాన్యులలో కలసిపోయే ఆమె స్వభావం ప్రజలను ఆకర్షించేవి. 1959 ఫిబ్రవరి 2 న భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఆమెను ఎన్నుకున్నారు. 1960 సెప్టెంబర్ 8న ఫిరోజ్ గాంధీ మరణించాడు. 1964 మే 27న జవహర్ లాల్ నెహ్రూ మరణిం చడంతో ఇందిర జీవితంలో పెనువిషాదం ఏర్పడింది. తండ్రి మరణానంతరం ఇందిర రాజ్యసభ సభ్యురాలిగా ఎన్నికై లాల్ బహదూర్ శాస్త్రి మంత్రివర్గంలో కేబినెట్ హొదా కలిగిన సమాచార, ప్రసార శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టింది.1966 జనవరి 24న ఇందిర మొదటి సారిగా ప్రధానమంత్రి బాధ్యతలను స్వీకరించి దేశ మొట్ట మొదటి మహిళా ప్రధానమంత్రిగా సంచలనం సృష్టించింది. నేటివరకు కూడా మరో మహిళ ఆ స్థానాన్ని చేపట్టలేని రికార్డు అది. ఇందిర 1966 నుండి 1977 వరకు వరుసగా 3 పర్యాయాలు, 1980లో 4వ పర్యాయం ప్రధానమంత్రిగా పనిచేసింది. 1975-06-26 భారత ప్రధాని ఇందిరా గాంధీ అత్యవసర పరిస్థితిని ప్రకటించారు.1977-03-22 ఇందిరా గాంధీ భారత ప్రధాని పదవికి రాజీనామా చేశారు. 1977లో అత్యవసర పరిస్థితిని ఉపసంహరించి ఎన్నికలను ప్రకటించింది. అత్యవసర పరిస్థితి పరిణామం 1977 ఎన్నికలలో ఓటమి రూపంలో బయట పడింది. ఇందిర సొంత నియోజకవర్గ మైన రాయ్ బరేలీలో కూడా జనతా పార్టీకి చెందిన రాజ్ నారాయణ్ చేతిలో ఓడిపోయింది. 1977-10-03 ఇందిరా గాంధీని అరెస్టు చేశారు. ఇది జాతీయ అసంతృప్తి, దేశ వ్యాప్తంగా నిరసనలకు దారి తీసింది. 1978లో ఇందిరా కాంగ్రెస్ పార్టీని ఏర్పాటు చేసి ఉప ఎన్నికలలో విజయం సాధించి లోక సభలో మళ్ళీ అడుగు పెట్టింది. 1980-01-06 ఎన్నికలలో ఇందిరా గాంధీ కాంగ్రెస్ మధ్యంతర ఎన్నికలలో భారీ విజయం సాధించి మరో సారి ప్రధాన మంత్రి బాధ్యతలను చేపట్టింది. ఈసారి విశేషం ....ఆమె స్వయంగా ఆంధ్ర ప్రదేశ్ లోని మెదక్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి భారీ ఆధిక్యతతో గెలుపొందింది. రాజభరణాల రద్దు, 1966లో రూపాయి మూల్య న్యూనీకరణ, 1969లో బ్యాంకుల జాతీయా కరణ, బంగ్లా శరణాగతుల పునరావాసం లాంటి నిర్ణయాలతో పాటు దేశంలో పంటల ఉత్పత్తిని పెంచడానికి హరిత విప్లవం, పేదరిక నిర్మూలనకై గరీబీ హటావో నినాదం, 20 సూత్రాల పథకము లాంటి ప్రజాకర్షక పథకాలు చేపట్టింది. ఆమె 1984 -06-05 ఇందిరా గాంధీ సిక్కు పవిత్ర స్థలమైన అమృత్సర్‌లోని స్వర్ణ దేవాలయం పై ఆపరేషన్ బ్లూ స్టార్ దాడి చేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే 1984-10-31 భారత ప్రధాన మంత్రి ఇందిరా గాంధీని ఆమె అంగరక్షకులు సత్వంత్ సింగ్, బితాంత్ సింగ్ లు న్యూ ఢిల్లీలోని ప్రధాని అధికార నివాసంలో కాల్చి హత్య చేశారు. 1984-11-03 ఇందిరా గాంధీ మృతదేహాన్ని దహనం చేశారు.

# సమర యోధురాలు ఝాన్సీ



ఆధునిక భారతదేశ చరిత్రలో బ్రిటిష్ వలస పాలన, విధానాలకు వ్యతిరేకంగా జరిగిన గొప్ప చారిత్రక సంఘటనే '1857 సిపాయిల తిరుగుబాటు'. బ్రిటిషు ఈస్ట్ ఇండియా కంపెనీ... బెంగాలు నవాబు, ఆయన ఫ్రెంచి మిత్రుల కూటమికి 1757 జూన్ 23న ప్లాసీ నిర్ణయాత్మక యుద్ధం జరగగా, తర్వాత వందేళ్లకు ఈ తిరుగు బాటు చోటు చేసుకుంది. దీనినే 'ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం', 'సిపాయిల పితూరి', 'విప్లవోద్యమం'గా చరిత్రకారులు అభివర్ణించారు. వీరసావర్కర్ తాను రచించిన గ్రంథం ఇండియన్ వార్ ఆఫ్ ఇండిపెండెన్స్ లో సిపాయిల తిరుగుబాటు ప్రథమ స్వాతంత్ర్య సమరమని పేర్కొనడం జరిగింది. ఉత్తర, మధ్య భారత దేశంలో బ్రిటిషు ఈస్ట్ ఇండియా కంపెనీకి వ్యతిరేకంగా జరిగిన మొదటి భారత స్వాతంత్ర్య యుద్ధం వైఫల్యంతో ముగిసింది.1857 మే 10న మీరట్లోని బెంగాల్ అశ్విక దళంలో కొందరు సైనికులు ఢిల్లీ వైపు రావడంతో ప్రారంభమైన తిరుగుబాటు, వేగంగా ఉత్తర భారతం మొత్తానికి నిస్తరించింది. మీరట్, ఝాన్సీ, కాన్పూర్, లక్నోలు తిరుగుబాటు తలెత్తిన ముఖ్య ప్రాంతాలు.ఉత్తర భారత దేశ రాజ్యమైన ఝాన్సీ అనే రాజ్యానికి రాణి. 1857లో ఆంగ్లేయుల పరిపాలనకు వ్యతిరేకంగా జరిగిన మొదటి భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రముఖ పాత్ర పోషించింది. భారత దేశంలోని బ్రిటిష్ పరిపాలనలో ఝాన్సీ కీ రాణి గ ప్రసిద్ధికెక్కినది.1857 లో భారత దేశ తిరుగుబాటు దార్లలో ముఖ్యమైన వాళ్ళలో ఆమె ముఖ్యమైనది. ఝాన్సీ లక్ష్మీబాయి అసలు పేరు మణికర్ణిక. ఆమె 1828వ సంవత్సరం నవంబరు19 న మహారాష్ట్ర కు చెందిన సతారలో ఒక కర్హాడీ బ్రాహ్మణుల వంశంలో వారణాసిలో విక్రమ నామ సంవత్సరం బహుళ పంచమీ నాడు జన్మించింది. లక్ష్మీబాయికి 13 ఏళ్ళ వయసు లోనే 1842లో ఝాన్సీ పట్టణానికి రాజైన గంగాధరరావు నెవల్కార్ తో వివాహమైంది. దీంతో ఆమె ఝాన్సీ పట్టణానికి మహారాణి అయింది. అప్పటి ఆచారాల ప్రకారం మహారాణి అయిన తర్వాత ఆమె పేరు లక్ష్మీబాయి అయింది. 1851లో లక్ష్మీబాయికి ఒక కుమారుడు జన్మించాడు. అయితే ఆ పిల్లవాడు నాలుగు నెలల వయసులోనే కన్ను మూశాడు. 1853 లో గంగాధర రావుకు అనారోగ్యం సోకింది. వేరే బిడ్డను ఎవరినైనా దత్తత తీసుకోమని అందరూ సలహ ఇచ్చారు. దాంతో ఆయనకు దూరపు బంధువైన వాసుదేవ నేవల్కర్ కుమారుడైన దామోదర్ రావు అనే పిల్లవాడిని చని పోవడానికి కేవలం ఒక్క రోజు ముందుగానే దత్తత తీసుకున్నారు. 1853, నవంబర్ 21 వ తేదీన గంగాధరరావు మరణించాడు. హిందూ సాంప్రదాయం ప్రకారం దామోదర్ రావు రాజ్యానికి వారసుడు కావల్సి ఉన్నా బ్రిటీష్ ప్రభుత్వం అందుకు అంగీకరించ లేదు. దామోదర్ రావు రాజా కు రక్త సంబంధం కానందు వలన అంటే దత్త సంబంధం కావున, ఈస్ట్ ఇండియా కంపనీ గవర్నర్ జనరల్ లార్డ్ డల్ హౌసి, సిద్ధాంతం ప్రకారం రావు సింహాసనాన్ని అధిష్టించే అధికారం లేదని అతనిని నిరాకరించాడు. రాణి ఝాన్సీని ఇవ్వకూడదని నిశ్చయించు కొన్నది. ఆమె తన సైన్యాన్ని బలపర్చి, తమకు తాముగా వచ్చిన వాళ్ళను పోగుచేసి ఒక సేనను తయారు చేసింది. మహిళలకు కూడా యుద్ధ శిక్షణ ఇవ్వబడింది. యుద్ధ వీరులైన గులాం గాస్ ఖాన్, దోస్త్ ఖాన్, ఖుదా బక్ష్, లాల భు బక్షి, మోతీ బాయి, సుందర్ - ముందర్, ఖాసి బాయి, దీవాన్ రఘునాథ్ సింగ్, దీవాన్ జవహర్ సింగ్ రాణి బలగంలో ఉన్నారు. అలా జరిగిన యుద్ధంలో లక్ష్మీబాయి 1858 జూన్ 17 న గ్వాలియర్ లో యుద్ధ సమయములో మరణించింది. గ్వాలియర్ యుద్ధం గురించి జనరల్ రోస్ ప్రస్తావిస్తూ విప్లవ కారుల్లోకెల్లా ఆమే అత్యంత ధైర్య సాహసాలతో పోరు సల్పిందని కితాబిచ్చాడు. ఆమెకున్న ధైర్యము, పరాక్రమము, వివేకము, భారత దేశంలో 19 వ శతాబ్దములో మహిళలకున్న అధికారం పై ఆమెకున్న ముందుచూపు, ఆమె చేసిన త్యాగాలు ఆమెను స్వాతంత్ర్య పోరాటంలో ఒక ప్రసిద్ధ వ్యక్తిగా నిలిపింది. "జోన్ ఆఫ్ ఆర్క్" లాగా ఆమె భారత దేశ చరిత్రలో ఒక గొప్ప వ్యక్తిగా నిలిచిపోయింది.

## చలి.. జనజీవనం అస్తవ్యస్తం!

తెలంగాణ రాష్ట్రంలో, ముఖ్యంగా ఉత్తర ప్రాంతంలోని ఆదిలా బాద్, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలపై చలి పంజా విసురుతోంది. గత పది రోజులుగా ఉష్ణోగ్రతలు కనిష్ట స్థాయికి పడిపోయి, గ్రామీణ, గిరిజన వర్గాలను గజగజ వణికిస్తున్నాయి. డిసెంబర్ ప్రవేశించక ముందే ఈ తీవ్రత ప్రజలను బెంబేలెత్తిస్తోంది. పగటిపూట కూడా ఉష్ణోగ్రతలు తగ్గడంతో జన జీవనం పూర్తిగా స్తంభించింది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల నుంచి వీస్తున్న చల్లని గాలుల దాడికి ఈ ప్రాంతం అతలాకుతలమవుతోంది. వాతావరణంలో ఈ అసాధారణ మార్పు దీర్ఘకాలిక ప్రజారోగ్య, ఆర్థిక సమస్యలకు సంకేతంగా నిలుస్తోంది. ఆకస్మిక చలితీవ్రతకు సిద్ధంగా లేని ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులు, నిరాశ్రయుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ఈ చలిగాలులు సాధారణ జీవితాన్ని ప్రభావితం చేయడమే కాకుండా, రైతులు, విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తున్నాయి. చలి తీవ్రత పెరుగుతున్న కొద్దీ, ప్రజారోగ్యంపై ప్రతికూల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులలో పాటు శ్వాసకోశ వ్యాధుల బాధితులు అధికంగా ప్రభావితమవుతున్నారు. జలుబు, దగ్గు, ఆయాసం, న్యుమోనియా వంటి శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో ఆసు పత్రులు కిటకిటలాడుతున్నాయి. అధిక చలి కారణంగా రక్త నాళాలు సంకోచించి రక్తపోటు పెరిగి, గుండెపై భారం పడుతుంది. ఫలితంగా, ఇటీవల గుండెపోటు కేసులు పెరగడం, హృద్రోగులలో సమస్యలు తలెత్తడంతో ప్రజలలో మరింత ఆందోళన కలిగిస్తోంది. చలికాలంలో అత్యంత ఎక్కువ ఇబ్బందులు పడుతున్న వర్గం ప్రభుత్వ వసతి గృహాలు (హాస్టల్స్), గురుకులాల్లోని విద్యార్థులు.. సంగారెడ్డి, సూర్యాపేట వంటి జిల్లాల్లోని సంక్షేమ హాస్టళ్లలో వేడినీటి యంత్రాలు పనిచేయకపోవడం, పూర్తి స్థాయిలో దుప్పట్లు, రగ్గులు పంపిణీ చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. కోదాడ, సూర్యాపేటలోని ఎస్సీ బాలుర హాస్టల్స్‌లో కిటికీలు, తలుపులు లేకపోవడంతో విద్యార్థులు చల్లని గాలులకు వణుకుతూ నేలపైనే నిద్రిస్తున్నారు. జహీరాబాద్ ఎస్సీ బాలికల వసతి గృహం వంటి శిథిలావస్థ భవనాల్లో సరిపడా మంచాలు లేకపోవడంతో నేలపై కునుకు తీయక తప్పడం లేదు. కనీస వసతులు కల్పించడంలో ప్రభుత్వ వ్యవస్థల విధి నిర్వహణలో లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. విపరీతమైన చలి వ్యవసాయ రంగంపై కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపుతోంది. ప్రస్తుతం యాసంగి పంటకు రైతులు సిద్ధమవుతున్న తరుణంలో, ఉష్ణోగ్రతలు పడిపోవడం వల్ల వరి నారు ఎదుగుదల మందగిస్తోంది. నారుమళ్లు ఆశించినంతగా పెరగకపోవడంతో నారు నాటు ఆలస్యం అవుతోంది. ఉదయం కురుస్తున్న మంచు, పత్తి వంటి పంటల నాణ్యతను దెబ్బతీసి, రైతుల దిగుబడిపై, ఆదాయంపై ప్రభావం చూపుతోంది. ఇక కూరగాయల పంటలకు సైతం కాత, పూత తగ్గి దిగుబడులు తగ్గే అవకాశం ఉంది. ఈ తీవ్రమైన పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలి. ప్రభుత్వ యంత్రాంగం నిద్ర వీడి వేగం పెంచాలి.

# రాజ్యాంగ సవరణ ద్వారా రిజర్వేషన్ లను చట్టబద్ధం చేయాలని ప్రధానికి బహిరంగ లేఖ

**మంచిర్యాల,నవంబర్18(సూర్యరేఖ)** కేంద్ర ప్రభుత్వం 42శాతం రిజర్వేషన్,లపై పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి,రాజ్యాంగ సవరణ ద్వారా రిజర్వేషన్ లను చట్టబద్ధం చేయాలని విజ్ఞప్తి చేస్తూ జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ప్రధాని మోడీకి బహిరంగ లేఖ రాశారు. మంచిర్యాల పట్టణంలో బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు మాట్లాడుతూ...భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన అనంతరం ఇప్పటివరకు130 సార్లు రాజ్యాంగ సవరణలు చేశారని,అలాగే ఎటువంటి ఉద్యమం లేకుండానే అగ్రకులాలకు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 103ను ఐదు రోజుల్లో సవరణ చేసి10 శాతం ఈ డబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కల్పించిన కేంద్ర ప్రభుత్వం, 40సంవత్సరాలుగా బీసీలకు విద్యా,ఉద్యోగ స్థానిక సంస్థలు చట్టసభలలో రిజర్వేషన్లు కల్పించాలని,



ఉద్యమాలు చేస్తున్న బీసీలకు ప్రజాస్వామ్య వాటా ఇవ్వకపోవడం బాధాకరమని అన్నారు.ఇప్పటికైనా బిజెపి ప్రభుత్వం బీసీల న్యాయమైన డిమాండ్ ను గుర్తించి చిత్తశుద్ధితో42శాతం రిజర్వేషన్లపై రాజ్యాంగ సవరణ చేసి బిజెపి బీసీల పక్షాన నిలబడాలని, లేనిపక్షంలో రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు గుమ్మల శ్రీనివాస్,గజెల్లి వెంకటయ్య,అందే సంతోష్ బాబు,ఏదునూరి రమేష్, మంచర్ల సదానందం చంద్రమౌళి,అంకం సతీష్, శాఖపురం భీమాసేన్,పెద్దపెల్లి సూరయ్య,నియాజ్, దొమ్మటి అర్జున్ జి.సంతోష్,కరే లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు రానివారికి ఇంటింటికి వెరిఫికేషన్..



**బెల్లంపల్లి,నవంబర్18(సూర్యరేఖ)** బెల్లంపల్లి పట్టణంలో ఇందిరమ్మ యోజన కింద ఇళ్లు రానివారిని గుర్తించేందుకు వార్డు ఆఫీసర్ జావీద్, కాంగ్రెస్ నాయకులు మేకల శీను,బండి రాము,పోల శీను తదితరులు కలిసి ఇంటింటికి వెళ్లి వెరిఫికేషన్ నిర్వహించారు.ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదేశాల మేరకు,నిజంగా ఇళ్లు రానివారి వివరాలను సేకరించి వెంటనే సాంక్షన్ పొందేలా చర్యలు తీసుకోవడం ఈ బృందం లక్ష్యంగా పెట్టుకుంది.ప్రజలు ఎదుర్కొంటున్న ఇళ్ల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని తక్షణమే పై అధికారులకు నివేదించాలని బృందం నిర్ణయించింది.ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజలు స్పందించి తమ వివరాలు అందించారు.

## పంచాయతీ కార్యదర్శులు పారి శుధ్యంపై దృష్టి పెట్టాలి..

నారాయణఖేడ్ డివిజన్ డిఎల్ పిఓ సంజీవరావు



**నాగల్ గిద్ద,నవంబర్18(సూర్యరేఖ)**పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పారిశుధ్యం పనులపై దృష్టిపెట్టాలని నారాయణఖేడ్ డివిజన్ డిఎల్పిఓ సంజీవరావు అన్నారు.ఎంపీడీవో కార్యాలయం లో వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పరిశుద్ధంతో పాటు ప్లాస్టిక్ నివారణపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.ఈ సమావేశంలో ఎంపీఓ ఇందిరమ్మ పంచాయతీ కార్యదర్శులు బలవంతరెడ్డి క్రిష్టఫర్ రాజశేఖర్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు

## రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ఆల్ఫోర్స్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

**మంచిర్యాల,నవంబర్18(సూర్యరేఖ)** జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్ లో గల ఆల్ఫోర్స్ ఇంటర్నేషనల్ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో బహుముఖ ప్రతిభను కనబరిచారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ డాక్టర్ వినరేందర్ రెడ్డి మాట్లాడుతూ...స్థానిక సింగరేణి క్లబ్ లో జరిగిన రాష్ట్రస్థాయి ఓపెన్ కరాటే పోటీల్లో పాఠశాల విద్యార్థులు 9మెడల్స్ సాధించారని,వీటిలో ఒక గోల్డ్, రెండు సిల్వర్,ఆరు బ్రౌంజ్ మెడల్స్ గెలుచుకున్నారని పేర్కొన్నారు.విద్యార్థుల ప్రదర్శనల వెనుక కఠిన శ్రమ, వారి పట్టుదలకు ఈ పతకాలు నిలువెత్తు సాక్ష్యం అని,రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో విద్యార్థులు విశిష్ట ప్రతిభను ప్రదర్శించి విజయం సాధించారని హర్షం వ్యక్తం చేశారు.విద్యార్థులకు




చదువుతో పాటు శారీరక దృఢత్వం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. పథకాలు సాధించిన విద్యార్థులను పాఠశాల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అభినందించారు.

## చిల్కానగర్ డివిజన్ అభివృద్ధి పనులకు నిధులు కేటాయించండి..

కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్



**ఉప్పల్,నవంబర్18(సూర్యరేఖ)** చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ మంగళవారం జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్,ని వారి కార్యాలయంలో కలిసి డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని వినతిపత్రం అందజేశారు.సర్వే ఆఫ్ ఇండియా సిగ్నల్స్ వద్ద ఫుటోవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని, అదేవిధంగా మల్టీ యుటిలిటీ ఫంక్షన్ హాల్,డివిజన్ అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాల్సిందిగా కోరడం జరిగింది. కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ దశలవారీగా స్ట్రామ్ వాటర్ డ్రైన్,సిసి రోడ్లకు నిధులు కేటాయిస్తానని హామీ ఇవ్వడం జరిగింది.డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించడానికి సానుకూలంగా స్పందించిన కమిషనర్ కు కార్పొరేటర్ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ పాల్గొన్నారు.

## మంజీరాలో నదిలో పడి యువకుడు మృతి..





**కొల్చారం,నవంబర్18(సూర్యరేఖ)** మెదక్ జిల్లా పోతంశెట్టిపల్లి టీజంక్షన్ నుండి ఏడుపాయలకు వెళ్లే దారిలో హెలిపాడ్ సమీపంలో ఆదివారం సాయంత్రం మంజీరానదిలో గల్లంతైన యువకుడి మృతదేహాన్ని మంగళవారం ఎన్టీఆర్ ఎన్డీఆర్ఎఫ్ బృందం సభ్యులు గుర్తించారు. హైదరాబాద్ లోని కూకట్ పల్లి ప్రాంతంలో నివసిస్తూ తాపీ మేస్త్రీగా పనిచేసే కోటేశ్వరరావు తన స్నేహితులతో కలిసి ఏడుపాయలకు వచ్చాడు. ఆదివారం మంజీరానదిలో స్నానానికి వెళ్లి నీటి ప్రవాహంలో కోటేశ్వరరావు కొట్టుకుపోవడంతో అప్పటినుండి పోలీసులు జాలర్లు గాలించినప్పటికీ కోటేశ్వరరావు జాడ దొరకలేదు.కానీ మంగళవారం మంజీరానీటి ప్రవాహం తగ్గడంతో బండరాళ్ల మధ్యలో మృతదేహం లభించింది.మృతుని భార్య రోహిణి ఫిర్యాదు మేరకు కొల్చారం ఎస్ఐ మహమ్మద్ మొయినుద్దీన్ మెదక్ రూరల్ సీఐ జార్జ్ కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

## నాగోల్ మెట్రో స్టేషన్ వద్ద ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి

ట్రాఫిక్ డిసిపికి వినతి పత్రం అందజేసిన ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

**ఉప్పల్,నవంబర్18 (సూర్యరేఖ)** నాగోల్ నుండి ఉప్పల్ రహదారులో నాగోల్ మెట్రో స్టేషన్ వద్ద ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉండడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారని సమస్యను పరిష్కరించాలని కోరుతూ ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు ఎర్రం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ డిసిపి డి.శ్రీనివాస్ కు వినతిపత్రం అందజేశారు.నాగోల్ మెట్రో స్టేషన్ వద్ద ఉన్న యూటర్న్ మార్చి వేరే చోటుకు ఏర్పాటు చేయాలని,శిల్పారామం హెచ్ఎండిఏ వైపు ఉన్న సర్వీస్ రోడ్డు పూర్తిగా ఏర్పాటు చేయకపోవడం వల్ల రామంతపూర్ లోని కాలనీలకు,హెచ్ఎండిఏ ప్రాంతంలో గల నివాసముంటున్న ప్రజలకు ఇంటికి చేరుకోవడానికి సర్వీస్ రోడ్డు లేకపోవడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులకు గురి



అవుతున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి సమస్యను పరిష్కరించాలని ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ నాయకులు ట్రాఫిక్ డిసిపిని కోరారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ ట్రాఫిక్ సి.ఐ. నాగరాజు ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు ఎర్రం శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్ గోసుల,ఒంపు లక్ష్మయ్య,డాన్ బిక్షపతి,గోలి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## 46వ సారి రక్తదానం చేసిన సామల సంతోష్ రెడ్డి




**కామారెడ్డి,నవంబర్18(సూర్యరేఖ)** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కెబిసి రక్తనిధి కేంద్రంలో సదాశివనగర్ మండలం మండలం ధర్మారావుపేట్ గ్రామానికి చెందిన సాఫ్ట్ వేర్ ఇంజనీర్ సామల సంతోష్ రెడ్డి వారి కుమారుడు సామల కియాన్ రెడ్డి జన్మదినం సందర్భంగా 46వ సారి రక్తదానం చేసి ఆదర్శంగా నిలవడం జరిగిందని ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు తెలియజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ. రక్తదాత సామల సంతోష్ రెడ్డి గతంలో ఎన్నో సందర్భాల్లో అత్యవసర పరిస్థితుల్లో ఉన్న గర్భిణీ స్త్రీల కోసం,వివిధ ఆపరేషన్ల నిమిత్తమై, డెంగ్యూ వ్యాధితో బాధపడుతున్న వారికోసం సకాలంలో రక్తాన్ని అందజేసి ఆదర్శంగా నిలవడం జరిగిందని,రక్తానికి ప్రత్యామ్నాయ మార్గాలు లేవని ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడడానికి యువత రక్తదానానికి ముందుకు రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి రక్తదాతల సమూహం అధ్యక్షుడు జమీల్ హైమద్,నిర్వాహకులు జీవన్,వెంకటేష్,లు పాల్గొన్నారు.

## రామంతపూర్ ప్రభుత్వ జిఎస్పిఎస్ హోమియోపతి వైద్య కళాశాలలో మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ

**ఉప్పల్,నవంబర్18 (సూర్యరేఖ)** నషాముక్తిభారత అభియాన్ ఏర్పడి ఐదు సంవత్సరాలు అయిన సందర్భంగా డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా సామూహిక ప్రతిజ్ఞను రామంతాపూర్ లోని ప్రభుత్వ జేఎస్పిఎస్ హోమియోపతి వైద్య కళాశాలలో




ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్, ఆయుష్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.లింగరాజు,లు మాట్లాడుతూ...విద్యార్థులు యువత మాదక ద్రవ్యాల మాయలో పడొద్దని వాటికి దూరంగా ఉండాలని,విద్యార్థులు యువత భారతదేశ భవిష్యత్తు అని,మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి విద్యార్థులు బంగారు భవిష్యత్తును నెలకొల్పుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ పార్థసారథి,వైస్ ప్రిన్సిపల్ కృష్ణమూర్తి,కళాశాల విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులే దేశానికి వెన్నుముక





నేటిబాలలే రేపటి పౌరులు..
మత్తు పానియాలకు దూరంగా ఉండాలి..
జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.

**కామారెడ్డి,నవంబర్18(సూర్యరేఖ)** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కళాభారతి స్టేడియంలో నిర్వహించిన మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన గావించి విద్యార్థులతో కలిసి సామూహిక ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... "విద్యార్థులే దేశానికి వెన్నుముక.. నేటి బాలలే రేపటి పౌరులు"అని పేర్కొన్నారు. యువత దేశాభివృద్ధికి పునాది,ప్రతి విద్యార్థి మత్తు పానియాలు, మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాల ప్రభావం వ్యక్తిగత జీవితంపై తీవ్రమైన దుష్ప్రభావాలు చూపుతుందని, కుటుంబం సమాజాన్ని కూడా దెబ్బతీస్తుందని డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి విద్యార్థి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డిఎల్‌సిసి నాగరాణి,ఏ.ఎస్.పి చైతన్యరెడ్డి,డిడబ్ల్యుఓ ప్రమీల, సంబంధిత జిల్లా అధికారులు ఉపాధ్యాయులు, వివిధ విద్యాసంస్థల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రూ.44లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కార్పోరేటర్ బోహిని దర్షన్ శ్రీకారం




**నాంపల్లి,హైద్రాబాద్,నవంబర్18(సూర్యరేఖ)** జియగూడ డివిజన్ పరిధిలోని డబుల్ బెడ్ రూమ్ సముదాయం ప్రాంతంలోగల సమర్థ నారాయణ ఆశ్రమం గోశాల రాముల వారి విగ్రహం నుండి 100 ఫీట్ల జాతీయ రోడ్ వరకు రూ.44 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం పనులు మంగళవారం ప్రారంభమైనాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భారతీయ జనతా పార్టీ జియాగూడ డివిజన్ కార్పోరేటర్ బోహిని దర్షన్ పాల్గొని భూమి పూజ నిర్వహించి పనులను ప్రారంబించారు.ఈ సందర్బంగా కార్పోరేటర్ బోహిని దర్షన్ మాట్లాడుతూ...ఈ ప్రాంతంలో రోజుల తరబడి నీరు నిలిచి రాకపోకలకు ప్రజలు తీవ్రఇబ్బంది పడుతున్నారని డివిజన్ పరిధిలో ప్రాంత వాసుల సమస్యల పరిష్కారమే తమ కర్తవ్యమన్నారు. కొందరు అధికార పార్టీ పేరు చెప్పుకొని పైసా పని చేయకుండా ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తూ,జరిగే అభివృద్ధి పనులకు ఆటంకం కలిగించాలని,చుసిన సహించేది లేదని,అలంటి వారికి ప్రజలచేత బుద్ధి చెప్పిస్తామని హెచ్చరించారు.ప్రజా సమస్యల పరిష్కారానికై ఎల్లవేళల్లో ప్రజలకు అందుబాటులో ఉంటానని కార్పోరేటర్ బోహిని దర్షన్ అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రభు మహారాజ్,జగన్నాదప్పా నర్సింగ్ రావు,జి.నర్సింగ్ రావు అశోక్, అమర్నాథ్ జగదీష్ రాఘవేంద్ర రాహుల్ శివాజీ జీహెచ్ ఎంసీ అధికారి హేమంత్ తదితర స్థానిక నాయకులు పాల్గోన్నారు.

# నేర నియంత్రణకు కార్డెన్ సెర్చ్ దోహదం




మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్

**కొల్చారం,నవంబర్18(సూర్యరేఖ)** నేరాల నియంత్రణకు కార్డెన్ సెర్చ్ దోహదం చేస్తుందని మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్ అన్నారు. మంగళవారం ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు డీఎస్పీ ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో మెదక్ సబ్ డివిజన్ పరిధిలోని సర్కిల్ ఇన్స్పెక్టర్లు ఎస్సైలు, పోలీసు సిబ్బంది రంగంపేటలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి పోలీసు సిబ్బంది,అధికారులు వాహనాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా సరైన ధృవ పత్రాలు లేని వాహనాలను గ్రామపంచాయతీ వద్దకు తీసుకువచ్చి వారికి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో గ్రామస్తుల ఉద్దేశించి మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ మాట్లాడారు.గ్రామాల్లో సురక్షితమైన భద్రతను కల్పించడం కోసం పోలీసు శాఖ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కనెక్టివిటీ కార్యక్రమంలో భాగంగా కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో వాహనాలను తనిఖీ చేయడంతో పాటు ఎలాంటి ఆధారాలు లేకుండా గ్రామంలో ఉన్న నూతన వ్యక్తుల సమాచారాన్ని



సేకరించడం గ్రామస్తులకు పోలీసుశాఖ ఆధ్వర్యంలో అందుతున్న సేవలను వివరించడం రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించడం, సైబర్ క్రైమ్ వల్ల ప్రజలు మోసపోతున్న విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించి ఎవరు సైబర్ క్రైమ్ బారిన పడి మోసపోకుండా చూడడం లాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని నేరం జరిగినప్పుడు ఆధారాలు సేకరించడంలో నిందితులను పట్టుకోవడంలో సీసీ కెమెరాలు ఎంతగానో. తోడ్పాటు నందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ రూరల్ సీఐ జార్జ్ అల్లాదుర్గం సీఐ రేణుక,కొల్చారం ఎస్ఐ మహమ్మద్ మోహినుద్దీన్ పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్,మెదక్ డివిజన్ పరిధిలోని వివిధ మండలాలకు చెందిన ఎస్సై మెదక్ డివిజన్ పరిధిలోని వివిధ మండలాలకు చెందిన ఎస్సైలు ఎ ఎస్ఐలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అండర్17జిల్లా స్థాయి ఖోఖో పోటీలు విజయవంతం..

మొదటి బహుమతి మధిర,ద్వితీయ,తృతీయ ఎర్రుపాలెం చింతకాని



**ఖమ్మంజిల్లా,నవంబర్18(సూర్యరేఖ)** ఎస్జిఎఫ్ పాఠశాలల ఖమ్మం జిల్లా సమైక్యఅండర్17 ఇయర్స్ ఖోఖో పోటీలు మంగళవారం కల్లూరు మినీ స్టేడియంలో నిర్వహించారు.ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా 22 మండల నుండి 264 మంది క్రీడాకారులు,20మంది న్యాయ నిర్ణేతలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి,కల్లూరు క్రీడల కన్వీనర్ ఎంఈఓ ప్రత్తిపాటి నివేదిత,లు పాల్గొని పోటీలు ప్రారంభించారు.ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మధిర జట్టు మొదటి బహుమతి సాధించారు. ద్వితీయ తృతీయ బహుమతులను ఎర్రుపాలెం చింతకాని మండలాలు సాధించాయి. బహుమతి ప్రధానోత్సవానికి ఆర్యవైశ్య ఖమ్మం జిల్లా మహాసభ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పసుమర్తి చందర్రావు పాల్గొని విజేతలకు ట్రోఫీ,మెడల్స్ బహుమతులు అందజేశారు. దూదిపాళ్ళ యోదిత జ్ఞాపకార్థం క్రీడాకారులకు మెడల్స్, ట్రోఫీలు అందించడం జరిగింది.ఈ క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులకు ఉచిత భోజన ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాఠశాలల క్రీడల కార్యదర్శి యాస రామారావు టోర్నమెంట్ నిర్వహణ కార్యదర్శి బోడ బీమా,పసుపులేటి వీరరాఘవయ్య,వ్యాయామ ఉపాధ్యాయులు వ్యాయామదర్శికులు,ఖోఖో అసోసియేషన్ సభ్యులు,సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.

## ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్ రహిత సమాజానికై ప్రతిజ్ఞ..




**రామయంపేట,నవంబర్ 19(సూర్యరేఖ)** రామాయంపేటలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డ్రగ్స్ రహిత సమాజం కోసం ఆయుష్ శాఖ యోగ శిక్షకులు మద్దెల భరత్ ఆధ్వర్యంలో విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...డ్రగ్స్ వినియోగం వల్ల సమాజానికి తీవ్రహాని కలగడంతో పాటు ఆర్థికపరంగా కుటుంబాలని విచ్ఛిన్నం చేస్తుందన్నారు. ఎక్కువగా15 నుండి25 సంవత్సరాల యువకులు డ్రగ్స్ బారిన పడుతుండడంతో చదువుపై ఏకాగ్రతను కోల్పోయి బానిసలవుతున్నార న్నారు.డ్రగ్స్ వినియోగం దేశ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపుతుండడంతో ప్రభుత్వాలు డ్రగ్స్ నిర్మూలన దిశగా తీవ్ర కృషి చేస్తున్నాయన్నారు.విద్యార్థి దశ నుండి ఇటువంటి విషయాలపై అవగాహన కలిగి ఉండడం ద్వారా వారిని చెడు వ్యసనాలకు దూరంగా ఉంచొచ్చన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగమణి ఉపాధ్యాయ సిబ్బందితో పాటు అంగన్వాడీలు జమున,దేవలక్ష్మి,ఆశా వర్కర్లు పద్మ, అనిత,నాగలక్ష్మి,ఎం.పద్మ,లు పాల్గొన్నారు.

## నిజమైన కార్యకర్తలను గుర్తించినప్పుడే పార్టీ బలపడుతుంది..

మాసాయిపేట మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి నవీన్ యాదవ్



**మాసాయిపేట,నవంబర్18(సూర్యరేఖ)** తెలంగాణ రాజకీయ పరిస్థితుల్లో భారతీయ జనతా పార్టీ మరింత బలపడాలంటే పార్టీలో పనిచేస్తున్న నిజమైన కార్యకర్తలను గుర్తించి తగిన ప్రాధాన్యత ఇవ్వడం అత్యంత అవసరమని మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి నవీన్ యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... గత కొంతకాలంగా పార్టీ నిర్మాణంలో ఖద్దర్ బట్టలు వేసుకున్న నాయకులు పదవులు ఉన్న వారు మాత్రమే ముందుకు వస్తున్న పరిస్థితి ఉందని, భారతీయ జనతా పార్టీకి అసలు బలం గ్రామలలో రోజు రోజుకూ పార్టీ కోసం శ్రమిస్తూ,పార్టీ సిద్ధాంతాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్న సామాన్య కార్యకర్తలదేనని పేర్కొన్నారు.నిజాయితీ గల కార్యకర్తలు పార్టీ అభివృద్ధి కోసం మాత్రమే ఆకాంక్షిస్తారని అభిప్రాయం వ్యక్తం చేశారు. కొంతమంది నాయకులు మాత్రం వారి వారి వ్యక్తిగత ప్రయోజనాల కోసం పనిచేసే పరిస్థితి కనిపిస్తోందన్నారు.ఈ వ్యవస్థ మారాలంటే, ముందుగ కార్యకర్తల కష్టాన్ని గుర్తించి వారికి గౌరవంతో పాటు వారికి అవకాశాలు కల్పించాలన్నారు. అప్పుడే పార్టీ బలపడే దిశగా ముందుకు సగడంతో పాటు స్థానిక ఎన్నికలలో బలపడుతుందన్నారు.

# మాదక ద్రవ్యాల నిరోదానికి కృషి..




జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

**నారాయణపేటజిల్లా ప్రతినిధి, నవంబర్18(సూర్యరేఖ)** మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞనషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం జిల్లా సంక్షేమశాఖ ఆద్వర్యంలో మంగళవారం నారాయణపేటలోని ఎస్.ఆర్ గార్డెన్ లో జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్,ట్రైన్ కలెక్టర్ ప్రణయ్ కుమార్ సమక్షంలో అధికారులు ఉద్యోగులు,విద్యార్థులు కలసి మాదకద్రవ్యాల నిరోధక సామూహిక ప్రతిజ్ఞ చేయడం జరిగింది.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ...డ్రగ్స్ రహిత జీవన శైలిని అనుసరిస్తూ ఏ ఒక్కరు డ్రగ్స్ బారిన పడకుండా ఉండడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని మత్తుపదార్థాలకు దూరంగా ఉంటూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వారు సూచించారు. గంజాయితో పాటు ఇతర మత్తు పదార్థాలు అమ్మినకొనుగోలు చేసిన అక్రమ రవాణా చేసిన ఆవ్యక్తులకు సంబంధించిన సమాచారాన్ని అధికారులకు తెలియజేయాలని డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వారు తెలిపారు.ప్రతి ఒక్కరూ డ్రగ్స్ రహిత జీవనశైలిని అలవర్చుకోవాలన్నారు. క్రమశిక్షణతో కూడిన జీవనశైలి ఉన్నప్పుడే అల్వాట్లకు దూరంగా ఉంటామని తెలిపారు. ఎవరైనా మాదకద్రవ్యాలు కానీ సిగరెట్ మద్యం లాంటివి ఆఫర్ చేసిన వాటిని నిరోధించాలని,అది క్రమశిక్షణ ఉంటేనే వస్తుందని అదనపు కలెక్టర్ సూచించారు. ప్రతిరోజు ఉదయం5 గంటలకు నిద్రలేచి కాలకృత్యాలు తీర్చుకునే అలవాటు చేసుకోవాలన్నారు. నషాముక్తభారత్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరు ప్రతిజ్ఞ చేయాలని తెలిపారు.అనంతరం అధికారులు యువకులు విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలోట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, డిఎంహెచ్వో జయచంద్ర మోహన్, డి.పి.ఆర్.ఓ.రషీద్,పలు విభాగాల ఉద్యోగులు, టీచర్లు,విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు యాంటీ నార్కోటిక్ డ్రగ్ వారియర్ గా పనిచేయాలి




జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్...

**నారాయణపేటజిల్లా ప్రతినిధి,నవంబర్18 (సూర్యరేఖ)** నషాముక్తాభారత్ అభియాన్ ఐదేళ్ల పూర్తి సందర్భంగా నారాయణపేట జిల్లా ఎస్పీ కార్యాలయంలో మాదకద్రవ్యాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆధ్వర్యంలో పోలీస్అధికారులు,సిబ్బంది సామూహిక ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రతి పౌరుడు,ముఖ్యంగా ప్రతి పోలీసు,యాంటీ నార్కోటిక్ డ్రగ్ వారియర్ గా పనిచేయాలని పిలుపునిచ్చారు.మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నాయని,యువత గంజాయి డ్రగ్స్,వంటి మత్తుపదార్థాల బారిన పడితే మీ భవిష్యత్తు అంధకారం అవుతుందని ఈ అలవాటు వ్యసనంగా మరి వ్యక్తిగత ఆరోగ్యం మాత్రమే కాదు కుటుంబం సమాజం మొత్తాన్ని దెబ్బతీస్తుందని యువత భవిష్యత్తు కోసం అందరూ కలిసికట్టుగా పోరాడాలని అన్నారు. పోలీస్ విభాగం మాదకద్రవ్యాల వ్యాప్తిని అరికట్టడంలో కఠినచర్యలు తీసుకుంటుందని తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను గమనిస్తూ వారిలో అవగాహన కల్పించాలని తెలిపారు.డ్రగ్స్ బారిన పడిన రవాణా చేస్తున్న,అమ్మిన అట్టి వ్యక్తుల సమాచారం లోకల్ పోలీసులకు లేదాడయల్ 100కి లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1908కి సమాచారం ఇవ్వాలని ఇచ్చిన వారివివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు.ప్రస్తుతం ప్రతి పోలీసు యువత సైబర్ వారియర్గా పనిచేస్తున్నారని ఇక నుండి యాంటీ నార్కోటిక్ డ్రగ్ వారియర్ గా పనిచేయాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ కొరకు డ్రగ్స్ ఫ్రీ నారాయణపేటజిల్లా కొరకు ప్రజలంతా పాటుపడాలని ఎస్పీ కోరారు.పోలీసులు స్కూల్స్ కాలేజీలు గ్రామాలు కాలనీలు పట్టణాలలో ప్రజలకు డ్రగ్స్ వినియోగం వల్ల ఏర్పడే అనార్థాలను వివరంగా, విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.అదే విధంగా డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ డ్రగ్ రహిత జిల్లా కొరకు అందరుపాటుపడాలని అన్నారు. మాదకద్రవ్యాల నివారణలో పోలీసు ప్రజా భాగస్వామ్యం కీలకమని ఎస్పీ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి ఎండి రియాజ్ హూల్ హాక్,డిఎస్పీలు నల్లపు లింగయ్య మహేష్ సీఐ శివ శంకర్,ఎస్సైలు వెంకటేశ్వర్లు, నరేష్, సురేష్ పురుషోత్తం సునీత,పోలీస్ సిబ్బంది,డిపిఓ స్టాప్ తదితరులు పాల్గొన్నారు.

# బదిలీ వర్కర్లకు జనరల్ అసిస్టెంట్ (కేటగిరీ-1)గా క్రమబద్ధీకరణ





**మందమర్రి,నవంబర్18(సూర్యరేఖ)** గడిచిన 2024 సంవత్సరంలో గనులు, డిపార్ట్మెంట్స్ లలో 190/240 మాస్టర్స్ పూర్తి చేసిన బదిలీ వర్కర్లకు ఏరియా వారీగా 65 మందికి జనరల్ అసిస్టెంట్ కేటగిరి-1గా క్రమబద్ధీకరణ చేస్తూ సింగరేణి యాజమాన్యం లేటర్లు అందజేయనుంది.ఈ నేపథ్యంలో మంగళవారం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో పనిచేస్తున్న నలుగురు మహిళా బదిలి వర్కర్ ఉద్యోగులకు ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ జనరల్ అసిస్టెంట్ పదోన్నతి ఆఫీస్ ఆర్డర్లను అందజేశారు.

ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ...పదోన్నతి పొందిన ఉద్యోగులను అభినందించి,శుభాకాంక్షలు తెలిపారు.ఇకముందు కూడా ఇదే ఒరవడితో నిబద్ధతో పని చేసి సంస్థ నిర్దేశించిన లక్ష్యాల్లో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జిఎం జి.లలిత్ ప్రసాద్,పర్సనల్ మేనేజర్ ఎస్. శ్యాంసుందర్, ఎస్కే ఏజెంట్ ఎండి ఖాదిర్ సీనియర్ పర్సనల్ అధికారి శంకర్ ఏఐటీయూసీ జిఎం కార్యాలయ పిట్ సెక్రటరీ గీతిక పాల్గొన్నారు.

**కెకె ఓసిపిలో11మందికి పదోన్నతి ఆర్డర్లు..**

కెకెఓసిపిలో పనిచేస్తున్న11మంది బదిలి వర్కర్ ఉద్యోగులకు జారి చేసిన జనరల్ అసిస్టెంట్ పదోన్నతి ఆఫీస్ ఆర్డర్లను ప్రాజెక్ట్ అధికారి ఎం. మల్లయ్య అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఇంజనీర్ ఎన్.వెంకటవంశీధర్ ఇన్ఛార్జ్ మేనేజర్ శ్రీధర్ గౌడ్,సీఎంఓఏఐ ఏరియా అధ్యక్షుడు ఎస్. రమేష్ ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి మర్రి కుమారస్వామి పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి కుంగ్ ఫూ పోటీలలో మందమర్రి విద్యార్థుల ప్రతిభ..

ఎస్సై రాజశేఖర్ చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులు అందజేత..



**మందమర్రి,నవంబర్18(సూర్యరేఖ)**మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సిసి నస్పూర్ లో సీనియర్ పాత్రికేయులు స్వర్గీయ మునీర్ జ్ఞాపకార్థం ఆదివారం నిర్వహించిన 5వ రాష్ట్ర స్థాయి కుంగ్ పూ కరాటే పోటీలలో మందమర్రి పట్టణానికి చెందిన విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించి పలు విభాగాల్లో అవార్డులు సాధించారని మాస్టర్ జెట్టి కృష్ణ తెలిపారు.సోమవారం మందమర్రి పట్టణ సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పట్టణ ఎస్ఐ శివనీతి రాజశేఖర్ పాల్గొని పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేసి వారిని అభినందించారు.ఈ సందర్భంగా పట్టణ ఎస్ఐ రాజశేఖర్ మాట్లాడుతూ... విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడారంగంలో రాణిస్తూ భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని,చిన్న వయసు నుండే ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరచుకొని ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దిన మాస్టర్ జెట్టి కృష్ణ మాట్లాడుతూ...కుంఫు కరాటే విద్య నేర్చుకోవడం వల్ల విద్యార్థులు మానసికంగా, శారీరకంగా,ఆత్మస్థైర్యం కోల్పోకుండా మనోధైర్యంగా ఉంటారని తెలిపారు.రాష్ట్రస్థాయి కుంఫు పోటీలలో తమ ప్రతిభను ప్రదర్శించిన లక్ష్మీనరసింహ, మనోవర్ధన్,శ్రీకృతి,నయన్ తేజ్,అన్మిష,వినీత్ నందన్,లు ప్రథమ బహుమతులు దక్కించుకున్నారని శ్రీహర్షిత్ అవినాష్, ఉదయ్ కిరణ్, శ్రీహర్ష,ధ్రువం తేజ్,హర్షిత్ ద్వితీయ బహుమతి సాధించారని జశ్విత,విజ్ఞాన శ్రీ,వర్షిత్ పవన్, కార్తికేయలు తృతీయ బహుమతి గెలుచుకున్నారని తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన జెట్టి కృష్ణను విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

## మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ కు జల్ సంచయ్ జన్ భాగిదారి అవార్డు..




**మంచిర్యాల,నవంబర్18(సూర్యరేఖ)** మంచిర్యాల్ జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ జాతీయ స్థాయిలో మరో ప్రతిష్ఠాత్మక గుర్తింపు పొందారు. నూతన ఆవిష్కరణలు,ప్రజా భాగస్వామ్యంతో నీటి సంరక్షణలో విశేష ఫలితాలు సాధించినందుకు గాను మంగళవారం దేశ రాజధాని న్యూఢిల్లీలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముచేతుల మీదుగా జల్ సంచయ్ జన్ భాగిదారి అవార్డును స్వీకరించారు. జిల్లాలో నీటి వనరుల అభివృద్ధికి,చెరువుల పునరుద్ధరణకు,గ్రామస్థాయిలో ప్రజలను భాగస్వాములను చేస్తూ చేసిన కృషి రాష్ట్ర,జాతీయ స్థాయిలో ప్రశంసలు పొందుతోంది.కార్యదీక్ష, క్రమశిక్షణ,ప్రజాసేవ పట్ల నిజాయితీతో పనిచేసే అధికారి అనే పేరును మరింత బలపరుచుకున్న కలెక్టర్ కుమార్ దీపక్ కు అన్ని వర్గాల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు అందుకున్న కలెక్టర్ కుమార్ దీపక్‌కు జిల్లా కలెక్టర్ కార్యాలయ అధికారులు సిబ్బంది,జిల్లా ప్రజలు అభినందనలు తెలిపారు.

## పెద్ద కోరుకొండి సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక..



**ఖమ్మం జిల్లా,నవంబర్18(సూర్యరేఖ)** కల్లూరు మండల పరిధిలోని పెద్ద కోరుకొండి సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్తుపై ఎటువంటి సమస్యలున్న బుధవారం ఉదయం 10:00 గంటల నుండి ఒంటిగంట వరకు సంబంధిత అధికారుల సమక్షంలో పెద్ద కోరుకొండి సబ్ స్టేషన్ దగ్గర పరిష్కరించబడతాయి.ఈ కార్యక్రమంలో అధికారులు ఎస్వీ వేణుగోపాల చారి చైర్ పర్సన్ కే.రమేష్ ఎస్.దేవేందర్ ఎం.రామారావు,లు హాజరవుతారని సబ్టేషన్ ఏఈ శీలం రామిరెడ్డి తెలిపారు.

# ఔట్సోర్సింగ్ ఉద్యోగులపై జరుగుతున్న అన్యాయంపై రాష్ట్ర ప్రభుత్వానికి సూటి ప్రశ్న

**నాంపల్లి,హైద్రాబాద్,నవంబర్18(సూర్యరేఖ)** తెలంగాణ ప్రభుత్వం మంగళవారం జొమాటో స్విగ్గీ వంటి ప్లాట్ఫార్మ్లలో పనిచేస్తున్న గిగ్ వర్కర్ల కోసం ఆరోగ్య భద్రత,ఉద్యోగ భద్రత ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసిందని,ఇది ప్రశంసనీయమే కానీ అదే సమయంలో పదిహేనేళ్ల నుంచి రాష్ట్రస్థాయి ప్రభుత్వ కార్యాలయాల్లో పూర్తిస్థాయి పనితో సేవ చేస్తున్న ఐదు లక్షలు ఔట్సోర్సింగ్ ఉద్యోగుల విషయంలో మాత్రం ప్రభుత్వం చూపిస్తున్న వివక్ష ఆందోళనకరంగా ఉందని తెలంగాణ స్టేట్ జెఎసి కమిటీ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ రాష్ట్ర అధ్యక్షుడు పులి లక్ష్మయ్య,వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ రాజమ్మద్,లు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ప్రభుత్వ దప్తరులలో వెన్నుముకలా పనిచేస్తున్న లక్షలాది ఔట్సోర్సింగ్ ఉద్యోగుల దుస్థితి,వారు ఎదుర్కొంటున్న సమస్యలు హృదయవిదారకంగా ఉన్నాయన్నారు.

**సేవలందిస్తూనే మరణించిన ఉద్యోగుల కుటుంబాలు రోడ్డుపై..**

సంవత్సరాల తరబడి ప్రభుత్వంలో పనిచేసి మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి కూడా సహాయం లేదు.ఏజెన్సీ నుంచి కూడా ఒక్క రూపాయి రాదు.చాలా కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు.ఇది ఏ రకమైన సామాజిక న్యాయం అని ప్రశ్నించారు.

**10నుంచి 5 ఏళ్లు పనిచేసి చివరకు రోడ్డుపై పడిన కుటుంబాలు..**

జి.ఎస్.టి,రిజిస్ట్రేషన్,ఎక్సైజ్ వంటి శాఖల్లో 10 ఏళ్లు పైగా పనిచేసిన వారిని కూడా మీకు ఉద్యోగ భద్రత లేదు అంటూ ఒక్కసారిగా బయటకు పంపేశారని,ఆ కుటుంబాలను ఎవరు ఆదుకుంటారని ప్రశ్నించారు.సర్వీస్లో ఉండగానే మరణించినా లేదా రిటైర్ అయ్యినా ఏ బెనిఫిట్ లేదని,సర్కారీ పనులు చేస్తూ జీవితాన్ని అర్పించినా పెన్షన్ లేదు గ్రాచ్యుటీ లేదు,భద్రతా పథకాలు లేవు ఇదేనా ప్రభుత్వ ఉద్యోగులతో సమానం పని చేసే ఉద్యోగులకు న్యాయం అంటూ నిలదీశారు. ఈఎస్ఐ ఈపీఎఫ్ కట్టకపోవడం,ఆరోగ్య భద్రత లేకుండా అప్పుల పలు చేస్తూ చాలా ఏజెన్సీలు ఈఎస్ఐ ఈపీఎఫ్ కట్టడం లేదన్నారు. అనారోగ్యంతో హాస్పిటల్లో చూపించుకోవాల్సిన పరిస్థితిలో ఉద్యోగులు అప్పులు చేసి ప్రాణాలు నిలబెట్టుకుంటున్నారని ప్రభుత్వ పరంగా ఆరోగ్య భద్రత ఎందుకు ఇవ్వడం లేదని వారు ప్రశ్నించారు. వేతనాల ఆలస్యం 3,7,16 నెలలుగా ప్రభుత్వంలో పని చేస్తూ కూడా వేతనాలు సమయానికి రాకపోవడం దారుణం అన్నారు. భూభారతిలో పనిచేస్తున్న వారికీ 16 నెలలు పెండింగ్ లో ఉన్నాయని అదేవిధంగా బీసీ వెల్ఫేర్ లో 7 నెలలుగా,ల్యాండ్ అక్విజిషన్ లో 9 నెలలుగా మరిన్నిశాఖల్లో 3నుంచి 5నెలలు సాధారణ వేతనం లేక ఇళ్ళ కిరాయిలు,పిల్లల స్కూల్ ఫీజులు,లోన్లు చెల్లించలేక చాలామంది ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. ఏజెన్సీల అవినీతితో నిరుద్యోగులను దోచుకుంటున్న వ్యవస్థ అని,చాలా ఏజెన్సీలు ఇదే రీతిలో ఉద్యోగం పేరుతో 2నుంచి3 లక్షల రూపాయలు వసూలు,ఉద్యోగుల పిఎఫ్ ఈఎస్ఐ డబ్బులు మింగేసి,ప్రభుత్వంతో కుమ్మక్కై కోట్ల రూపాయలు దోచుకుంటున్నాయని ఈ వ్యవస్థను ప్రభుత్వం ఎందుకు అరికట్టడం లేక పోతుందని వాపోయారు.సమాన పనికి సమాన వేతనం అని భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీమ్ కోర్టు స్పష్టమైన తీర్పు చెప్పిందని అయితే ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఎందుకు అదే వేతనం ఇవ్వడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.



**ప్రధాన డిమాండ్లు వివరిస్తూ..**

ఔట్సోర్సింగ్ వ్యవస్థను పూర్తిగా రద్దుచేయాలని ఏజెన్సీల దోపిడీని ఆపేందుకు ప్రభుత్వం స్వంతంగా ఔట్సోర్సింగ్ ఉద్యోగుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు.ఆరోగ్య భద్రత ఈపిఎఫ్ ఈఎస్ఐ ప్రభుత్వం బాధ్యతగా తీసుకోవాలన్నారు. సమాన పనికి సమాన వేతనం కోర్టు తీర్పు వెంటనే అమలు చేయాలని కోరారు.మరణించిన లేదా రిటైర్ అయిన ఉద్యోగుల కుటుంబాలకు భద్రతా పథకాలు ఇవ్వాలన్నారు.వేతనాలు ఆలస్యం కాకుండా నెలనెలా చెల్లింపు వ్యవస్థ అమలు చేయాలని కోరారు.ఏజెన్సీల అవినీతి విచారణ చేసి లైసెన్సులు రద్దు చేయాలని,గిగ్ వర్కర్లకు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం వారిని గౌరవించి అదే గౌరవాన్ని ప్రభుత్వానికి వెన్నుముక అయిన ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు కూడా ఇవ్వాలన్నారు.ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు గిగ్ వర్కర్లకు భద్రత కల్పిస్తేనే ఇది నిజమైన ప్రజా సంక్షేమ ప్రభుత్వం అవుతుందని,ఔట్సోర్సింగ్ ఉద్యోగులు న్యాయం,గౌరవం,భద్రత కోరుతున్నారన్నారని, తెలంగాణ స్టేట్ జెఎసి కమిటీ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ రాష్ట్ర అధ్యక్షుడు పులి లక్ష్మయ్య,వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ రాజమ్మద్,రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేశారు.

# బంరుక్ దౌలచెరువు ఆక్రమణలపై 'హైడ్రా' ఉక్కుపాదం

**ఎఫ్టిఎల్ లో ఫెన్సింగ్ వేస్తుండగా హైడ్రా అధికారులను అడ్డుకున్న స్థానికులు..**

**రాజేంద్రనగర్,నవంబర్18(సూర్యరేఖ)** చెరువుల ఆక్రమణలపై హైడ్రా ఉక్కుపాదం మోపుతోంది.మైలర్ దేవ్ పల్లీ పోలీస్ స్టేషన్ పరిధిలోని శాస్త్రిపురం కింగ్స్ కాలనీ బంరుక్ దౌలచెరువు సమీపంలో ఎఫ్టిఎల్ పరిధిలో ఓపెన్ ప్లాట్లకు హైడ్రాధికారులు ఫెన్సింగ్ వేస్తుండగా ఈ విషయాన్ని గమనించిన కొందరు మంగళవారం అధికారులు ఫెన్సింగ్ వేయడాన్ని అడ్డుకున్నారు. ఈ ప్లాట్ ను తాము కనుగోలు చేశామని కోర్టులో కేసు నడుస్తున్న సమయంలో హైడ్రాధికారులు తమ స్థలానికి ఫెన్సింగ్ వేయడం బాధాకరమని ప్లాట్ ఓనర్స్ అంటున్నారు.ప్లాట్ నెంబర్85ఓనర్ జైనబ్ ఫాతిమా,ప్లాట్ నంబర్ 97 అనీస్ ఫాతిమా,మహమ్మద్ ఇబ్రహీం,ప్లాట్ నంబర్ 98అఫ్జల్ పాషాలకు చెందిన సుమారు 2000 గజాల స్థలంలో హైడ్రా అధికారుల అక్రమంగా ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారని ప్లాట్ యజమానులు ఆరోపిస్తున్నారు.చెరువు పక్కన ఓపెన్ ప్లాట్ హైడ్రో పరిధిలోకి వస్తాయని,ఓపెన్ ప్లాట్స్ అన్నిటికీ ఫెన్సింగ్ వేయడం జరుగుతుందని హైడ్రా అధికారులు తెలిపారు.ఎఫ్టీఎల్,బఫర్ జోన్లలో వెలిసిన అక్రమ నిర్మాణాలను కూల్చివేసి, చెరువులకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు అధికారులు ప్రయత్నం చేస్తున్నారు.





# మాదకద్రవ్యాల నిరోధానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



**మున్సిపల్ కార్యాలయంలో మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ..**



**మందమర్రి,నవంబర్18(సూర్యరేఖ)** ఆరోగ్యకరమైన,మాదకద్రవ్య రహిత జీవనశైలిని ప్రోత్సహించడమే లక్ష్యంగా నిషాముక్తుభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేపట్టారు.నిషాముక్తుభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా"సేనోటుడ్రగ్స్ అండ్ యస్ టు లైఫ్"నినాదంతో మంగళవారం చేపట్టిన మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞలో వారు మాట్లాడుతూ...వ్యక్తిగత శ్రేయస్సు సామాజిక సామరస్యాన్ని ప్రోత్సహించడానికి మాదకద్రవ్య రహిత జీవనశైలికి కట్టుబడి ఉండటం లక్ష్యంగా మాదకద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహనను కల్పించడం కొరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై పౌరులలో అవగాహన కల్పించడంలో బాగంగా సిబ్బందిచే చేపించిన ప్రతిజ్ఞలో...మాదక ద్రవ్యాలపై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామిని అవుతానని, నేను డ్రగ్ రహిత జీవనశైలిని అనుసరిస్తూ నాతోపాటు ఏ ఒక్కరూ డ్రగ్స్ బారిన పడకుండా ఉండడానికి కృషి చేస్తానని,డ్రగ్ అమ్మకం కొనుగోలు అక్రమరవాణా చేసే వ్యక్తుల సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలియజేస్తానని,నేను డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వామిని అవుతానని మెప్మా కార్యాలయ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇంజనీర్ ఏం.సుమతి రెవెన్యూ అధికారి పి.కృష్ణప్రసాద్, మేనేజర్ టి.రాజేశ్వరి,సీనియర్ అసిస్టెంట్ ఏ.రాణి ఇన్చార్జి శానిటరీ ఇన్స్పెక్టర్ ఈ.వసంత్ హెల్త్ అసిస్టెంట్ యం.ఏ సమీర్ జూనియర్ అసిస్టెంట్లు విమల రాణి,పున్నం చందర్ వినయ్ శామ్యూల్,బి.ప్రదీప్,ఆయుర్వేదిక్ డాక్టర్ జి.నీరజ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ ఎం.గోపికృష్ణ,డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ బి. శ్యాంబాబు,సిస్టం మేనేజర్ సిస్టమ్ అసిస్టెంట్ వి. ప్రభాకర్ రెడ్డి ఎం.ఐ.ఎస్.ఆపరేటర్ ఈ.కుమార్ తదితర మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు మెరుగైన సేవలు.

**కార్మిక,గనులశాఖ మంత్రి వివేక్**



**మందమర్రి,నవంబర్18,(సూర్యరేఖ)** ఆరోగ్య సదుపాయాలను ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతను ఇస్తుందని,ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కార్మిక, గనులశాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు.మందమర్రి మండలం బొక్కలగుట్ట మైసమ్మ గాంధారి వనం పరిసరాల్లో రూ.20 లక్షలతో నిర్మించబోయే ఓపెన్ జిమ్ నిర్మాణ పనులకు,అలాగే ఆర్కే 1ఏ ప్రాంతంలో రూ.30 లక్షలతో నిర్మించబోయే శ్మశానవాటిక నిర్మాణ పనులకు మంగళవారం కార్మిక మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి శంకుస్థాపన చేసి భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఓపెన్ జిమ్ల ద్వారా సులభంగా వ్యాయామం చేసుకునేందుకు సహాయపడతాయని శరీర దారుఢ్యాన్ని ఒత్తిడి అలసటలను తగ్గిస్తాయని, ఓపెన్ జిమ్లలో సూర్యరశ్మి సహజగాలిని పొందటం ద్వారా విటమిన్–డి లోపాన్ని తగ్గించవచ్చని,దీనివల్ల మనస్సు శరీరం శక్తివంతంగా మారుతుందని, ఆరోగ్యం కాపాడుకోవడానికి జీవనశైలిని సక్రమంగా మార్చుకోవడానికి ఓపెన్ జిమ్లు ఉపయోగించుకోవాలని కోరారు.అలాగే స్థానిక ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని శ్మశానవాటికను ఆధునికంగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ప్రాంతంలో ప్రాథమిక వసతుల మెరుగుదలకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో క్యాతన్ పల్లి కమీషనర్ గద్దెరాజు నాయకులు అబ్దుల్ అజీజ్,ఇతర నాయకులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే దివంగత పీ.రామస్వామి సేవలు స్ఫూర్తిదాయకం..



**నాంపల్లి,హైద్రాబాద్,నవంబర్18(సూర్యరేఖ)** తెలంగాణ బీజేపీ నాయకుడు మాజీ మంత్రి,మహారాజ్ గంజ్ మాజీ ఎమ్మెల్యే దివంగత పీ.రామస్వామి జయంతిని పురస్కరించుకొని గోషామహల్ నియోజకవర్గం గౌలిగూడ ప్రాంతంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సంజయ్ ఘనతే,జియాగూడ డివిజన్ కార్పొరేటర్ బోహిని దర్శన్,బీజేపీ ఓబీసీ మోర్చా జియాగూడ డివిజన్ ప్రధాన కార్యదర్శి సాయికిరణ్ అదోన్ లు పాల్గొని మాజీ ఎమ్మెల్యే దివంగత పీ.రామస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గోషామహల్ నియోజకవర్గం గౌలిగూడ ప్రాంతం ప్రజలకు అందించిన విశేష సేవలు స్మరించుకున్నారు.వారి సేవాభావం నిబద్ధత ఎప్పటికీ స్ఫూర్తిదాయకం అని కొనియాడారు.

## మున్సిపల్ పారిశుద్ధ కార్మికుని కూతురు పెళ్లికి రూ.40వేలు పెళ్ళికానుక..

**టిపిసిసి స్టేట్ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి**



**కామారెడ్డి నవంబర్18(సూర్యరేఖ)** కామారెడ్డి మున్సిపల్ లోని పనిచేస్తున్నటువంటి పారిశుద్ధ కార్మికుడు షేక్ మహబూబ్ కూతురి పెళ్లి సందర్భంగా వారి ఆర్థిక పరిస్థితి దృష్టిలో పెట్టుకొని వారి కుటుంబానికి పెళ్లి కానుకగా రూ.40 వేలను టిపిసిసి స్టేట్ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి అందజేశారు.ఈ కార్యక్రమంలో తాజా మాజీ కౌన్సిలర్లు పంపరి శ్రీనివాస్,జూలూరి సుధాకర్,చాట్ల వంశీ,సాయి బాబా,మున్సిపల్ యూనియన్ లీడర్ ప్రభాకర్ ఆనంద్ ప్రభు జ్యోతి దీవెన తదితరులు పాల్గొన్నారు.

# కార్తీక మాస మహాచండీ యోగం..శ్రీచక్ర అర్చన





**ఖమ్మం జిల్లా,నవంబర్18(సూర్యరేఖ)** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని శ్రీవీరబ్రహ్మేంద్రనగర్ లో కార్తీక మాసం సందర్భంగా పోలోజ్ సాయిలు సావిత్రి దంపతుల కుమారులు,ప్లోజ్ గోపాచారి కళావతి,పోలోజ్ నాగచారివాణి దంపతులు పోలోజ్ సుధాకరాచారి నాగమల్లేశ్వరి దంపతు,ల ఆధ్వర్యంలో మహా చండీయోగం,శ్రీచక్ర అర్చన హెూమం,తదుపరి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి అర్చకులు నర్సింగ్ గోజ్ శివనాథచారి, విశ్వనాధుని రామాచారి మోతుకూరి ఫణీంద్రచారి, రామడుగు మిధునా చారి మునగాల అఖిల్ శర్మ బ్రహ్మోత్సవములో మహా చండీయోగం ఘనంగా నిర్వహించి పూర్ణాహుతి జరిపించారు.ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ మండల సీనియర్ నాయకులు ఏనుగు సత్యంబాబు,నాణెంకల రవి, పెద్దబోయిన దుర్గాప్రసాద్,తూముల శ్రీనివాసచారి కంభంపాటి నరసింహాచారి,రవి,పెద్దబోయిన శ్రీనివాసరావు శ్రీరాములు,బసవచారి,మహిళలు పిల్లలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థులకు భోజన ప్లేట్ల పంపిణీ




**ఎమ్మెల్యే కృషిని కొనియాడిన టిపిసిసి కార్యదర్శి చౌదరి సుప్రబాత్ రావు..**

**రామాయంపేట,నవంబర్18(సూర్యరేఖ)** మండల పరిధిలోని ఝాన్సీ లింగాపూర్ ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం మధ్యాహ్న భోజనం కోసం కాంగ్రెస్ పార్టీ తరపున ప్లేట్లను పంపిణీ చేశారు.ఈ ప్లేట్లను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బండారి మహేందర్ రెడ్డి సమకూర్చగా,టిపిసిసి కార్యదర్శి చౌదరి సుప్రభాత రావు చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు.

ఈ సందర్భంగా టిపిసిసి కార్యదర్శి చౌదరి సుప్రభాత రావు మాట్లాడుతూ. స్థానిక ఎమ్మెల్యే రోహిత్ రావు మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. విద్యాభివృద్ధికి ఆయన ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని అందులో భాగంగానే రామాయంపేటకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలను మంజూరు చేయించిన ఘనత ఎమ్మెల్యే రోహిత్ రావుది అని అన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ... పాఠశాలకు మౌలిక వసతులు ఇతర సహాయ సహకారాలు ఏదైనా అవసరం పడితే,తన వంతుగా ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఇకపై మండలంలోని అన్ని పాఠశాలలకు తన సేవలు విస్తరిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శివకుమార్ సాగర్ పౌల్ సత్యనారాయణ మానిక్యరెడ్డి,రవి తేజ్ రవికుమార్ ప్రవీణ్,తో పాటు యువజన సంఘాల నాయకులు,గ్రామ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమం కోసమే సహకార సంఘాల ఏర్పాటుతోనే రైతులకు మేలు





**నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి సమావేశానికి హాజరైన రైతులు...**

**కొల్చారం,నవంబర్18(సూర్యరేఖ)** రైతుల సంక్షేమం కోసమే సహకార సంఘాలు ఏర్పాటు అయినట్లు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అన్నారు.మెదక్ జిల్లా కొల్చారం మండలం రంగంపేట ప్రాథమిక సహకార సంఘం ఆవరణలో సహకార సంఘం చైర్మన్,ఉమ్మడి మెదక్ జిల్లా డిసిఎంఎస్ వైస్ చైర్మన్ అరిగె రమేష్ అధ్యక్షతన మంగళవారం జరిగిన సహకార వారోత్సవాల కార్యక్రమానికి ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రైతులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు.ప్రైవేటు వడ్డీ వ్యాపారుల బారి నుండి రైతులను కాపాడడం కోసం రైతులకు వ్యవసాయ రంగంలో వ్యవసాయ అనుబంధ రంగాలలో పెట్టుబడులకు సాయం అందించడం కోసమే సహకార సంఘాలను ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి తెలిపారు.సహకార సంఘంలో విత్తనాల విక్రయం నుండి పండిన పంట విక్రయించే వరకు రైతులకు అవసరమైన అన్ని రకాల సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకున్నది అన్నారు.గతంలో సహకార సంఘాలు కేవలం రుణ పంపిణీకి మాత్రమే పరిమితం అయ్యేవని కానీ ప్రస్తుతం సహకార సంఘాలలో విత్తనాలు ఎరువులు పురుగుమందులు విక్రయం పండిన పంటను కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి కొన్ని మిల్లులకు పంపడం లాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సహకార సంఘాలు బలోపేతం అవుతున్నాయని లాభాల బాట పడుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. తక్కువ వడ్డీకి ఎక్కువ రుణాలను రైతులకు అందించే ఏకైక సంస్థ సహకార సంఘాలు అన్నారు.సహకార సంఘాల ద్వారా పాలు అమ్ముకోవడానికి మోటార్ సైకిళ్ళు కొనుగోలు కురుణాలు,డైరీ ఫార్మ్,కోళ్ల ఫారాల ఏర్పాటుకు రుణాలు వ్యవసాయ స్వల్పకాలిక రుణాలు ట్రాక్టర్లకు రుణాలు,గృహ రుణాలు లాంటి ఎన్నో రకాల రుణాలను అందిస్తుందని కమర్షియల్ బ్యాంకులతో పోలిస్తే సహకార సంఘాలలో వడ్డీ తక్కువగా ఉంటుందని సకాలంలో రుణాలు చెల్లించిన రైతులకు వడ్డీరాయితీ కూడా ప్రభుత్వం ఇస్తుందని ఎమ్మెల్యే తెలిపారు.ఈ అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.ప్రస్తుత పాలకవర్గం బాధ్యతలు చేపట్టే సమయానికి రంగంపేట సహకార సంఘంలో రూ.65 లక్షల అప్పులో ఉండగా ప్రస్తుత పాలకవర్గం అప్పులన్నీ రూ.20 లక్షలు నగదు నిలువ ఉంచడం గర్వించదగ్గ విషయమన్నారు.రంగంపేటలో షెడ్డు నిర్మాణం ఎనగండ్ల సహకార సంఘం స్థలానికి ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం హర్షించదగ్గ విషయం అన్నారు.సంఘం అభివృద్ధితో పాటు రైతుల అభివృద్ధికి పాలకవర్గ సభ్యులు కృషి చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాలకవర్గ సభ్యులకు సూచించారు.ఈ సందర్భంగా చైర్మన్ డిసిఎంఎస్ వైస్ చైర్మన్ అరిగి రమేష్ మాట్లాడుతూ.. పాలకవర్గ సభ్యులు రైతుల సహకారంతో గతంలో కొరుకోటి 20 లక్షల టర్నోవర్ ఉన్న సహకార సంఘాన్ని ఐదున్నర కోట్ల వరకు పెంచినట్లు సహకార సంఘాన్ని నగదు నిల్వ ఉండేలా అభివృద్ధి చేసినట్లు తెలిపారు.సహకార సంఘంలోకి వర్షం నీరు రాకుండా డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, సహకార సంఘానికి శాశ్వత కొనుగోలు కేంద్రం ఏర్పాటు కోసం ఖాళీ స్థలం ఇప్పించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. దీంతోపాటు సహకార సంఘంలో షెడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సహకార సంఘం ఉపాధ్యక్షులు మల్లేశం సీఈవో నవీన్,జిల్లా సహకార అధికారి కరుణాకర్,జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్,జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్,మండల వ్యవసాయ అధికారి శ్వేతా కుమారి,సహకార సంఘం డైరెక్టర్లు ప్రవీణ్ రెడ్డి,గంగులు పెంటయ్య,ఆకుల రమేష్, విశ్రాంత తహసిల్దార్ బాలకృష్ణారెడ్డి, సంగాయపేట మంజీరా రైతు, ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షులు వెంకటరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీ పబ్లిక్ స్కూల్ బిఎంఎస్ సమావేశంలో పాల్గొన్న ఎన్విఎస్ఎస్ ప్రభాకర్



**ఉప్పల్,నవంబర్18 (సూర్యరేఖ)** నాచారం డివిజన్ పరిధిలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ బి.ఎం.ఎస్ భారతీయ మజ్దూర్ సంఘ్ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఉప్పల్ మాజీ శాసనసభ్యులు ఎన్విఎస్ఎస్ ప్రభాకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్,ఉప్పల్ అసెంబ్లీ కన్వీనర్ దేవసాని బాలచందర్,మీర్పేట్ హౌసింగ్ బోర్డు డివిజన్ అధ్యక్షులు రాంప్రదీప్,నాచారం డివిజన్ అధ్యక్షులు నవీన్ కుమార్,మల్కా ప్రకాష్,యోగేశ్వర్ రెడ్డి, అభిషేక్ గౌడ్ దయాగౌడ్ మంజులవాణి డిపిఎస్ .బి ఎంఎస్ కార్మికులు,డ్రైవర్లు,యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## పత్తి రైతులను రక్షించాలని పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ కేంద్రమంత్రికి విజ్ఞాపన లేఖ



**మంచిర్యాల,నవంబర్18 (సూర్యరేఖ)**ఆరుగాలం కష్టపడి పండించిన పత్తిని అమ్ముకునేందుకు సరైన మార్గం లేక చాలా నష్టాల్లో ఉన్నా తెలంగాణ పత్తి రైతుల అభ్యర్థనను సమస్యలను పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ కేంద్రం దృష్టికి తీసుకువెళ్లారు. 2025-26 పత్తి కొనుగోలు సీజన్ నేపథ్యంలో కేంద్ర టెక్స్ టైల్స్ యూనియన్ మంత్రి గిరిరాజ్ సింగ్ జీకి ఎంపీ గడ్డం వంశీ రైతుల సమస్యలకు తక్షణ పరిష్కారం తీసుకోవాలని పలు కీలక సూచనలతో కూడిన అధికారిక విజ్ఞాపన లేఖను పంపారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ..సీసీఐ ప్రతిపాదించినట్టు రాష్ట్ర సగటు పత్తి దిగుబడిని 11.74 క్వింటాళ్ల నుంచి 7 క్వింటాళ్లకు తగ్గించడం తప్పు నిర్ణయమని పేర్కొన్నారు.ఈ అంచనా రాష్ట్రంలోని 33 జిల్లా కలెక్టర్లు,వ్యవసాయ శాఖ డైరెక్టర్ సమర్పించిన ధృవీకరించిన డేటాకి విరుద్ధమని ఆయన స్పష్టం చేశారు.ఈ సీజన్‌లో ఇప్పటి వరకు మొత్తం 6,680 ఎంఎంటిలు పత్తి కొనుగోలు కాగా,3,175 మంది రైతులు లబ్ధి పొందారని,పత్తి కొనుగోలు మొత్తం విలువ రూ.52.25 కోట్లు,అందులో రూ.15.04 కోట్లు ఇప్పటికే రైతుల ఖాతాల్లో జమయ్యాయని,ఇప్పటికే మోంతా తుఫాను కారణంగా నష్టపోయిన రైతుల పరిస్థితి మరింత దెబ్బతింటుందని,దిగుబడి అంచనాలను తగ్గించే నిర్ణయాన్ని పునర్విమర్శించాలని కోరారు. అదేవిధంగా పత్తి మిల్లర్లు ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సూచించిన మాయిశ్చర్ నార్మ్స్,ఎల్ 1/ఎల్2 విభజన సమస్య,స్లాట్ బుకింగ్ కష్టాలు జిన్నింగ్ మిల్లుల కార్యకలాపాల సమస్యలు వంటి అంశాలను కూడా కేంద్రం దృష్టికి తీసుకువెళ్లారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పలు సానుకూల చర్యలను ఎంపీ ప్రశంసించారు.టోల్-ఫ్రీ హెల్ప్‌లైన్, 176 మార్కెట్ యార్డుల్లో ప్రత్యేక సహాయ కేంద్రాలు,సీసీఐతో కలిసి జిన్నింగ్ మిల్లుల మ్యాపింగ్,అవగాహన కార్యక్రమాలు రైతులకు మేలు చేస్తాయని తెలిపారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి లేఖ ద్వారా నివేదించిన ప్రధాన డిమాండ్ల సారాంశాన్ని ఎంపీ వంశీ వివరించారు.రాష్ట్ర సగటు పత్తి దిగుబడి 11.74 క్వింటాళ్లుగా కొనసాగించాలని,మాయిశ్చర్ పరిమితిని 20 శాతం వరకు సడలించాలని మిల్లర్లు,ట్రేడర్స్ అసోసియేషన్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని,ఈ చర్యలతోనే రైతులకు న్యాయమైన ధరలు,సాఫీ కొనుగోలు ప్రక్రియ సాధ్యమవుతుందని ఎంపీ గడ్డం వంశీకృష్ణ లేఖలో స్పష్టం చేశారు.

## మహిళా జర్నలిస్టులపై దుర్భాషలపై చర్యలు

**హైదరాబాద్ :** మహిళా జర్నలిస్టులపై ఆన్లైన్లో వస్తున్న బెదిరింపులు, దుర్భాషలపై కఠిన చర్యలు తీసుకుంటామని నగర పోలీసు కమిషనర్ వి.సి. సజ్జనార్ హామీ ఇచ్చారు. స్వతంత్ర జర్నలిస్టు తులసి చందు సహా పలువురు మహిళా జర్నలిస్టులు మంగళవారం కమిషనర్కు ఫిర్యాదు సమర్పించారు.తమపై జరుగుతున్న నిరంతర ట్రోలింగ్, వేధింపులు, బెదిరింపులు, అసభ్య దాడుల వివరాలను వారు అందించారు. ట్రోలింగ్ వీడియోలు చూపించిన జర్నలిస్టులు జర్నలిస్టుల ప్రతినిధి బృందం ట్రోలింగ్ స్వరూపాన్ని చూపించే అనేక వీడియోలను కమిషనర్కు ప్లే చేసి చూపించింది.పలు సోషల్ మీడియా హ్యాండిల్లు నిరంతరం విద్వేష వ్యాఖ్యలు, అసభ్య పోస్టులు, దాడులు చేస్తూ మహిళా జర్నలిస్టులను అవమానించాలని, భయపెట్టాలని చూస్తున్నాయని వారు తెలిపారు. సజ్జనార్ అందుబాటులో ఉన్న లింకులు, స్క్రీన్షాట్లు, వీడియోలను తన కార్యాలయానికి ఇవ్వాలని కోరారు. “చర్యలు తీసుకుంటాం. మీరు త్వరలో చూస్తారు. చర్యల తర్వాత మళ్లీ మాట్లాడుతాను,” అని ఆయన జర్నలిస్టులకు చెప్పినట్లు తెలుస్తోంది.

# "శ్రీకారం" పేరుతో విస్తృత స్థాయి నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం





**డైరెక్టర్ జనరల్ పోలీస్ శ్రీ బి.శివధర్ రెడ్డి**

**నాంపల్లి,హైద్రాబాద్,నవంబర్18(సూర్యరేఖ)** హైదరాబాద్ సిటీ పోలీసులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చేందుకు ఒక గొప్ప మార్పునకు ఇదే శ్రీకారం అంటూ శ్రీకారం పేరుతో కార్యక్రమాన్ని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి.శివధర్ రెడ్డి ప్రారంభించారు.టిజిఐసిసిసి ఆడిటోరియంలో మంగళవారం జరిగిన ఈ శిక్షణా కార్యక్రమ ప్రారంభోత్సవంలో హైదరాబాద్ సీపీ శ్రీవి.సి సజ్జనర్ తో కలిసి డిజిపి పాల్గొన్నారు.ఈ సందర్భంగా శిక్షణా మెటీరియల్ ప్రతులను వారు ఆవిష్కరించారు.పోలీసు సిబ్బందిలో నైపుణ్యాలను పెంపొందించి, ప్రజలకు మరింత మెరుగైన సేవలను అందించడమే ఈ శిక్షణా కార్యక్రమ ప్రధాన ఉద్దేశం అని,కమిషనరేట్ పరిధిలోని 19,488 మందికి దశలవారిగా శిక్షణ ఇవ్వనున్నామన్నారు.హైదరాబాద్ సిటీ పోలీస్ చరిత్రలో అందరికీ ఈ తరహా శిక్షణ కార్యక్రమం నిర్వహించడం ఇదే మొదటిసారియని.క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు గాను 178 మంది ప్రత్యేక శిక్షకులను ఎంపిక చేశామన్నారు. అందులో 74మంది ఏసీపీలు,98 మంది ఇన్‌స్పెక్టర్లు మరియు రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు,6మంది ఎస్సైలు ఉన్నారు. వారందరికీ ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ కార్యక్రమం నిర్వహించారు.వీరంతా తమ తమ డివిజన్ల పరిధిలోని సిబ్బందికి శిక్షణను ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిజిపి బి.శివధర్ రెడ్డి మాట్లాడుతూ.. పోలీసింగ్ లో వస్తోన్న మార్పులకు అనుగుణంగా ప్రతి ఒక్కరు రీస్కిల్లింగ్ కావాల్సిన అవసరం ఉందని అన్నారు.ఉద్యోగి జీవితంలో శిక్షణ కీలకపాత్ర పోషిస్తుందని,ట్రైనింగ్ లో అనేక కొత్త విషయాలను నేర్చుకోవచ్చని ఆయన చెప్పారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం ప్రజల్లో చైతన్యం పెరిగిందని,అందుకు అనుగుణంగా పోలీసుల ప్రవర్తనలో మార్పురావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.పోలీసు వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం మరింతగా పెంచడంలో ఈ శిక్షణ దోహదం చేస్తుందని అన్నారు."ఒక గొప్ప మార్పునకు ఇదే శ్రీకారం అనే పేరుతో సిబ్బంది అందరికీ నైపుణ్యాభివృద్ధి శిక్షణ అనే ఆలోచన మంచిందంటూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోన్న హైదరాబాద్ సిపి శ్రీవి.సి సజ్జనార్ ని అభినందించారు.హైదరాబాద్ సిపి శ్రీవి.సి సజ్జనర్ మాట్లాడుతూ..ఏ సంస్థ అయినా అభివృద్ధి చెందాలంటే సిబ్బందికి శిక్షణ అవసరం అన్నారు. ఈ శిక్షణ నైపుణ్యం పెంచడంతో పాటు అందరికీ ఒకే తాటిపైకి తీసుకువచ్చేందుకు దోహదం చేస్తుందని చెప్పారు.ఈ కార్యక్రమాన్ని ఒక నెల నుంచి కసరత్తు చేసి మంచి ప్రణాళికతో ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు.ప్రతి ఒక్కరిని ఒక సమర్థవంతమైన, బాధ్యతాయుతమైన పోలీస్ అధికారిగా తీర్చిదిద్దేలా రూపొందించామని తెలిపారు.గతాన్ని తెలుసుకుని విష్యత్తు దిశలో ముందుకు తీసుకెళ్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రవర్తన,పనితీరే పోలీస్ ప్రతిష్టను ఇను మడింపజేస్తోందనే విషయాన్ని సిబ్బంది గుర్తుంచుకోవాలని వివరించారు.ఈ కార్యక్రమం లో అడిషనల్ సిపి క్రైం ఎం.శ్రీనివాస్, జాయింట్ సిపి అడ్మిన్ శ్రీమతి పరిమళ హాన నూతన్,డిసిపి హెడ్‌క్వార్టర్స్ శ్రీమతి రక్షితా కృష్ణమూర్తి, డిసిపి,ఎస్బీ కె.అపూర్వరావు డీసీపీ (డీడీ) శ్రీమతి శ్వేత,డిసిపి సౌత్ జోన్ శ్రీమతి స్నేహా మెహ్రా ఐపిఎస్,బి.బాలస్వామి ఐపిఎస్ డిసిపి ఈస్ట్ జోన్,శిక్షణా ఫ్యాకల్టీలు జి.యుగందర్ ఎ.మల్లేశ్, శ్రీమతి నళినిలతో పాటు అన్ని జోన్ల డిసిపిలు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను ప్రభుత్వం విడుదల చేయాలి

**పెట్టుబడి పెట్టిన డబ్బులు ఇవ్వకుండా బెదిరింపులా...?**

**ఏజెన్సీ నిర్వాహకులకు,కార్మికులకు ఇబ్బందులు ఏర్పడితే ప్రభుత్వ అధికారులదే బాధ్యత**

**సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సంకె రవి**





**మంచిర్యాల,నవంబర్18(సూర్యరేఖ)** జిల్లాలోని మధ్యాహ్న భోజన కార్మికులు,ఏజెన్సీ నిర్వాహకుల కు సంబంధించిన పెండింగ్ బిల్లు (రూ.10 కోట్లకు పైగా రూపాయలు) వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ మంచిర్యాల జిల్లా ఉపాధ్యక్షుడు సంకె రవి డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో సీఐటీయూ మంచిర్యాల జిల్లా ఉపాధ్యక్షుడు సంకె రవి మాట్లాడుతూ..ప్రభుత్వం ఇప్పటికీ ఈ బిల్లులను విడుదల చేయకపోవడం వల్ల కార్మికులు నిర్వాహకులు అప్పులు తీసుకుని పనులు కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులు,ఏజెన్సీ నిర్వాహకులకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలను అప్పుల పాలు చేయడం జరుగుతుందని మంచిర్యాల జిల్లాలో సుమారు రూ.10 కోట్లకు పైగా రూపాయలు మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు కార్మికులకు రావాల్సి ఉందని,ప్రభుత్వాలు డబ్బులు ఇవ్వకుండా తమ దగ్గర పెట్టుకొని మహిళలను అప్పులపాలు చేయడం ఈ ప్రభుత్వాలకే చెందిందని,ఒకవైపు మహిళలను అభివృద్ధి చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వాలు మధ్యాహ్న భోజనం నిర్వహణ కోసం మహిళలు అప్పులు చేసి పెట్టిన డబ్బులు ఎనిమిది నెలలు దాటిన ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు. కష్టాలు అప్పులు అవమానాలతో మహిళలు మానసిక క్షోభకు గురౌవుతుంటే,అది చాలదన్నట్టు ప్రభుత్వాలు అధికారులు ఉపాధ్యాయులు బెదిరిస్తూ వంటలు చేయించడం జరుగుతుందని,వీరికి బిల్లులతో సంబందం లేదన్నట్లు వ్యవరిస్తున్నారని,తక్షణమే ప్రభత్వాలు జిల్లాలో పెండింగ్ లో ఉన్న రూ.10 కోట్లకు పైగా రూపాయలను వెంటనే ఏజెన్సీ నిర్వాహకులకు కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షురాలు దాసరి రాజేశ్వరి,సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు గట్టు మహేందర్,సాతిని లక్ష్మి,దాసరి సునిత తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గాన్ని అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంచిన కల్వకుంట్ల

**ఆయన కుటుంబానికి మాట్లాడే హక్కు లేదు**

**కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు**



**కోరుట్ల** : కోరుట్ల నియోజకవర్గాన్ని అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంచిన కల్వకుంట్ల కుటుంబానికి మాట్లాడే హక్కు లేదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. పట్టణంలోని జువ్వాడి భవన్ మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోరుట్ల నియోజకవర్గం ఏర్పాటు అయిన నాటి నుండి కల్వకుంట కుటుంబంలోని తండ్రి, కొడుకులు ఎమ్మెల్యేలు గా ఎన్నికైన నియోజకవర్గాన్ని అభివృద్ధి పరచడంలో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. టిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న పది సంవత్సరాల కాలంలో రాష్ట్ర ఐటీ పరిశ్రమలు, పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా ఉన్న కల్వకుంట్ల తారక రామారావు కోరుట్ల ఎమ్మెల్యేగా ఉన్న కల్వకుంట్ల సంజయ్ లు సన్నిహితులమని చెప్తూ ముత్యంపేట లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ నిర్మించిన చక్కెర కర్మాగారాన్ని మూసి వేయించిన ఘనత కల్వకుంట్ల కుటుంబాన్ని కాదా అని అన్నారు. కొండ్రి కర్ల వంతెన నిర్మించారా ? మెట్ పల్లి డిగ్రీ కాలేజీని నడవకుండా చేశారు కదా ? జువ్వాడి రత్నాకర్ రావు మంత్రిగా ఉన్న సమయంలో కోరుట్ల నియోజకవర్గానికి రాష్ట్రంలోనే ఉమ్మడి రాష్ట్రంలోనే రెండోదిగా పశు వైద్య కళాశాలను మంజూరు చేయించారని కానీ కల్వకుంట్ల కుటుంబం తమ స్వార్థంతో నియోజక వర్గంలో నడుస్తున్న తిరుమల ఇంజనీరింగ్ కళాశాలను ఇక్కడి నుంచి హైదరాబాద్ తరలించి కల్వకుంట్ల కుటుంబ వ్యాపారం చేసుకుంటున్నది వాస్తవం కాదా అని అన్నారు.ఈ కార్యక్రమంలో కోరుట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొంతం రాజం,కోరుట్ల నియోజక వర్గ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ఏలేటి మహిపాల్ రెడ్డి, కోరుట్ల పట్టణ ఉపాధ్యక్షులు నయీం, బీసీ సెల్ మండల అధ్యక్షులు ముక్కెర లింబాద్రి, కిషన్ సెల్ జిల్లా కార్యదర్శి పోతుగంటి శంకర్,కోరుట్ల మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇంద్రాల హరీష్,జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కట్కం చంద్ర శేఖర్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ వసీద్,కాంగ్రెస్ పార్టీ నాయకులు ముజ్జు,సరుగు సురేష్ , సులేమాన్, అరవింద్, ఏ.ఆర్ అక్బర్,రవీందర్,సత్యం తదితరులు పాల్గొన్నారు

## హైదరాబాద్‌లోని ఐటీ దాడులు కలకలం..

## ఆ రెండు హోటళ్లే లక్ష్యంగా15చోట్ల సోదాలు




**రాజేంద్రనగర్,నవంబర్18(సూర్యరేఖ)** హైదరాబాద్ నగరంలో ఆదాయ పన్ను శాఖ భారీ స్థాయిలో దాడులు చేపట్టింది.ప్రముఖ హోటల్ వ్యాపారులకు చెందిన చైర్మన్‌లు,డైరెక్టర్ల ఇండ్లతో పాటు మొత్తం15 ప్రాంతాల్లో ఐటీ అధికారులు విస్తృతంగా శోధనలు జరుపుతున్నారు. నగరంలో కోట్ల రూపాయల టర్నోవర్‌తో పనిచేస్తున్న ప్రముఖ హోటల్ చైన్‌లు పిస్తాహౌస్,షాహ్ ఘౌస్ సహా మరికొన్ని పెద్ద వ్యాపార సంస్థలు ఈ సోదాల పరిధిలోకి వచ్చాయి.ప్రతి సంవత్సరం వందల కోట్ల విలువైన వ్యాపారం జరిగే ఈ సంస్థల ఖాతాలకు సంబంధించిన పత్రాలను అధి కారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం.పిస్తాహౌస్,షాగౌస్ హోటళ్లు ఇతర నగరాల్లోనూ నడుస్తున్నాయి.దుబాయ్స్ నూ వాటికి బ్రాంచ్లు ఉన్నాయి.భారీ పన్ను ఎగవేత ఆరోపణల నేపథ్యంలో ఆదాయపనశాఖ అధికారుల తనిఖీలు చేపట్టారు.రాజేంద్రనగర్ లోని పిస్తాహౌస్ యజమాని మాజిద్ ఇంట్లో, శాలిబండలోని పిస్తాహౌస్ ప్రధాన బ్రాంచ్లో సోదాలు కొనసాగుతున్నాయి. ఐటీ దాడులపై మరిన్ని వివరాలు త్వరలో వెలువడనున్నాయి. అయితే ఈ సోదాలకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## కాంగ్రెస్ పాలనతో విసిగిపోయిన ప్రజలు..

**ప్రజలను నమ్మబలికే మాటలతో మోసగిస్తున్న వైనం.**

**బీఆర్ఎస్ నాయకుల డిమాండ్**



**రాజేంద్రనగర్,నవంబర్18(సూర్యరేఖ)** కాంగ్రెస్ పాలకులు అధికారం కోసమే ఎగబడుతూ అభివృద్ధిని గాలికి వదిలేశారని మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు అన్నారు.బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ పాలకులు వైఫల్యం చెందారని వివరించారు.ఈ ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ...గత రెండు సంవత్సరాలుగా బీసీ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే అమలులో ఉన్న 15 శాతం గిరిజన షెడ్యూల్ తెగలకు,10 శాతం హరిజన షెడ్యూల్ కులాల రిజర్వేషన్లకు అదనంగా బీసీలకు తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 46.33 శాతం ఉన్న జనభాకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కళ్ళబొల్లి కబుర్లు చెబుతూ తెలంగాణ వెనుకబడిన తరగతుల ప్రజానీకానికి నమ్మబలికిందన్నారు.చివరకు భారతదేశ రాజ్యాంగ ధర్మాసనమైన సర్వోత్తమ న్యాయ స్థానం తీర్పుతో రాష్ట్ర ప్రభుత్వం చతికిలబడిందన్నారు. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు పలుమార్లు స్థానిక సంస్థల ఎన్నికల గురించి రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించిన అనంతరంఈ మధ్య జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పార్టీపరంగా బీసీలకు 42 శాతం సర్పంచ్ ఎన్నికలలో రిజర్వేషన్ కల్పిస్తామని తెలియజేయడం జరిగిందన్నారు.స్థానిక గ్రామ పంచాయతీ ఎన్నికలు అనేవి పార్టీ రహితంగా పార్టీ గుర్తులు లేకుండా జరిగే ఎన్నికలు కావున రాష్ట్ర ప్రభుత్వం తెలుపుతున్న 42 శాతం బీసీ రిజర్వేషన్లు ఏ రకంగా అమలు చేస్తారన్నది ప్రశ్నార్థకమనన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 33 జిల్లాలలో ఏకమొత్తంగా 12,769 గ్రామ పంచాయతీలు ఉండగా 25 శాతం షెడ్యూల్ కులాలు,తెగలకు పోగా,42 శాతం బీసీలకు పార్టీపరంగా టికెట్లు కేటాయిస్తామని తెలియజేస్తున్నారని వివరించారు.బీసీలలో ఏ,బి,సి,డీ వర్గాలు,ముస్లిం,మైనారిటీల 10 శాతం బిసి–ఈ వర్గానికి చెందినవి కలుపుకుంటే దాదాపు 52 శాతం బీసీ లకు రిజర్వేషన్ కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న పలు శాస్త్రీయ పద్ధతిలో చేపట్టిన సర్వేల ఆధారంగా బీసీలు 42 శాతం ఉన్నారని,ఢిల్లీ నుంచి గల్లీ వరకు గొంతుచించుకొని చెప్పడం జరిగిందన్నారు.బీసీలలో మైనారిటీ ముస్లింలను కలుపుకొని దాదాపు 162 కులాలు ఉన్నాయన్నారు.మరి ఈ 162 కులాలలో ఏ కులానికి ఎంత శాతం రిజర్వేషన్ వర్తిస్తుందో ఇంత వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించలేదన్నారు.కావున స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వచ్చే లోపు 162 కులాలలో ఏ కులానికి ఎంత శాతం,ఏ గ్రామ పంచాయతీలు ఏ కులాలకు అనుగుణంగా తేల్చి చెప్పగలరో సవివరంగా తెలియజేయాల్సిన కనీస బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు.కావున వెంటనే ఈ విషయమై స్థానిక గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కంటే ముందే ప్రజలకు సవివరంగా తెలియజేయాలని,మణికొండ బిఆర్ఎస్ పార్టీ బీసీవర్గం ముక్త కంఠంతో డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బుద్ధోలు బాబు,గుట్టమీది నరేందర్,అందె లక్ష్మణ్ రావు,సంగం శ్రీకాంత్, బండమీది మల్లేశ్,మొహమ్మద్ ఆరీఫ్,షేక్ ఆరీఫ్,శ్రీనివాస్ చారి,గోపి, ప్రశాంత్,సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## పెట్టుబడి లేకుండానే వ్యాపారం.. 'డబ్ల్యూకామర్స్' వెల్లడి




సరుకులు నిల్వ చేయాల్సిన అవసరం లేదు..అంతేకాదు పైసా పెట్టుబడి లేకుండానే వ్యాపారం చేయవచ్చునని డిజిటల్ కామర్స్ సేవల సంస్థ డబ్ల్యూకామర్స్ వెల్లడించింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాలను ఆసరాగా చేసుకొని చిరు వ్యాపారులు, వ్యక్తులు ఎవరైనా వ్యాపారం ప్రారంభించుకోవచ్చును. విక్రేతల పేరుతో కంపెనీ ఒక ఆన్‌లైన్ స్టోర్‌ను క్రియేట్ చేస్తున్నది. సోషల్ మీడియాలో ఈ ఆన్‌లైన్ స్టోర్‌కు సంబంధించి లింక్/క్యూఆర్‌కోడ్‌ను పోస్ట్ చేయడం లేదా బంధువులు, స్నేహితులకు షేర్ చేసిన చాలు. కంపెనీ ఆఫర్ చేసే ఉత్పత్తులను ఎవరు కొనుగోలు చేసినా..విక్రేతకు 20-40 శాతం వరకు లాభం రానున్నది. ఇలా బుకింగ్ చేసుకున్న వస్తువుల డెలివరీ బాధ్యతలను కంపెనీ తీసుకుంటుందని డబ్ల్యూకామర్స్ కో-ఫౌండర్, సీవోవో శ్రీధర్ శ్రీరామనేని తెలిపారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా 22 వేలకు పైగా యాక్టివ్ ఆన్‌లైన్ స్టోర్స్ ఉన్నాయన్నారు. హెల్త్, వెల్‌నెస్, బ్యూటీ, పర్సనల్ కేర్, హోమ్ ఎసెన్షియల్ విభాగాలకు చెందిన 40కి పైగా బ్రాండ్ నుంచి 600కి పైగా ఉత్పత్తులను అందుబాటులోకి తెచ్చినట్టు చెప్పారు.

## జీఎస్‌టీ మినహాయింపు విభాగంలోకి జీవిత బీమాను చేర్చాలి




జీవిత బీమాను జీఎస్‌టీ మినహాయింపు విభాగంలోకి చేర్చాలని ఎల్ఐసీ మేనేజింగ్ డైరెక్టరు రత్నాకర్ పట్నాయక్ తెలిపారు. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ)ను క్లెయిమ్ చేసుకునేందుకు జీవిత బీమా సంస్థలకు ఇది ఉపయోగపడు తుందని అన్నారు. జీవిత, ఆరోగ్య బీమాలపై జీఎస్‌టీని తొలగిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పట్నాయక్ స్వాగతించారు. 'పన్ను సున్నానే. అయితే అది జీఎస్‌టీ మినహాయింపా? మా చిన్న కోరిక ఏమిటంటే.. జీఎస్‌టీ మినహాయింపు విభాగంలోకి ఉంచాలి. అప్పుడే మేం కొంత ఐటీసీని క్లెయిమ్ చేసుకోగలం' అని సీఐఐ సమావేశంలో మాట్లాడుతూ రత్నాకర్ అన్నారు. ఆగస్టులో జీవిత బీమా ప్రీమియంపై జీఎస్‌టీని సున్నాకి తగ్గించినప్పటికీ.. జీఎస్‌టీ మినహా విభాగం కిందకు తేలేదు. జీఎస్‌టీ మినహాయింపు విభాగంలోకి తెస్తే.. ఐటీసీని క్లెయిమ్ చేసుకోవడం ద్వారా నిర్వహణ వ్యయాలను ఆదా చేసుకునే ప్రయోనం ఎల్ఐసీ లాంటి కంపెనీలకు ఉంటుంది.


# అక్టోబర్‌లో 200 శాతం పెరిగిన బంగారం దిగుమతులు

ఈ ఏడాది దీపావళి సహా పండుగ సీజన్ బంగారం గిరాకీ ఎక్కువగా ఉండటం, అధిక ధరల కారణంగా అక్టోబర్ నెలలో పసిడి దిగుమతులు ఏకంగా 200 శాతం పెరిగాయని ప్రభుత్వ గణాంకాలు వెల్లడించాయి.ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కొనసాగుతుండటంతో ధరలు అధికంగానే ఉన్నాయని, ఫలితంగా డిమాండ్ నెమ్మదించే అవకాశాలు ఉన్నట్టు ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది. వెండి దిగుమతులు గణనీయంగానే పెరిగాయని, ఈ రెండు విలువైన లోహాల దిగుమతుల కారణంగా అక్టోబర్ నెలలో దేశ వాణిజ్య లోటు అత్యధికంగా 41.68 బిలియన్ డాలర్ల(రూ. 3.7 లక్షల కోట్ల)కు చేరింది. ఈ మేరకు సోమవారం కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాల్లో పేర్కొంది.గత నెలలో దేశీయంగా బంగారం దిగుమతులు 14.72 బిలియన్ డాలర్లు(రూ. 1.30 లక్షల కోట్లు)గా నమోదయ్యాయి. 2024, అక్టోబర్‌లో ఇవి కేవలం రూ. 43.6 వేల కోట్ల దిగుమతులు మాత్రమే జరిగాయి. వెండి దిగుమతులు కూడా రూ. 3,810 కోట్ల నుంచి ఈ ఏడాది అక్టోబర్‌లో రూ. 24 వేల కోట్లకు పైగా పెరిగాయి. ఇక, మొత్తం దేశ ఎగుమతులకు సంబంధించి గత నెలలో 11.8 శాతం తగ్గి 34.38 బిలియన్




డాలర్ల(రూ. 3.04 లక్షల కోట్ల)కు చేరుకున్నాయి. అయితే, దిగు మతులు 16.63 శాతం పెరిగి 76.06 బిలియన్ డాలర్ల (రూ. 6.74 లక్షల కోట్ల)కు చేరుకున్నాయి. దీంతో వాణిజ్య లోటు 41.68 బిలియన్ డాలర్ల(రూ. 3.7 లక్షల కోట్ల)కు పెరిగింది. వాణిజ్య లోటు పెరగడానికి బంగారం, వెండి దిగుమతులు అధికంగా జరగడమ్మని అధికారులు పేర్కొన్నారు.

## నైపుణ్యం ఉన్న కార్మికుల కొరతే పెద్ద సమస్య అన్న మహీంద్రా



కృత్రిమ మేధ రాకతో వైట్ కాలర్ ఉద్యోగాలు కనుమరుగవుతాయనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. అయితే, దీనికంటే పెద్ద సంక్షోభం మన ముందు ఉందని, దాన్ని మనం గుర్తించడం లేదని ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా అన్నారు. నైపుణ్యం కలిగిన కార్మికుల కొరతే అసలైన సమస్య అని ఆయన తన ట్వీట్‌లో అభిప్రాయపడ్డారు. అమెరికా ఆటోమొబైల్ దిగ్గజం 'ఫోర్డ్' సీఈవో జిమ్ ఫార్లే ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో చెప్పిన విషయాన్ని ఆయన ఉటంకించారు. ఫోర్డ్‌లో ప్రస్తుతం 5,000 మెకానిక్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, వాటిలో చాలా వాటికి వార్షిక వేతనం రూ. కోటి కి పైగా ఉన్నప్పటికీ భర్తీ కావడం లేదని మహీంద్రా పేర్కొన్నారు. ఇది కేవలం ఫోర్డ్ కంపెనీకే పరిమితం కాదని, అమెరికా వ్యాప్తంగా ప్లంబింగ్, ఎలక్ట్రికల్, ట్రక్కింగ్ వంటి రంగాల్లో పది లక్షలకు పైగా ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.దశాబ్దాలుగా మన సమాజం డిగ్రీలు, డెస్క్ ఉద్యోగాలకే అధిక ప్రాధాన్యత ఇచ్చిందని, నైపుణ్యం ఆధారిత శ్రామిక శక్తిని విస్మరించిందని మహీంద్రా విశ్లేషించారు. నైపుణ్యం, అనుభవం, నేర్పు అవసరమైన ఈ పనులను ఏఐ భర్తీ చేయలేదని స్పష్టం చేశారు.ఈ ధోరణి ఇలాగే కొనసాగితే, భవిష్యత్తులో ప్రపంచాన్ని నిర్మించే, నడిపించే, మరమ్మతులు చేసే నైపుణ్యం ఉన్నవారే 'ఏఐ యుగంలో' అతిపెద్ద విజేతలుగా నిలుస్తారని ఆయన జోస్యం చెప్పారు. నైపుణ్యం, కొరత కారణంగా కార్మికులు ఉన్నత స్థాయికి ఎదుగుతారని, ఇది హింస ద్వారా కాకుండా నైపుణ్యం ద్వారా వచ్చే విప్లవమని కార్ల్ మార్క్స్ కూడా ఊహించి ఉండరంటూ తన పోస్ట్‌ను ముగించారు.

## జర్మన్ కాస్మోటిక్ బ్రాండ్ 'ఎసెన్స్'ను భారత్‌కు తీసుకొస్తున్న రిలయన్స్



రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన రిటైల్ విభాగం దేశంలో వేగంగా పెరుగుతున్న బ్యూటీ వ్యాపారంపై దృష్టి సారించింది. అందులో భాగంగా యూరప్‌లోని ప్రముఖ కాస్మోటిక్స్ బ్రాండ్ 'ఎసెన్స్'ను భారత మార్కెట్‌కు తీసుకువస్తున్నట్లు సోమవారం ప్రకటించింది. ఇది దేశంలో పెరుగుతున్న బ్యూటీ వ్యాపారంలో రాణించేందుకు సహాయపడుతుంది. ఈ మేరకు జర్మనీకి చెందిన గ్లోబల్ కాస్మోటిక్స్ కంపెనీ కాస్నోవా బ్యూటీతో ప్రత్యేక భాగస్వామ్యం కుదుర్చుకున్నామని రిలయన్స్ రిటైల్ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ సహకారం రిలయన్స్ రిటైల్ బ్యూటీ పోర్ట్‌ఫోలియోను బలోపేతం చేస్తుంది. దేశవ్యాప్తంగా వినియోగదారులకు అధిక నాణ్యత, సరసమైన, హానికరంకాని ఎసెన్స్ బ్యూటీ ఉత్పత్తులను అందిస్తామని కంపెనీ వెల్లడించింది. ఎసెన్స్ ఉత్పత్తులు రిలయన్స్ రిటైల్ ఇంటిగ్రేటెడ్ ఓమ్నిఛానల్ ఎకోసిస్టమ్ ద్వారా ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు, బ్యూటీ స్టోర్‌లు, భాగస్వామ్య రిటైల్ ఫార్మాట్‌లలో లభిస్తాయి. అధికారిక పంపిణీదారుగా రిలయన్స్ రిటైల్ దేశవ్యాప్తంగా వీటిని అందుబాటులో ఉంచుతుందని పేర్కొంది.

# కోల్‌కతాలోనే టీమిండియా.. గంభీర్ నేతృత్వంలో చెమటోడ్చిన ప్లేయర్లు!

దక్షిణాఫ్రికాతో జరిగిన తొలిటెస్టులో భారత జట్టు పరాజయం పాలైంది. ఈ నెల 22 నుంచి గౌహతిలో రెండోటెస్టు జరుగనున్నది. అయితే, ఈ పరాజయంతో రెండురోజులు విశ్రాంతి తీసుకోవడానికి బదులుగా జట్టు శిక్షణ తీసుకోవడంలో నిమగ్నమైంది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో భారత జట్టు సభ్యులు పలువురు మంగళవారం ప్రాక్టీస్ చేశారు. రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో భారతదేశం 0-1తో వెనుకపడింది. రెండోటెస్టును ఎలాగైనా సమయం చేసి సిరీస్‌ను సమం చేయాలని భావిస్తున్నది. కోచ్ గౌతమ్ గంభీర్ నాయకత్వంలో భారత ఆటగాళ్లు ఈడెన్ గార్డెన్స్‌లో శిక్షణ పొందారు. కెప్టెన్ శుభ్‌మాన్ గిల్ మాత్రం ప్రాక్టీస్‌లో కనిపించలేదు. చాలామంది బ్యాట్స్‌మెన్ ప్రాక్టీస్‌లో చెమటో డ్చారు. వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ ధ్రువ్ జురెల్, ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా నెట్స్‌లో బ్యాటింగ్ చేయగా.. ఆకాశ్‌దీప్, వాషింగ్టన్ సుందర్, కోల్‌కతాకు చెందిన పలువురు బౌలింగ్ చేశారు. కోల్‌కతా టెస్ట్‌లో భారత జట్టు ఓటమిని పాలైంది. 124 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేకపోయింది. ఆ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా స్పిన్నర్లు సైమన్ హార్మర్, కేశవ్ మహారాజ్‌లపై భారత బ్యాట్స్‌మెన్‌ను ఇబ్బందిపెట్టారు. టర్నర్ పిచ్‌లతోనే దక్షిణాఫ్రికాను ఇరుకున పెట్టాలని భావించిన టీమిండియా.. అదే వ్యూహంతో బోల్తాపడింది. నెట్ సెషన్‌లో సాయి సుదర్శన్, జురెల్ స్పిన్నర్లను ఎదుర్కొన్నారు. ఇద్దరూ ప్యాడ్‌లు ధరించి ముమ్మరంగా సాధన చేశారు. సాయి సుదర్శన్‌కు తొలి టెస్టు తుదిజట్టులో చోటు దక్కలేదు. అయితే, గౌహతి మ్యాచ్‌లో కూడా ఛాన్స్ లభించే అవకాశాలు తక్కువే. అలాగే,






ధ్రువ్ జురెల్ కుడి కాలుకు ప్యాడ్‌లు లేకుండా సాధన చేయడం కనిపించింది. రివర్స్ స్వీప్‌పై ఎక్కువగా దృష్టి పెట్టాడు. ఈ ఆప్షనల్ ప్రాక్టీస్ సెషన్‌లో హెడ్‌కోచ్ గంభీర్ సాయి సుదర్శన్ ప్రాక్టీస్‌ను నిశితంగా పరిశీలించాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ స్థానం కోసం సాయి సుదర్శన్ పోటీ పడుతున్నాడు. కోల్‌కతా టెస్టులో గిల్ గాయపడ్డ విషయం తెలిసిందే. రెండో టెస్టుకు అందుబాటులో ఉండే అవకాశం లేదు. అయితే, సుదర్శన్ నెట్స్‌లో ఇబ్బంది పడుతున్నట్లు కనిపించాడు. నెట్ బౌలర్లు చాలా ఇబ్బంది పెట్టారు. గంభీర్, బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ సైతం బ్రేక్ టైమ్‌లో సాయి సుదర్శన్‌తో సుదీర్ఘంగా చర్చించారు. ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే.. చాలా సేపు బ్యాటింగ్ చేసిన జడేజాతో సహా ఆరుగురు ప్లేయర్లు మాత్రమే ఆప్షనల్ ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొన్నారు.

## సాయి, పడిక్కల్ కాదు!.. గిల్ స్థానంలో ఊహించని ఆటగాడు



సౌతాఫ్రికాతో రెండో టెస్టుకు టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ దూరం కానున్నట్లు తెలుస్తోంది. మెడ నొప్పి తీవ్రంగా ఉండటంతో అతడు ఈ మ్యాచ్‌కు అందుబాటులో ఉండటం లేదని సమాచారం. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయినా ఇంకా కనీసం మూడు, నాలుగు రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు అతడికి సూచించినట్లు బీసీసీఐ వర్గాలు జాతీయ మీడియాకు వెల్లడించాయి. ప్రస్తుతం విమానంలో ప్రయాణించే పరిస్థితి లేదు కాబట్టి.. గువాహటి వేదికగా రెండో టెస్టుకు అతడు దూరమయ్యే పరిస్థితి ఉందని బీసీసీఐ అధికారి ఒకరు సంకేతాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో తుదిజట్టులో గిల్ స్థానాన్ని మేనేజ్‌మెంట్ ఎవరితో భర్తీ చేస్తారనే చర్చ జరుగుతుండగా.. భారత మాజీ ఓపెనర్ ఆకాశ్ చోప్రా ఊహించని ఆటగాడి పేరు తెరపైకి తెచ్చాడు.

ఈ మేరకు తన యూట్యూబ్ చానెల్ వేదికగా మాట్లాడుతూ.. "రుతురాజ్ గైక్వాడ్‌ను టెస్టు జట్టులోకి తీసుకోవాలా? ఈ మాట వింటే మీకు ఆశ్చర్యం కలుగవచ్చు. ఇప్పటికే సౌతాఫ్రికాతో టెస్టులకు జట్టును ఎంపిక చేసిన తర్వాత రుతు పేరెందుకు? అని మీరు అడుగవచ్చు. రెండో టెస్టులో గిల్ ఆడతాడా? లేదా? అన్న అంశంపై స్పష్టత లేదు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయినా మెడ నొప్పి ఇంకా తగ్గలేదనే సమాచారం ఉంది. ఒకవేళ అతడు మ్యాచ్‌కు పూర్తిగా దూరమైతే.. సాయి సుదర్శన్, దేవ్‌దత్ పడిక్కల్‌లో ఒకరిని ప్లేయింగ్ ఎలెవన్‌లోకి తీసుకుంటారా? ఇప్పటికే తుది జట్టులో ఆరుగురు లెఫ్టాండర్లు ఉన్నారు. మరి అలాంటపుడు మరో ఇద్దరు లెఫ్టాండర్ల (సాయి, పడిక్కల్)లలో ఒకరివైపు మొగ్గుచూపుతారా? అలాంటపుడు మొత్తంగా ఏడుగురు ఎడమచేతి వాటం ఆటగాళ్లను ఆడించాల్సి వస్తుంది.

# స్పోర్ట్స్

## భారత్-బంగ్లాదేశ్ సిరీస్ రద్దు!



భారత్, బంగ్లాదేశ్ మహిళా క్రికెట్ జట్ల మధ్య వచ్చే నెలలో (డిసెంబర్) జరగాల్సిన పరిమిత ఓవర్ల సిరీస్ (మూడు వన్డేలు, మూడు టీ20లు) రద్దైనట్లు తెలుస్తుంది. ఇరు దేశాల మధ్య పెరుగుతున్న రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ఈ సిరీస్‌కు అనుమతి లభించలేదని బీసీసీఐ వర్గాల సమాచారం. ఐసీసీ ఫ్యూచర్ టూర్ ప్రోగ్రామ్‌లో భాగమైన ఈ సిరీస్‌కు సంబంధించి ఖచ్చితమైన తేదీలు, వేదికలు ?ఖరారు కావాల్సి ఉండింది. ఈ లోపే రద్దు నిర్ణయం వెలువడిందంటూ ఓ ప్రముఖ వార్తా సంస్థ వెల్లడించింది. ఈ సిరీస్ జరగాల్సిన సమయంలో (డిసెంబర్ మూడో వారం) బీసీసీఐ ప్రత్యామ్నాయ హోమ్ సిరీస్‌కు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. జనవరి మొదటి వారంలో ప్రారంభమయ్యే మహిళల ప్రీమియర్ లీగ్ దృష్ట్యా ఈ సిరీస్ చిన్నదిగా ఉండే అవకాశం ఉందని సమాచారం?. డబ్ల్యూపీఎల్ తర్వాత టీమిండియా ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లాల్సి ఉంది. కాగా, కొద్ది రోజుల కిందట పురుషుల క్రికెట్‌లో భారత్, బంగ్లాదేశ్ జట్ల మధ్య జరగాల్సిన సిరీస్ వాయిదా పడింది. ఆగస్టులో భారత పురుషుల జట్టు పరిమిత ఓవర్ల సిరీస్ కోసం బంగ్లాదేశ్‌లో పర్యటించాల్సి ఉండింది. అయితే బిజీ షెడ్యూల్ కారణంగా ఆ సిరీస్‌ను వచ్చే ఏడాది సెప్టెంబర్‌కు మార్చారు. ఇదిలా ఉంటే, తాజాగా ముగిసిన మహిళల వన్డే ప్రపంచకప్‌లో భారత్ ఛాంపియన్‌గా అవతరించిన విషయం తెలిసిందే. ఆ టోర్నీలో చివరి జట్టుగా సెమీస్‌కు అర్హత సాధించిన టీమిండియా.. సెమీస్‌లో ఆసీస్‌ను, ఫైనల్స్‌లో దక్షిణాఫ్రికాను చిత్తు చేసి విశ్వవిజేతగా అవతరించింది. భారత మహిళల జట్టుకు ఇదే తొలి ప్రపంచకప్.

# సరికొత్త స్క్రీన్ ప్లేతో రాజ్ తరుణ్ 'టార్టాయిస్'

రాజ్‌తరుణ్, అమృత చౌదరి జంటగా, అవసరాల శ్రీనివాస్, ధన్యా బాలకృష్ణ ప్రధాన పా?త్రల్లో 'టార్టాయిస్' అనే కొత్త సినిమా ఆరంభమైంది. రిత్విక్ కుమార్ దర్శకత్వంలో ప్రశ్విత ఎంటర్‌టైన్మెంట్, ఎస్‌కే గోల్డెన్ ఆర్ట్స్, చందమామ క్రియేషన్స్, ఎన్‌వీఎల్ క్రియేషన్స్‌పై శశిధర్ నల్ల, విజయ్ కుమార్, ఇమ్మడి సంతోష్, రామిశెట్టి రాంబాబు నిర్మిస్తున్నారు. ఈ ప్రారంభోత్సవం సందర్భంగా సినిమా మోషన్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. రాజ్ తరుణ్ మాట్లాడుతూ%-% "టార్టాయిస్' చిత్రం చాలా కొత్తగా, వైవిధ్యంగా ఉంటుంది. నా కెరీర్‌కు కిక్ ఇచ్చే చిత్రం ఇది" అని తెలిపారు. "సరికొత్త స్క్రీన్ ప్లేతో సాగే థ్రిల్లర్ చిత్రం ఇది" అన్నారు రిత్విక్ కుమార్. "త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ఆరంభిస్తాం" అని శశిధర్ నల్ల, విజయ్ కుమార్, సంతోష్ ఇమ్మడి, రామిశెట్టి రాంబాబు పేర్కొన్నారు. ఈ చిత్రానికి చంద్రబోస్ లిరిక్స్ అందిస్తుండగా, అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్నారు.



# ఫస్ట్ టైం రవితేజకు జోడీగా ఆ స్టార్ హీరోయిన్

## అమ్మడి లక్ మాస్ రాజాకు కలిసొస్తుందా..!!

మాస్ మహారాజా రవితేజకు బ్యాడ్ లక్ వెంటాడుతుంది. వరుస గా సినిమాలు చేస్తున్నప్పటికీ అవి ప్రేక్షకులను మెప్పించలేకపోతున్నాయి. కొత్త కొత్త దర్శకులతో పని చేస్తున్నా కూడా ఒక్కటీ వర్కౌట్ కావడం లేదు.. అలాగే స్టార్ దర్శకులు కూడా రవితేజకు హిట్ ఇవ్వలేకపోయారు. మొన్నామధ్య హరీష్ శంకర్ దర్శకత్వంలో వచ్చిన మిస్టర్ బచ్చన్ డిజాస్టర్ అయ్యింది. నిన్నటికి నిన్న మాసుజాతర అంటూ ప్రేక్షకుల ముందుకు వచ్చినా అది కూడా బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టింది. దాంతో రవితేజ ఫ్యాన్స్ నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ఒక్క సినిమా ఒకే ఒక్క సినిమా పడితే రవితేజ తిరిగి ఫామ్ లోకి వస్తారని ఫ్యాన్స్ ఈగర్ గా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం రవితేజ మరో కొత్త సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. భర్తమహాశయులకు విజ్ఞప్తి అనే ఇంట్రెస్టింగ్ టైటిల్ తో తెరకెక్కుతున్న ఈ సినిమాకు కిషోర్ తిరుమల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా నుంచి ఇటీవలే ఓ గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ సినిమాలో ఆషిక రంగనాథ్, డింపుల్ హయతి హీరోయిన్స్ గా నటిస్తున్నారు. ఇదిలా ఉంటే ఇప్పుడు మాస్ రాజా మరో సినిమాను లైనప్ చేశాడని తెలుస్తుంది. శివ నిర్వాణ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాడని తెలుస్తుంది. ఇక ఈ సినిమాలో ఓ స్టార్ హీరోయిన్‌ను సెలక్ట్ చేశారని తెలుస్తుంది. ఇంతకూ ఆ హీరోయిన్ ఎవరో తెలుసా..? ఆమె ఎవరో కాదు స్టార్ హీరోయిన్ సమంత. గతంలో శివ నిర్వాణ దర్శకత్వంలో సమంత రెండు సినిమాలు చేసింది. ఒకటి నాగచైతన్య హీరోగా నటించిన మజిలీ. అలాగే విజయ్ దేవరకొండ హీరోగా నటించిన ఖుషి సినిమా. ఇక ఇప్పుడు మరోసారి శివ నిర్వాణ దర్శకత్వంలో సమంత నటిస్తుందని అంటున్నారు. ఈసారి రవితేజకు జోడీగా సామ్ నటిస్తుంది. మొదటిసారి సమంత రవితేజ కలిసి నటిస్తున్నారు. మరి సమంత అయినా రవితేజకు హిట్ ఇస్తుందేమో చూడాలి.






# పవర్‌ఫుల్ క్వీన్‌గా నయనతార!

లేడీ సూపర్‌స్టార్ నయనతార టాలీవుడ్‌లో మళ్లీ బిజీ అయింది. కొన్నాళ్ల పాటు తెలుగు తెరపై అంతగా కనిపించని నయన్..ఇప్పుడు వరుస సినిమాలతో దూసుకెళ్తుంది. ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవి సరసన 'మన శంకర్ వరప్రసాద్ గారు' చిత్రంలో నటిస్తోంది. దీంతో పాటు సీనియర్ హీరో నందమూరి బాలకృష్ణ కొత్త సినిమాలోనూ నయన్ హీరోయిన్‌గా నటించబోతోంది. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో బాలయ్య ఓ సినిమా చేయబోతున్న సంగతి తెలిసిందే. ఇందులో బాలయ్యకు జోడీగా నయనతార నటించబోతున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. నేడు(నవంబర్ 18) నయనతార బర్త్‌డే. ఈ సందర్భంగా ఓ స్పెషల్ వీడియోని రిలీజ్ చేశారు మేకర్స్. ఇందులో నయనతార పవర్‌ఫుల్ మహారాణి పాత్రలో కనిపించబోతున్నట్లు నిర్మాణ సంస్థ వెల్లడించింది. 'సముద్రమంత ప్రశాంతతను, తుపాను అంత బీభత్సాన్ని తనలో మోసే రాణి మా సామ్రాజ్యంలోకి అడుగుపెట్టనుంది' అంటూ వీడియోతో ద్వారా చిత్ర యూనిట్ నయనతారకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపింది. కాగా, బాలయ్యతో నయనతార ఇప్పటికే మూడు సినిమాల్లో నటించింది. తొలుత సింహా చిత్రంలో వీరిద్దరు కలిసి నటించారు. ఆ తర్వాత 'జై సింహా', 'శ్రీరామరాజ్యం' చిత్రాల్లోనూ ఈ హిట్ జోడీ రిపీట్ అయింది. ఇప్పుడు నాలుగోసారి వెండితెరపై ఈ జంట అలరించబోతుంది. గతంలో మలినేని గోపిచంద్, బాలయ్య కాంబోలో వచ్చిన 'వీరసింహారెడ్డి' సూపర్ హిట్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మరోసారి ఈ కాంబో రిపీట్ కావడంతో ఈ చిత్రంపై ఆసక్తి నెలకొంది.



# ఒకే ఫ్రేమ్‌లో రుద్ర, మందాకిని, కుంభ.. ట్రెండింగ్‌లో వారణాసి యాక్టర్ల సెల్ఫీ

తెలుగు ప్రేక్షకులతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న మూవీ లవర్స్ ఎక్జయిటింగ్‌గా ఎదురుచూస్తున్న ప్రాజెక్ట్ వారణాసి ఎస్ఎస్ రాజమౌళి డైరెక్షన్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో మహేశ్ బాబు లీడ్ రోల్‌లో, బాలీవుడ్ భామ ప్రియాంకా చోప్రా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. మాలీవుడ్ స్టార్ యాక్టర్ పృథ్వీరాజ్ సుకుమార్ కీ రోల్‌లో నటిస్తున్నాడు. ఈ ముగ్గురూ పలు అంతర్జాతీయ మీడియా సంస్థలతో చిట్‌చాట్ చేశారని తెలిసిందే. ఓ ఇంటర్వ్యూ పూర్తయిన తర్వాత ప్రియాంకా చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్, మహేశ్ బాబు సెల్ఫీ దిగారు. ఇందులో ప్రియాంకా చోప్రా మందాకిని పాత్రలో కనిపించనుంది. మహేశ్ బాబు రుద్రగా కనిపించనుండగా.. పృథ్వీరాజ్ సుకుమారన్ కుంభ రోల్‌లో నటిస్తున్నాడు. ప్రపంచమంతా చుట్టేయబోతున్న కథలోని ముఖాలు.. ముగ్గురి కలయికలో డిఫరెంట్ హిట్ ఉండబోతుందనే క్యాప్షన్‌తో మహేశ్ బాబు టీం పోస్ట్ చేసిన ఈ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. గ్లోబ్ ట్రాటర్ ఈవెంట్‌లో లాంచ్ చేసిన టైటిల్ గ్లింప్స్‌లో మహేశ్ బాబు త్రిశూలాన్ని చేతపట్టుకుని ఎద్దు (నంది)పై స్వారీ చేస్తున్న విజువల్స్ నెట్టింటిని షేక్ చేస్తున్నాయి. ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రం రెండు పార్టులుగా రాబోతుంది. ఈ మూవీని 2027, 2029లలో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నట్టు వార్తలు వస్తుండగా జక్కన్న టీం నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.

# బ్లాక్ బస్టర్ సినిమాలన్నీ వదులుకుంది.. ఇప్పుడు హిట్స్ లేక సతమతం



సినిమా ఇండస్ట్రీలో హిట్స్, ఫ్లాప్స్ అనేవి చాలా కామన్. హీరోలు, హీరోయిన్స్ చాలా మంది హిట్స్, ఫ్లాప్స్ తో సంబంధం లేకుండా వరుసగా సినిమాలు చేస్తూ దూసుకుపోతున్నారు. కొంతమంది మాత్రం ఫ్లాప్స్ వస్తే కనిపించకుండా పోతారు. ముఖ్యంగా హీరోయిన్స్.. సినిమాలు ఫ్లాప్ అయితే చాలు ఐరెన్ లెగ్ అని ట్యాగ్ వేసేస్తారు. సినిమా అవకాశాలు కూడా తగ్గిపోతాయి.. క్రమంగా ఇండస్ట్రీలో కనిపించకుండాపోతారు.. కానీ ఈ హీరోయిన్ రూటే సపరేట్.. 20ఏళ్లుగా ఒక్క హిట్ అందుకోలేకపోయింది.. ఇరవై ఏళ్లకు పైగా సినీ ఇండస్ట్రీలో ఉంది ఈ ముద్దుగుమ్మ. అలాగే ఇరవై ఏళ్లుగా హిట్స్ మాత్రం అందుకోలేకపోయింది. కానీ ఆమె క్రేజ్ మాత్రం ఎక్కడ తగ్గలేదు. అందంలో అప్సరస.. గ్లామర్ డోస్ కూడా ఎక్కువే.. కానీ అదృష్టం మాత్రం దక్కలేదు ఈ చిన్నదానికి.. ఇంతకూ ఆమె ఎవరంటే..! బాలీవుడ్ ముద్దుగుమ్మ చిత్రాంగదా సింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. చిత్రాంగదా రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో జన్మించి, అక్కడే పెరిగింది. బాలీవుడ్ సినిమాలతో పాపులర్ అయ్యింది. 2005లో హజారోన్ ఖ్వైషీన్ ఐసీ అనే క్రైమ్ డ్రామాతో సినీ రంగంలోకి అడుగుపెట్టింది. మోడలింగ్ నుంచి హీరోయిన్ గా మారింది ఈ చిన్నది. హీరోయిన్ గానే కాదు నిర్మాతగానూ చేసింది. 2018లో సూర్మా అనే స్పోర్ట్స్ డ్రామాకు నిర్మాతగా వ్యవహరించింది. ఇటీవలే హౌస్‌ఫుల్ 5 సినిమాలోనూ కనిపించింది ఈ ముద్దుగుమ్మ. సినీ కెరీర్ లో చిత్రాంగదా సింగ్ తొమ్మిదేళ్ల పాటు సినిమాలకు దూరంగా ఉంది. ఆ సమయంలో ఎన్నో బ్లాక్ బస్టర్ హిట్స్ మిస్ చేసుకుంది. అలాగే గతంలో ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఆసక్తికర కామెంట్స్ చేసింది. కెరీర్ లో నేను ఎన్నో తప్పులు చేశాను. నేను ఎన్నో బ్లాక్ బస్టర్ సినిమాలను మిస్ చేసుకున్నా.. గ్యాంగ్‌స్టర్ సినిమా నేను రిజెక్ట్ చేశా.. అంతే కాదు తను వెడ్స్ మను సినిమాను కూడా నేను మిస్ చేసుకున్నా.. మంగల్ పాండే'లో అమీషా పటేల్ చేసిన పాత్రను కూడా నేను రిజెక్ట్ చేశా.. అని తెలిపింది. సినిమాలు నిరాశపరిచినప్పటికీ ఆమె నటనకు ఎప్పుడూ మంచి మార్కులే పడ్డాయి. కానీ కమర్షియల్‌గా పెద్ద హిట్స్ లేకపోవడం ఆమె కెరీర్‌కు మైనస్‌గా మారింది. ఇప్పటికి కూడా ఈ ముద్దుగుమ్మ సినిమాల్లో అవకాశాలు అందుకుంటుంది.

Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,